సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 5.50
సంపుటి: 15 సంచిక: 162
శుక్రవారం 2-9-2022
SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రతి రైతూ వాణిజ్యవేత్తగా మారాలి'



క్వార్టర్ ఫైనల్‌లో ప్రణయ్

జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో సత్తా చూపిన భారత స్టార్ షట్లర్ - 13లో



జీఎస్టీ వసూళ్లు 28% అప్

దేశవ్యాప్తంగా ఆగస్టులో రూ. 1.43 లక్షల కోట్లు వసూలు - 13లో



లీకులతో గందరగోళం

రాజ్‌భవన్ లీకుల వల్ల రాజకీయ గందరగోళం తలెత్తిందని జార్ఖండ్‌లోని యూపీఏ కూటమి ఆరోపించింది.

వివరాలు 6లో



గోర్బచెవ్ అస్తమయం

సోవియెట్ యూనియన్ చివరి అధ్యక్షుడు మిఖాయిల్ గోర్బచెవ్ అనారోగ్యంతో మాస్కోలో కన్నుమూశారు.

వివరాలు 6లో



నెగ్గిన 'కేజ్రీవాల్'

విశ్వాస పరీక్షలో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సునాయాసంగా విజయం సాధించారు.

వివరాలు 6లో

'నాటు' ఊబి దాటించాలి

నాటుసారా తయారీ కుటుంబాలకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పనపై దృష్టి పెట్టాలి: సీఎం జగన్

- వారు గౌరవప్రదమైన ఆదాయం పొందేలా తోడ్పాటు
- గంజాయి సాగు నిర్మూలనకు ప్రణాళికాబద్ధంగా ముందుకు
- వ్యవసాయ పంటల సాగుతో వారి జీవనోపాధికి ఊతం
- విత్తనాలతోపాటు ఆర్వోఎఫ్‌ఆర్ పట్టాలు, రైతు భరోసా ఇవ్వాలి
- వివిధ శాఖలపై సమీక్షలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- బెల్టుషాపుల ఎత్తివేత, ధరల పెంపుతో గణనీయంగా మద్యం నియంత్రణ
- యువత మత్తు మందులకు లోను కాకుండా గట్టి చర్యలు
- ప్రతి కాలేజీ, వర్సిటీ ఎదుట ఎస్‌ఈబీ నంబర్‌తో బోర్డులు
- అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఏసీబీ నంబర్ 14400 డిస్‌ప్లే
- పాస్‌పోర్టు ఆఫీసు తరహాలో సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులకు కొత్తరూపు

2లో



వైఎస్సార్ జిల్లా వేల్పులలో గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

స్ఫూర్తి సముదాయం వేల్పులలో మోడల్ సచివాలయ ప్రాంగణం ప్రారంభోత్సవంలో సీఎం 2లో

ఏది నిజం?

నిజాలు చెప్పలేక రామోజీ యాతన!

- ఛాతీ ఆసుపత్రిలో ప్రసవాలెందుకు చేస్తారు?
- అనంతపురం చెస్ట్ ఆస్పత్రిలో చేయట్లేదని 'ఈనాడు' గగ్గోలు
- పులివెందుల ఆసుపత్రిలో 23కు గాను 17 మంది వైద్యులు
- కానీ 22 మందికి గాను 10 మందే ఉన్నారంటూ అసత్యాలు
- సాధారణ, సిజేరియన్.. ఏ ప్రసవానికైనా 'ఆరోగ్యశ్రీ'

- వివరాలు 4లో

నగదు కోసమే దంపతుల హత్య

- వీడిన నెల్లూరు దంపతుల హత్య కేసు మిస్టరీ
- పనోడే సూత్రధారి.. మరో వ్యక్తితో కలిసి ఘాతుకం
- ఎట్టకేలకు నిందితుల అరెస్ట్
- వాస్తవాలు తెలుసుకోకుండా టీడీపీ, ఎల్లో మీడియా తప్పుడు ప్రచారం
- ఈ నేరాన్ని వైఎస్సార్‌సీపీపైకి నెట్టేందుకు విఫలయత్నం

- వివరాలు 5లో

ఒంగోలులోని దక్షిణం బజారులో లక్ష్మమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ శంకర్



మొదటి రోజే రూ.1,420.84 కోట్ల

పింఛన్ల పంపిణీ

55.90 లక్షల మంది పింఛన్‌దారులకు అందిన డబ్బు 2లో

మార్గనిర్దేశకుడు

వైఎస్సార్

- పాలనకు మానవత్వాన్ని జోడించిన దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి
- సంక్షేమాభివృద్ధి పథకాలు.. సుపరిపాలనతో తెలుగు నేలపై తనదైన ముద్ర
- ఆయన పథకాలు అనేక రాష్ట్రాలతో పాటు కేంద్రంలోనూ అమలు
- నేడు దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి 13వ వర్ధంతి

10లో

క్లుప్తంగా

సచివాలయ ఉద్యోగుల ఔదార్యం

- ఏడాదిన్నరగా వృద్ధురాలికి ప్రతి నెల రూ.2,000 సాయం
- సాంకేతిక కారణాలు సరిచేసి పింఛన్ మంజూరు చేసిన ప్రభుత్వం



రాజమ్మకు పింఛన్ అందజేస్తున్న హరిత, విజయలక్ష్మి, గణేష్

మండపేట : వయసు తక్కువగా ఉండటంతో పింఛన్ ఆగిపోయిన మహిళ దీనస్థితిని చూసి చలించిపోయి ఏడాదిన్నరగా ప్రతి నెల రూ.2,000 చొప్పున తమ జీతం నుంచి సాయం అందిస్తూ ఔదార్యాన్ని చాటుకున్నారు కోనసీమ జిల్లా మండపేటలోని 3వ వార్డు సచివాలయ ఉద్యోగులు. తాజాగా, ఆమెకు రూ.2,500 పింఛన్ మంజూరు కాగా, గురువారం అందించారు. గతంలో నిర్వహించిన వెరిఫికేషన్‌లో మండపేటకి చెందిన పి.రాజమ్మకు వయసు తక్కువగా ఉండటంతో పింఛన్ ఆగిపోయింది. పునరుద్ధరించేందుకు సచివాలయ అడ్మిన్ సెక్రటరీ జి.శ్రీసత్యహరిత పలు ప్రయత్నాలు చేసినా ఫలించలేదు. కాకినాడ డీఆర్‌డీఏ అధికారుల వద్దకు పంపినా సాంకేతిక కారణాలు అడ్డంకిగా మారాయి. నిరుపేద అయిన రాజమ్మ దీనస్థితిని చూసి చలించిపోయిన హరిత, మహిళా కానిస్టేబుల్ విజయలక్ష్మి, వెల్ఫేర్ సెక్రటరీ గణేష్ ప్రతి నెల తమ జీతం నుంచి రూ.2,000 మొత్తాన్ని ఏడాదిన్నరగా ఆమెకు అందజేస్తూ వచ్చారు. సాంకేతిక లోపాలు సరిజేసేందుకు ప్రభుత్వం వెసులుబాటు ఇవ్వడంతో ఆగస్టు నుంచి రాజమ్మకు కొత్త పింఛన్ మంజూరైంది. తనకు ఇంతకాలం సాయం అందించి ఆదుకోవడంతోపాటు పింఛను మంజూరు చేయించిన సచివాలయ ఉద్యోగులకు రాజమ్మ కృతజ్ఞతలు తెలిపింది.

గ్రామీణ స్థానిక సంస్థలకు నిధులు

- గ్రాంట్ ఇన్ ఎయిడ్ విడుదల చేసిన కేంద్రం
- ఏపీకి రూ.569.01 కోట్లు



సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ సహా ఐదు రాష్ట్రాల్లోని గ్రామీణ స్థానిక సంస్థలకు కేంద్రం రూ.4,189.58 కోట్ల గ్రాంట్ ఇన్ ఎయిడ్ విడుదల చేసింది. ఏపీకి రూ.569.01 కోట్లు, కర్ణాటకకు రూ.628.07 కోట్లు, త్రిపురకు రూ.44.10 కోట్లు, ఉత్తరప్రదేశ్‌కు రూ. 2,239.80 కోట్లు, గుజరాత్‌కు రూ.708.60 కోట్లు విడుదల చేసినట్లు కేంద్ర ఆర్థికశాఖ తెలిపింది. కర్ణాటక, త్రిపుర, ఉత్తర ప్రదేశ్‌లకు విడుదలైన నిధులు 2022–23 సంవత్సరానికి సంబంధించిన టైడ్ గ్రాంట్లలో 1వ విడత కాగా, ఆంధ్రప్రదేశ్, గుజరాత్‌లకు విడుదలైనవి 2021–22 సంవత్సరపు టైడ్ గ్రాంట్ల 2వ విడత అని వివరించింది. పారిశుద్ధ్యం, బహిరంగ మల విసర్జన రహిత నిర్వహణ, తాగునీటి సరఫరా, వర్షపునీటి సేకరణ, నీటి రీసైక్లింగ్ అనే కీలకమైన సేవలను మెరుగుపరిచేందుకు తాగునీరు, పారిశుద్ధ్య శాఖల సూచనలతో గ్రామీణ స్థానిక సంస్థలకు 15వ ఆర్థిక సంఘం సిఫార్సు మేరకు టైడ్ గ్రాంట్లు విడుదలయ్యాయని పేర్కొంది. పంచాయతీరాజ్ సంస్థలకు కేటాయించిన గ్రాంట్ ఇన్ ఎయిడ్‌లో 60 శాతం జాతీయ ప్రాధాన్యతలైన తాగునీటి సరఫరా, వర్షపునీటి సంరక్షణ, పారిశుద్ధ్యం కోసం కేటాయించారని, 40 శాతం అన్ టైడ్ నిధులు స్థానిక నిర్దిష్ట అవసరాల కోసం పంచాయతీరాజ్ సంస్థల విచక్షణ ప్రకారం వినియోగిస్తారని వివరించింది. 2022–23లో ఇప్పటివరకు గ్రామీణ స్థానిక సంస్థలకు రూ.15,705.65 కోట్లు విడుదల చేసినట్లు తెలిపింది.

ఇదండీ సంగతి



... ఇంతకాలం మీ ఫ్రెండ్స్‌గా ఉండి ఏం లాభమని వెళ్లిపోతున్నార్సార్!



అనంతపురం హమాలీకాలనీలో ఒకే కుటుంబంలోని ఐదుగురు దివ్యాంగులకు పింఛన్ ఇస్తున్న వలంటీర్ సుహాసిని



తిరుపతి ఆస్పత్రిలో అన్నమయ్య జిల్లా దేవపట్ల వాసి సుభాన్‌కు పెన్షన్ ఇస్తున్న వలంటీర్ చైతన్య



విజయవాడలో కాశమ్మకు పింఛను ఇస్తున్న నిండు గర్భిణి వలంటీర్ భారతి



శ్రీకాకుళంలోని చెరువుగట్టు వద్ద అన్నపూర్ణమ్మకు వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ఇందుమతి



గుంటూరులోని రామిరెడ్డినగర్‌కు చెందిన మహ్మద్‌వలీకి దివ్యాంగ పింఛన్ అందజేస్తున్న వలంటీరు దివ్య



నంద్యాల జిల్లా కోవెలకుంట్లలో వెంకటలక్ష్మమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ప్రసన్న రాణి



విజయనగరం లంకవీధిలో లేవలేని స్థితిలో ఉన్న సన్యాసమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీరు శ్రీవాణి



ఏలూరు తంగెళ్లమూడిలో వృద్ధురాలు లక్ష్మీకాంతానికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ కేశవరావు



విశాఖలోని అప్పుఘర్ ఫిషర్‌మెన్ కాలనీలో దాసరి ఎర్రమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ పూర్ణ



బెంగళూరు ఆస్పత్రిలో చిత్తూరు జిల్లా నడింపల్లెకు చెందిన సుజాతకు పింఛన్ ఇస్తున్న వలంటీర్ నీలకంఠ



నెల్లూరులో యానాదమ్మకు పింఛన్ ఇస్తున్న వెల్ఫేర్ సెక్రటరీ లక్ష్మి సౌజన్య



కాకినాడ ఆస్పత్రిలో తూర్పు గోదావరి జిల్లా చిట్యాలకు చెందిన నాగమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ శ్రీనివాసరావు

తొలిరోజే రూ.1,420.84 కోట్ల

పింఛన్ల పంపిణీ

- 55.90 లక్షల మంది పింఛన్‌దారులకు అందిన డబ్బు
- తొలిరోజే 89.10 శాతం మందికి పంపిణీ పూర్తి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఈ నెల 62.70 లక్షల మందికి ప్రభుత్వం పింఛన్లను మంజూరు చేసింది. తెల్లవారుజాము నుంచే వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి వీరికి పింఛన్లు అందజేశారు. రాత్రి 8 గంటల సమయానికి 55.90 లక్షల మందికి పంపిణీ పూర్తయ్యింది. మొత్తం అర్హుల్లో 89.10 శాతం మందికి రూ.1,420.84 కోట్లను ఇచ్చినట్లు ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు తెలిపారు.

'నాటు' ఊబి దాటించాలి

సాక్షి, అమరావతి: నాటుసారా తయారీలో కూరుకుపోయిన కుటుంబాలను దాని నుంచి బయటకు తీసుకొచ్చి ఆర్థిక పరిస్థితులు మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలని అధికార యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. ఆయా కుటుంబాలు స్వయం ఉపాధితో గౌరవప్రదమైన ఆదాయాన్ని పొందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గంజాయి సాగును నివారించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగడంతో పాటు జీవనోపాధి కోసం ప్రత్యామ్నాయాలను సూచించాలన్నారు. ఇతర వ్యవసాయ పంటలను సాగు చేసేందుకు అవసరమైన విత్తనాలు, సహాయ సహకారాలు అందించాలని నిర్దేశించారు. దీంతోపాటు క్రమం తప్పకుండా గంజాయి సాగుపై దాడులు నిర్వహించాలని స్పష్టం చేశారు. గంజాయి సాగును విడనాడి ఇతర వ్యవసాయ పంటలు సాగు చేస్తున్న వారికి ఆర్వోఎఫ్ఆర్ పట్టాలిచ్చి వారికి రైతు భరోసా కూడా వర్తింప చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో షాక్ కొట్టేలా రేట్లు పెంచడంతో మద్యం వినియోగం గణనీయంగా తగ్గిందన్నారు. బెల్టు షాపులను ఎత్తివేయడం, ధరలు విపరీతంగా పెంచడం ద్వారా మద్యం వినియోగాన్ని బాగా నియంత్రించామని తెలిపారు. ఎక్సైజ్, రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్లు, రవాణా, గనులు, అటవీ, పర్యావరణ శాఖలపై ముఖ్యమంత్రి జగన్ గురువారం తన క్యాంపు కార్యాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. లీకేజీలు లేకుండా పారదర్శక విధానాలు అమలు చేయాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

కాలేజీలు, వర్సిటీల ఎదుట ఎస్ఈబీ నంబర్ డిస్‌ప్లే

మాదక ద్రవ్యాలు, గంజాయి లాంటి వాటికి విద్యార్థులు, యువత లోనుకాకుండా గట్టి చర్యలు తీసుకోవాలి. ప్రతి కాలేజీ, యూనివర్సిటీ ఎదుట ఎస్ఈబీ నంబర్‌ను ప్రదర్శించాలి. ఎస్ఈబీ నంబర్‌తో డిస్‌ప్లే బోర్డులు పెట్టాలి. మాదక ద్రవ్యాలకు సంబంధించిన వ్యవహారాలు ఎక్కడా ఉండకూడదు. కలెక్టర్లతో సమన్వయం చేసుకుంటూ సెప్టెంబరు నెలాఖరుకల్లా ఈ బోర్డులు ఏర్పాటు చేయాలి.

గంజాయి సాగుపై దాడులు

గంజాయి సాగును నివారించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలి. జీవనోపాధి కోసం ప్రత్యామ్నాయాలను సూచించాలి. ఆహార ధాన్యాలు, ఇతర పంటలను సాగు చేసేందుకు అవసరమైన విత్తనాలు, సహకారాన్ని అందించాలి. దీంతోపాటు క్రమం తప్పకుండా గంజాయి సాగుపై దాడులు నిర్వహించాలి.

గనుల నిర్వహణపై పరిశీలన

మైనింగ్‌కు సంబంధించి అన్ని రకాల అనుమతులు పొంది లైసెన్స్‌లు తీసుకున్న వారు ఆ గనులను నిర్వహిస్తున్నారా? లేదా? అన్నది పరిశీలన చేయాలి. జిల్లాను ఒక యూనిట్‌గా తీసుకుని కలెక్టర్‌తో కలిసి పరిశీలించాలి. లైసెన్స్‌లు పొందిన చోట ఆపరేషన్‌లో ఉండేలా చూడాలి. ఒకవేళ ఆపరేషన్‌లో లేకపోతే కారణాలను అన్వేషించి తగిన చర్యలు తీసుకోవాలి. ఏమైనా సమస్యలుంటే సానుకూలంగా పరిష్కరించే ప్రయత్నాలు చేయాలి. అన్ని అనుమతులూ పొంది నిర్వహణలో లేకపోతే ఆదాయాలు రావు.

ఎర్రచందనం విక్రయంలో పారదర్శకత

ఎర్రచందనం విక్రయానికి అన్ని రకాల అనుమతులు వచ్చాయని అధికారులు వెల్లడించారు. అక్టోబరు – మార్చి మధ్య 2,640 మెట్రిక్ టన్నుల విక్రయానికి ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు. ఎర్రచందనం విక్రయంలో అత్యంత పారదర్శక విధానాలు పాటించాలని, గ్రేడింగ్‌లో థర్డ్ పార్టీతో కూడా పరిశీలన చేయించాలని సీఎం జగన్ సూచించారు. గంజాయి సాగును గుర్తించిన చోట్ల ఇతర పంటల సాగు చేపట్టేందుకు ప్రభుత్వం తరఫున ఇప్పటికే విత్తనాలు అందించామని అధికారులు వివరించారు. 2,500 ఎకరాల్లో ఇతర పంటలు సాగు చేస్తున్నట్లు చెప్పారు. పండించిన పంటలను జీసీసీ ద్వారా కొనుగోలు చేస్తామన్నారు. 1,600 ఎకరాల్లో ఉద్యాన పంటల సాగుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మిగిలిన చోట్ల ఎక్కడైనా గంజాయి సాగు చేస్తే దాడులు నిర్వహించి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సమీక్షలో ఉప ముఖ్యమంత్రి (ఎక్సైజ్ శాఖ) కె.నారాయణస్వామి, రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, విద్యుత్, అటవీ పర్యావరణ, భూగర్భ గనుల శాఖమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, సీఎస్ సమీర్ శర్మ, డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి, అడిషనల్ డీజీ ఎ.రవిశంకర్, అటవీ పర్యావరణశాఖ స్పెషల్ సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్, పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ స్పెషల్ సీఎస్ వై. శ్రీలక్ష్మి, ఎక్సైజ్, రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ స్పెషల్ సీఎస్ రజత్ భార్గవ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, రవాణాశాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, హోంశాఖ ముఖ్య కార్యదర్శి హరీష్ కుమార్, ఆర్థికశాఖ కార్యదర్శి గుల్జార్, ఏపీ సీఆర్డీఏ కమిషనర్ వివేక్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఏసీబీ నంబర్ 14400తో బోర్డులు

అవినీతి కార్యకలాపాల నిర్మూలనకు ఏసీబీ నంబర్ 14400 అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద కనిపించాలి. దీనికోసం కచ్చితంగా బోర్డులు అమర్చాలి. గ్రామ సచివాలయాల నుంచి కలెక్టర్ కార్యాలయం వరకూ, పోలీస్‌స్టేషన్ నుంచి ఎస్పీ కార్యాలయం వరకూ, పీడీఎస్ షాపుల వద్ద కూడా ఈ నంబర్‌తో బోర్డులు కనిపించాలి. అన్ని ప్రభుత్వ విభాగాధిపతులతో మాట్లాడి దీన్ని అమలు చేయాలి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు కొత్తరూపు ఇవ్వాలి. పాస్‌పోర్టు ఆఫీసుల తరహాలో వీటిని తీర్చిదిద్దాలి.

గణనీయంగా తగ్గిన మద్యం వినియోగం

- రాష్ట్రంలో మద్యం వినియోగం బాగా తగ్గిందని అధికారులు తెలిపారు. 2018–19లో లిక్కర్ అమ్మకాలు 384.31 లక్షల కేసులు కాగా 2021–22లో ఏకంగా 278.5 లక్షల కేసులకు తగ్గినట్లు పేర్కొన్నారు.
- 2018–19లో బీరు అమ్మకాలు 277.10 లక్షల కేసులు కాగా 2021–22లో గణనీయంగా 82.6 లక్షల కేసులకు తగ్గిపోయాయి.
- 2018 – 19లో మద్యం విక్రయాలపై ఆదాయం రూ.20,128 కోట్లు కాగా 2021 – 22లో ఆదాయం రూ.25,023 కోట్లుగా ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.
- గత ఆర్నెల్లలో అక్రమ మద్యం తయారీ, రవాణా, గంజాయిలకు సంబంధించి మొత్తం 20,127 కేసులు నమోదయ్యాయి. 16,027 మందిని అరెస్టు చేసి 1,407 వాహనాలు సీజ్ చేశారు. నాటుసారా తయారీనే వృత్తిగా ఉన్న గ్రామాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టినట్లు అధికారులు తెలిపారు.

స్ఫూర్తి సముదాయం


మోడల్ సచివాలయ ప్రాంగణం ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్

- వైఎస్సార్ జిల్లా వేల్పులలో ఆధునిక వసతులతో ఒకేచోట అన్ని భవనాలు
- సచివాలయం, ఆర్బీకే, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, వ్యవసాయ సహకార పరపతి సంఘం, డిజిటల్ లైబ్రరీ, తపాలాశాఖ కార్యాలయం, శుద్ధినీటి కేంద్రం, బస్సు షెల్టర్ నిర్మాణం















వేల్పులలో గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన ప్రభుత్వ భవనాల సముదాయం

సాక్షి ప్రతినిధి, కడప: అధునాతన హంగులతో వైఎస్సార్ జిల్లా వేల్పుల గ్రామంలో రూపుదిద్దుకున్న గ్రామ సచివాలయ భవన సముదాయం రాష్ట్రానికి స్ఫూర్తిదాయకంగా నిలిచిందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రశంసించారు. పులివెందుల నియోజకవర్గం వేముల మండలం వేల్పులలో నిర్మించిన మోడల్ సచివాలయ భవన ప్రాంగణాన్ని ముఖ్యమంత్రి జగన్ గురువారం సాయంత్రం సందర్శించి ప్రారంభించారు. రూ.3.22 కోట్లతో అత్యాధునిక వసతులతో ఒకే ప్రాంగణంలో గ్రామ సచివాలయ వ్యవస్థకు సంబంధించిన భవన సముదాయాలను ఇక్కడ నిర్మించారు. సచివాలయ భవనంతో పాటు ఆర్బీకే, వైఎస్సార్ హెల్త్‌క్లినిక్, వ్యవసాయ సహకార పరపతి సంఘం, డిజిటల్ లైబ్రరీ, తపాలాశాఖ కార్యాలయం, శుద్ధి నీటి కేంద్రం, ఓవర్ హెడ్ ట్యాంక్, బస్సు షెల్టర్ తదితరాలతో రాష్ట్రంలో మోడల్ ప్రాంగణంగా నిర్మాణం చేపట్టారు. కడప–పులివెందుల ప్రధాన మార్గం పక్కనే ఎకరం స్థలంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో సచివాలయ భవన సముదాయాన్ని అధునాతన హంగులతో తీర్చిదిద్దడం అభినందనీయమని సీఎం జగన్ పేర్కొన్నారు. స్థానిక నాయకులు, జిల్లా యంత్రాంగం తీసుకున్న ప్రత్యేక శ్రద్ధ భవనాల నిర్మాణంలో ప్రస్ఫుటంగా కనిపిస్తోందన్నారు.

వలంటీర్లను పలుకరిస్తూ.. కలియదిరుగుతూ..

మూడు రోజుల జిల్లా పర్యటనలో భాగంగా గురువారం మధ్యాహ్నం 3.15 గంటలకు ముఖ్యమంత్రి జగన్ ప్రత్యేక విమానంలో విజయవాడ నుంచి కడప చేరుకున్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, పలువురు ఉన్నతాధికారులు ఆయన వెంట ఉన్నారు. వర్షం పడుతుండటంతో 3.25 గంటలకు కడప నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరారు. 4.40 గంటలకు వేల్పుల చేరుకుని సచివాలయ సముదాయాన్ని ప్రారంభించి అన్ని భవనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. సచివాలయం, వైఎస్సార్ విలేజ్ హెల్త్‌క్లినిక్, రైతు భరోసా కేంద్రంతో పాటు అన్ని కార్యాలయాలలో కలియదిరిగారు. గ్రామ సచివాలయంలో సీఎం జగన్ అరగంటకు పైగా గడిపారు. వలంటీర్లు, సిబ్బందితో మాట్లాడారు. విధులపై ఆరా తీశారు. వైఎస్సార్ చేయూత ఎంత మందికి ఇచ్చారని ప్రశ్నించారు. ప్రభుత్వ పథకాలు అందుకున్న లబ్ధిదారుల వివరాలను ప్రదర్శించాలని ఆదేశించారు. ఈ–క్రాప్ ఎలా చేస్తున్నారని ఆరా తీశారు. ఆర్బీకేలో 20 నిమిషాలకు పైగా గడిపి అందరినీ పేరుపేరునా పలుకరించారు. 2021–22కి సంబంధించి 650 మందికి ఇన్సూరెన్స్ అందలేదని స్థానిక నేతలు వినతిపత్రం అందచేయడంతో తగిన చర్యలు తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చారు. వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో డాక్టర్, సిబ్బందిని పలకరించి ప్రజలకు అందిస్తున్న సేవలను సీఎం అడిగి తెలుసుకున్నారు. ఏ ఒక్కరికీ ఇబ్బంది లేకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. అన్ని కార్యాలయాల్లో సిబ్బందిని పేరుపేరునా పలుకరించారు. ఉద్యోగులు, సిబ్బంది ఎంతమంది ఉన్నారని ప్రశ్నించారు. వసతులపై ఆరా తీశారు. సక్రమంగా సేవలు అందించడంపై జిల్లా కలెక్టర్ వి.విజయరామరాజుకు పలు సూచనలు చేశారు. దాదాపు 2.20 గంటల పాటు ముఖ్యమంత్రి అక్కడే గడిపారు. సచివాలయ ప్రాంగణాన్ని అందంగా తీర్చిదిద్దిన ప్రజాప్రతినిధులు, అధికారులను అభినందించారు. స్థానిక నేతలు, కార్యకర్తలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. తానున్నానంటూ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అవినాష్‌రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

గాంధీ, వైఎస్సార్ విగ్రహాల ఆవిష్కరణ

సచివాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జాతిపిత మహాత్మాగాంధీ, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలను సీఎం జగన్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం రాత్రి 7.00 గంటలకు ముఖ్యమంత్రి జగన్ రోడ్డు మార్గంలో బయలుదేరి 7.35 గంటలకు ఇడుపులపాయ చేరుకున్నారు. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు అక్కడ సీఎంకు స్వాగతం పలికారు.

వేల్పులలో సీఎం జగన్ ప్రారంభించిన వివిధ భవనాలు ఇవీ

గ్రామీణ ఉపాధి హామీ నిధులతో..
- రూ.40 లక్షలతో గ్రామ సచివాలయం
- రూ.21.80 లక్షలతో రైతు భరోసా కేంద్రం
- రూ.16 లక్షలతో వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీ

పాడా నిధులతో....
- రూ. 40 లక్షలతో వ్యవసాయ సహకార పరపతి సంఘం
- రూ. 19.50 లక్షలతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్
- రూ. 17 లక్షలతో పోస్టాఫీసు బిల్డింగ్
- రూ. 13 లక్షలతో వేదిక, విశ్రాంతి గది
- రూ. 8 లక్షలతో బస్సు షెల్టర్
- రూ. 13 లక్షలతో వెయిటింగ్‌హాలు
- రూ. 16 లక్షలతో సీసీ రోడ్లు, పార్కింగ్‌టైల్స్
- రూ. 32 లక్షలతో ప్రహరీ గోడ నిర్మాణం
- రూ. 3.10 లక్షలతో బోర్‌వెల్, పైపులైన్ పనులు
- రూ. 16.50 లక్షలతో ఓవర్‌హెడ్ ట్యాంకు
- రూ. 3 లక్షలతో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్
- రూ. 29 లక్షలతో ఆర్వో ప్లాంట్ పైపులైన్
- రూ. 35 లక్షలతో ఫర్నిచర్



వేల్పులలో లబ్ధిదారుల జాబితా పరిశీలిస్తూ..



విజిటర్స్ రిజిస్టర్‌లో సంతకం చేస్తూ..



డిజిటల్ అసిస్టెంట్ పనితీరు పరిశీలిస్తూ..

క్లుప్తంగా

పద్మ పురస్కారాల కోసం నామినేషన్ల ఆహ్వానం

5వ తేదీ వరకు గడువు

సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వం ప్రదానం చేయనున్న పద్మ పురస్కారాలకు కేంద్ర ప్రభుత్వం నామినేషన్లను ఆహ్వానిస్తున్నట్లు సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్, ఎక్స్ అఫిషియో సెక్రటరీ విజయకుమార్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కళలు, సామాజికసేవ, ప్రజా వ్యవహారాలు, సైన్స్ అండ్ ఇంజనీరింగ్, వర్తకం, వాణిజ్యం, వైద్యం, సాహిత్యం, విద్య, క్రీడలు, సివిల్ సర్వీసెస్ వంటి పలు రంగాల్లో అత్యుత్తమ సేవలు అందిస్తున్నవారికి 2023 జనవరి 26వ తేదీన గణతంత్ర దినోత్సవం సందర్భంగా పద్మ పురస్కారాలను ప్రదానం చేస్తారని పేర్కొన్నారు. ఇందుకోసం కేంద్రానికి ప్రతిపాదనలు పంపేందుకు ఈ నామినేషన్లు ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఔత్సాహికులు తమ నామినేషన్లను ఈ నెల ఐదో తేదీలోపు ప్రిన్సిపల్ సెక్రటరీ(పొలిటికల్), సాధారణ పరిపాలన(ఎస్‌సీఐఐ) విభాగం, ఏపీ సెక్రటేరియట్, వెలగపూడి, గుంటూరు జిల్లా-522238 అనే చిరునామాకు అందేలా పంపించాలని సూచించారు.

నేటి నుంచి ఇంటర్ మూడో విడత అడ్మిషన్లు

సాక్షి, అమరావతి: ఇంటర్ కాలేజీల్లో ప్రథమ సంవత్సరం మూడో విడత, చివరి విడత ప్రవేశాల ప్రక్రియ శుక్రవారం నుంచి ప్రారంభమవుతుందని బోర్డు కార్యదర్శి శేషగిరిబాబు తెలిపారు. ఈనెల 10 వరకు ప్రవేశాల ప్రక్రియను కొనసాగించవచ్చని పేర్కొన్నారు.

ప్రణాళికా మండలి వైస్ చైర్మన్‌గా మల్లాది విష్ణు



సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రణాళికా మండలి వైస్ చైర్మన్‌గా విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే మల్లాది విష్ణును ప్రభుత్వం నియమించింది. రెండేళ్ల పాటు ఆయన పదవిలో ఉంటారు. ఈ మేరకు రాష్ట్ర ప్రణాళికా శాఖ కార్యదర్శి విజయ్‌కుమార్ గురువారం ఉత్తర్వులిచ్చారు. ప్రణాళికా మండలి వైస్ చైర్మన్ పదవికి కేబినెట్ మంత్రి హోదా కల్పిస్తున్నట్లు ఉత్తర్వుల్లో తెలిపారు.

బీఈఎల్ యూనిట్ డీపీఆర్ త్వరగా ఇవ్వండి

సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ భారత్ ఎల్రక్టానిక్స్ లిమిటెడ్(బీఈఎల్) అనంతపురంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించిన రాడార్ టెస్ట్ బెడ్ ఫెసిలిటీ, రక్షణ రంగ ఉత్పత్తుల యూనిట్ సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక(డీపీఆర్)ను త్వరగా అందజేయాలని ఏపీఐఐసీ కోరింది. ఈ యూనిట్ ఏర్పాటుకు ఇప్పటికే 914 ఎకరాల భూమిని కేటాయించినా, పనులు ప్రారంభించకపోవడంపై ఏపీఐఐసీ ఆరా తీసింది. ఏపీఐఐసీ ప్రధాన కార్యాలయంలో గురువారం ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి, ఎండీ సుబ్రహ్మణ్యం జవ్వాది బీఈఎల్ డైరెక్టర్ పార్థసారథి కలిసి ఆలస్యానికి కారణాలు వివరించారు.

బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటుకు 3 నెలల్లో డీపీఆర్‌లు

వివరణాత్మక నివేదిక పంపాలని రాష్ట్రానికి కేంద్రం సూచన

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలో బల్క్‌డ్రగ్ పార్క్ ఏర్పాటుకు మూడు నెలల్లో సవివర ప్రాజెక్ట్ నివేదికలను(డీపీఆర్‌లను) పంపాలని కేంద్ర రసాయనాలశాఖ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. ఏపీతో పాటు హిమాచల్‌ప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల్లో 'బల్క్‌డ్రగ్ పార్కుల ప్రమోషన్' పథకంలో భాగంగా మూడు రాష్ట్రాల ప్రతిపాదనలకు ఫార్మాస్యూటికల్స్ విభాగం సూత్రప్రాయంగా ఆమోదించినట్లు కేంద్ర రసాయనాలశాఖ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. మొత్తం 13 రాష్ట్రాల నుంచి ప్రతిపాదనలు అందగా, నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో సలహా కమిటీ పరిశీలించి ఈ నిర్ణయం తీసుకుందని పేర్కొంది. బల్క్‌డ్రగ్ ప్రాజెక్టుల ఏర్పాటుకు సంబంధించి రాబోయే 90 రోజుల్లో ప్రాజెక్ట్ నివేదికలు సమర్పించాలని ఆదేశించింది. మూడు రాష్ట్రాలకు కలిపి రూ.3 వేల కోట్ల సాయాన్ని కేంద్ర ప్రభుత్వం అందిస్తుంది. ఏపీ ప్రభుత్వం కేంద్రానికి సమర్పించిన ప్రతిపాదనల ప్రకారం తొండంగి మండలానికి చెందిన కేపీపురం, కోదాడల్లో 2,000 ఎకరాల్లో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు చేయనున్నారు.

ఏపీలో బల్క్ డ్రగ్ పార్క్ వద్దు

కేంద్రానికి టీడీపీ లేఖ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు చేయొద్దంటూ కేంద్ర ప్రభుత్వానికి టీడీపీ లేఖ రాసింది. కాకినాడ జిల్లాలో బల్క్ డ్రగ్ పార్క్ చేస్తే పర్యావరణ కాలుష్యం తలెత్తుతుందని.. ఆ ప్రాంతంలో నివసిస్తున్న మత్స్య, యాదవ కులాల ప్రజలు ఇబ్బందిపడతారని టీడీపీ నేత, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు ఎరువులు, రసాయనాల శాఖ సంయుక్త కార్యదర్శికి రాసిన లేఖలో పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ చట్టం 1986, కోస్టల్ రెగ్యులేషన్ జోన్ నోటిఫికేషన్(సీఆర్‌జెడ్)-2019 ప్రకారం బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు ప్రతిపాదనను నిలిపివేయాల్సిందిగా కోరారు. అలాగే ఏపీకి బల్క్ డ్రగ్ పార్క్ కేటాయింపు ప్రతిపాదనను రద్దు చేయాలంటూ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ చైర్మన్ జస్టిస్ ఆదర్శ్ కుమార్, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ సదరన్ జోన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి లేఖలు రాసినట్లు యనమల తెలిపారు.

అంతర్రాష్ట్ర గంజాయి దందాకు చెక్

ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లతో ఏపీ కార్యాచరణ

- ఆ రాష్ట్రాలకు రాష్ట్ర పోలీసు శాఖ మార్గనిర్దేశం
- మూడు రాష్ట్రాల సరిహద్దుల్లో నిఘా పటిష్టం
- ప్రత్యేక వాట్సాప్ గ్రూప్ ద్వారా పర్యవేక్షణ

సాక్షి, అమరావతి: అంతర్రాష్ట్ర గంజాయి దందాకు అడ్డుకట్ట వేసేందుకు ఏపీ పోలీసు శాఖ పొరుగు రాష్ట్రాలకు మార్గనిర్దేశం చేయనుంది. ఇందుకోసం ఏపీ పోలీసు శాఖ ఆ రాష్ట్రాల పోలీసు విభాగాలతో కలిసి ఉమ్మడి కార్యాచరణకు నేతృత్వం వహించేందుకు సన్నద్ధమైంది. ఆంధ్ర-ఒడిశా సరిహద్దు (ఏఓబీ)లో దశాబ్దాలుగా సాగిన గంజాయి సాగును 'ఆపరేషన్ పరివర్తన్' ద్వారా నిర్మూలించిన రాష్ట్ర పోలీసు శాఖ దేశానికే మార్గదర్శకంగా నిలిచింది. రాష్ట్ర పరిధిలోని ఏఓబీలో గంజాయి సాగును నిర్మూలించినప్పటికీ పొరుగునున్న ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లలో యథేచ్ఛగా సాగు కొనసాగుతోంది. అక్కడ నుంచి హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, ముంబై తదితర నగరాలకు నేరుగా రవాణా వ్యవస్థలేదు. దాంతో ఆ రాష్ట్రాల్లో సాగుచేస్తున్న గంజాయిని ఇతర రాష్ట్రాలకు తరలించేందుకు స్మగ్లర్లు ఏపీ భూభాగాన్నే గేట్ వేగా వాడుకుంటున్నారు. అందుకే పొరుగు రాష్ట్రాల నుంచి మన రాష్ట్రం మీదుగా గంజాయి అక్రమ రవాణాకు కూడా అడ్డుకట్ట వేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మరోవైపు.. ఆపరేషన్ పరివర్తన్‌ను విజయవంతంగా నిర్వహించిన ఏపీ పోలీసుల సహకారాన్ని ఒడిశా, ఛత్తీస్‌గఢ్ పోలీసులు కోరుతున్నారు. దాంతో అంతర్రాష్ట్ర గంజాయి దందాను పూర్తిగా నిర్మూలించేందుకు సరిహద్దుల్లోని ఒడిశా, ఛత్తీస్‌గఢ్ పోలీసు విభాగాలతో కలిసి పోలీసు శాఖ కార్యాచరణకు ఉపక్రమించింది. ఇందులో భాగంగా.. ఈ రెండు రాష్ట్రాలతో పాటు తెలంగాణ పోలీసు ఉన్నతాధికారులతో రాష్ట్ర డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి త్వరలో ఉన్నతస్థాయి సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించారు.

సరిహద్దు రాష్ట్రాలతో సమన్వయం

ఇక ఏపీ సరిహద్దుల్లోని ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన జిల్లా పోలీసు అధికారులతో ఏపీ పోలీసు శాఖ ఓ సమన్వయ కమిటీని ఏర్పాటు చేసింది. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ జె. సతీశ్‌కుమార్ నేతృత్వం వహించే ఈ కమిటీ ఇటీవల సమావేశమైంది. ఇందులో ఒడిశాలోని కోరాపుట్, మల్కనగిరి, జైపూర్ జిల్లాల ఎస్పీలు, అదనపు ఎస్పీలు, డీఎస్పీలు పాల్గొన్నారు. అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్లకు అడ్డుకట్ట వేసేందుకు ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. త్వరలో వారితో జె.సతీశ్‌కుమార్ సమావేశం కానున్నారు. అనంతరం.. ఇప్పటికే ఏర్పాటుచేసిన ఏపీ, ఒడిశా పోలీసు అధికారుల సమన్వయ కమిటీలో ఛత్తీస్‌గఢ్ పోలీసు అధికారులు కూడా చేరుతారు. ఇక ఏపీ, ఒడిశా సమన్వయ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలివీ..

పటిష్ట నిఘా..

గంజాయిని స్మగ్లింగ్ చేస్తున్న మార్గాల్లో నిఘాను పటిష్టం చేయనున్నారు. ఒడిశాలోని మల్కనగిరి, కోరాపుట్, జైపూర్ జిల్లాల పరిధిలోని మార్గాలను గుర్తించారు. ప్రధానంగా ఒడిశాలోని చిత్రకొండ ప్రాంతంలో సాగుచేస్తున్న గంజాయిని ఏపీలోని మారేడుమిల్లి గుండా రవాణాచేస్తూ తెలంగాణ, ఉత్తర ప్రదేశ్‌లకు తరలిస్తున్నారు. ఇక ఒడిశాలోని కోరాపుట్ జిల్లా పరిధిలోని జోలాపుట్ ప్రాంతంలో



సాగుచేస్తున్న గంజాయిని ఏపీలోని ముంచంగిపుట్టు, అరకు మీదుగా విశాఖపట్నం తీసుకొచ్చి ఇతర రాష్ట్రాలకు చేరవేస్తున్నారు. ఇక ఒడిశాలోని మల్కనగిరి జిల్లాలో సాగుచేస్తున్న గంజాయిని బోట్ల ద్వారా తరలిస్తున్నారు. ఈ ప్రధాన మార్గాలతోపాటు వాటిని అనుసంధానించే వివిధ మార్గాల్లో నిఘాను పటిష్టం చేయాలని నిర్ణయించారు. ఆ మార్గాల్లో అదనపు సిబ్బందిని నియమించడంతోపాటు అవసరమైన చోట్ల చెక్ పోస్టులను ఏర్పాటుచేయనున్నారు. ఇక నిఘాను పటిష్టం చేయనున్న అంతర్రాష్ట్ర మార్గాలివీ..

- చిత్రకొండ-సీలేరు-డొంకరాయి-మోతుగూడెం-భద్రాచలం-విజయవాడ-హైదరాబాద్ మార్గం
- చిత్రకొండ-చింతూరు-మారేడుమిల్లి-రంపచోడవరం-గోకవరం-రాజమహేంద్రవరం-జాతీయ రహదారి-16
- జోలాపుట్-పడువ-అరకు
- సీలేరు-డొంకరాయి-పాతకోట-మారేడుమిల్లి
- సుకుమా (మల్కనగిరి)-తులసిపాక-డొంకరాయి-సీలేరు-మోతుగూడెం

స్మగ్లర్లపై కన్ను..

గంజాయి దందాలో కీలకంగా వ్యవహరిస్తున్న ఒడిశాకు చెందిన స్మగ్లర్ల వివరాలను ఏపీ పోలీసులు ఇప్పటికే సేకరించారు. పరారీలో ఉన్న ఒడిశాలోని మల్కనగిరి జిల్లాకు చెందిన 38 మంది, కోరాపుట్ జిల్లాకు చెందిన 8మంది స్మగ్లర్ల వివరాలను అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ జె. సతీశ్‌కుమార్ ఆ రాష్ట్ర పోలీసు అధికారులకు అందజేశారు. వారి కదలికలపై రెండు రాష్ట్రాల అధికారులు దృష్టిపెట్టనున్నారు. వారిని అదుపులోకి తీసుకుంటే ఒడిశాలో గంజాయి స్మగ్లింగ్‌కు అడ్డుకట్ట వేయవచ్చని భావిస్తున్నారు.

ప్రత్యేక వాట్సాప్ గ్రూప్..

అలాగే, గంజాయి దందాకు అడ్డుకట్ట వేసేందుకు సమాచార వ్యవస్థనూ పటిష్టం చేయనున్నారు. ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా, ఒడిశాలోని మల్కనగిరి, కోరాపుట్, జైపూర్ జిల్లాల పోలీసు అధికారులు తమ నిఘా వర్గాల సమాచారాన్ని పరస్పరం ఇచ్చి పుచ్చుకునేందుకు సమ్మతించారు. ఇందుకోసం వాట్సాప్ గ్రూప్ ఏర్పాటుకు నిర్ణయించారు. దీంతో ఈ రెండు రాష్ట్రాల పోలీసులు చేపట్టే తనిఖీలు, దాడులు, స్మగ్లర్ల కదలికలు, అరెస్టులు, జైలు నుంచి విడుదల అయిన నేర చరితుల వివరాలు...ఇతర అవసరమైన సమాచారం తక్షణం చేరవేసేందుకు అవకాశం ఉంటుంది.

> **పొరుగు రాష్ట్రాల నుంచి స్మగ్లింగ్‌కూ అడ్డుకట్ట**
>
> మన రాష్ట్రంలో గంజాయి సాగును నిర్మూలించాం. కానీ, మన సరిహద్దు రాష్ట్రాల్లో సాగుచేస్తున్న గంజాయిని ఏపీ మీదుగా స్మగ్లింగ్ చేస్తున్నారు. దీనికి అడ్డుకట్ట వేయాలి. ఈ విషయంలో ఆయా రాష్ట్రాలు మన సహకారాన్ని కోరుతున్నాయి. వాటితో కలిసి కార్యాచరణ చేపట్టాం. నేషనల్ నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ)తో సమన్వయంతో పనిచేస్తున్నాం.
>
> – కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి, ఏపీ డీజీపీ

మరింత మందికి లబ్ధి చేకూర్చేలా..

- పీఎం కిసాన్ కోసం ఈ కేవైసీ గడువు ఈ నెల 7 వరకు పెంపు
- రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థనతో స్పందించిన కేంద్రం

సాక్షి, అమరావతి: ప్రధాన మంత్రి కిసాన్ యోజన ద్వారా సాధ్యమైనంత ఎక్కువ మంది అర్హులైన రైతులకు లబ్ధి చేకూర్చేందుకు ఈ కేవైసీ గడువు పెంచనున్నట్లు కేంద్ర వ్యవసాయ, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ ప్రకటించారు. పీఎం కిసాన్ అమలుపై జాతీయ స్థాయిలో వ్యవసాయ మంత్రులు, కమిషనర్లతో న్యూఢిల్లీ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కేంద్రమంత్రి ఈ విషయాన్ని చెప్పారు. పథకం ప్రారంభించిన తర్వాత ఇప్పటివరకు 11 విడతల్లో రైతులకు ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. 12వ విడతగా (2022-23 ఆర్థిక సంవత్సరంలో రెండో విడత) ఈ నెల 25న పీఎం కిసాన్ సాయం అందించబోతున్నట్లు వెల్లడించారు. పీఎం కిసాన్ లబ్ధిదారులు ఈ కేవైసీ చేయించుకునేందుకు నిర్దేశించిన గడువు ఆగస్ట్ 31తో ముగియగా, సాంకేతిక కారణాలతో మూడోవంతు రైతులు ఇంకా ఈకేవైసీ చేయించుకోలేకపోయారని రాష్ట్ర వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. రాష్ట్రంలో పీఎం కిసాన్ పోర్టల్‌లో లబ్ధిదారుల వివరాలను రెవెన్యూ శాఖ అప్‌లోడ్ చేస్తోందన్నారు. ఇప్పటి వరకు 55% లబ్ధిదారుల ఈకేవైసీ నమోదు పూర్తయ్యిందని, అందుకే మరింత గడువునివ్వాల్సిన అవసరం ఉందన్నారు. పలు రాష్ట్రాల మంత్రులు కూడా గడువు పెంచాలని కోరడంతో కేంద్ర మంత్రి స్పందిస్తూ 7 వరకు ఈ కేవైసీ నమోదు గడువు పెంచుతున్నట్లు చెప్పారు. ఈలోగా ఈ కేవైసీ పూర్తయిన వారికి 25న సొమ్ములు జమవుతాయని, మిగిలిన వారికి ఈకేవైసీ పూర్తయిన తర్వాత మలివిడతలో జమ చేస్తామని చెప్పారు.

ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజల్లో పెరుగుతున్న నమ్మకం

- ఇక నుంచి ఆరోగ్యశ్రీ లబ్ధిదారుడి ఖాతాకే చెల్లింపు
- వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రజలకు ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం రోజురోజుకు పెరుగుతోందని, వాటిలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ చికిత్సలు పెరగడమే ఇందుకు నిదర్శనమని వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు చెప్పారు. విజయవాడలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో వైద్యవిధాన పరిషత్(వీవీపీ) కింద ఉన్న 251 ఆస్పత్రుల్లో 2019-20లో 92 క్లెయిమ్‌లు నమోదవగా ఆ సంఖ్య 2021-22లో 83,226కు చేరిందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 40,550 క్లెయిమ్‌లు నమోదయ్యాయని చెప్పారు. ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజలందరికీ మెరుగైన వైద్యసౌకర్యాలు కలిస్తూ వైద్యరంగంలో అనేక సంస్కరణలను చేపట్టడం వల్లే ఇది సాధ్యమైందని పేర్కొన్నారు. రాష్ట్రంలో 2,200, ఇతర రాష్ట్రాల్లో 200కు పైగా ఆస్పత్రులు ఆరోగ్యశ్రీ పరిధిలో ఉన్నట్టు చెప్పారు. ఆరోగ్యశ్రీ బిల్లుల చెల్లింపు సాఫీగా సాగుతోందని, జూలై నెల వరకు బిల్లుల చెల్లింపులు పూర్తయ్యాయని తెలిపారు. ఆగస్టు నెల నుంచి లబ్ధిదారుడి ఖాతాకే వేస్తామని, వారు ఆస్పత్రులకు చెల్లిస్తారని చెప్పారు. ఆరోగ్యశ్రీ కింద ఖర్చు చేస్తున్న నిధుల్లో రాష్ట్రంలో ప్రభుత్వ ఆస్పత్రుల వాటా 25% వరకు ఉందని, దీన్ని రెండేళ్లలో 50 శాతానికిపైగా పెంచేందుకు కృషిచేస్తున్నామని తెలిపారు.

మరో 5 వేల పోస్టుల భర్తీకి సన్నాహాలు

మానవ వనరుల కల్పనలో భాగంగా వైద్యశాఖలో గత మూడేళ్లలో 40 వేలకుపైగా పోస్టులను భర్తీచేసినట్లు తెలిపారు. మరో ఐదువేల పోస్టుల భర్తీ ప్రక్రియ చేపడుతున్నామన్నారు. గిరిజన ప్రాంతాల్లో పనిచేసే స్పెషలిస్ట్ వైద్యులకు ప్రోత్సాహకం ఇస్తున్నట్లు తెలిపారు. ఎ-క్యాటగిరి పీజీ సీట్లలో చదివినవారు ఏడాది పాటు ప్రభుత్వాస్పత్రుల్లో పనిచేయాలనే నిబంధన తీసుకురాబోతున్నట్లు చెప్పారు. వైద్యరంగంలో నాడు-నేడు కింద రూ.16,255 కోట్లతో 16 వైద్య కళాశాలల నిర్మాణం, ఆస్పత్రుల్లో మౌలిక వసతుల కల్పన చేపడుతున్నట్లు తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఐదు వైద్యకళాశాలలు ప్రారంభిస్తామని, మిగిలినవి 2024 నాటికి పూర్తిచేస్తామన్నారు. రాష్ట్రంలో ప్రజలకు మెరుగైన వైద్యసౌకర్యం అందిస్తున్నప్పటికీ ఒకటి, రెండు శాతం లోపాలను కొన్ని మీడియా సంస్థలు ఎత్తిచూపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేస్తున్న మంచికి కూడా ప్రచారం కల్పించి ప్రజలకు మరింత మేలు కలిగేలా ఆ సంస్థలు బాధ్యత తీసుకోవాలని ఆయన కోరారు. వైద్య, ఆరోగ్యశాఖ కమిషనర్ జె.నివాస్ మాట్లాడుతూ పాడేరు ప్రాంతంలో ఏడుగురిలో ఆంత్రాక్స్ లక్షణాలు కనిపించాయని, పరీక్షల్లో నెగటివ్‌గా నిర్ధారణ అయిందని చెప్పారు. అయినా నమూనాలను టిష్యూ కల్చర్ కోసం విశాఖకు పంపించామని, ఆ ఫలితాలు రావాల్సి ఉందని తెలిపారు. ఈ సమావేశంలో వైద్యవిధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ వినోద్‌కుమార్, డీఎంఈ డాక్టర్ రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

పారిస్ సదస్సులోనూ 'ఆర్బీకే'

- వ్యవసాయంలో వినూత్న ఆవిష్కరణలపై పారిస్‌లో గ్లోబల్ సదస్సు
- నేడు ఆర్బీకేల గురించి వివరించనున్న మంత్రి కాకాణి

సాక్షి, అమరావతి: గ్రామ స్థాయిలో రైతులకు సేవలందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలపై ఇప్పటికే పలు రాష్ట్రాలతో పాటు ఇథియోపియా వంటి దేశాలు కూడా ఆసక్తి చూపిస్తున్నాయి. తాజాగా వ్యవసాయ, ఉద్యాన రంగాల్లో వినూత్న ఆవిష్కరణలపై పారిస్‌లో నిర్వహిస్తోన్న గ్లోబల్ కాన్ఫరెన్స్‌లో కూడా 'ఆర్బీకే'లు ప్రత్యేక ఆకర్షణగా నిలవబోతున్నాయి. వర్చువల్ విధానంలో మూడు రోజుల పాటు జరగనున్న ఈ సదస్సులో అమెరికా, ఆస్ట్రేలియా, చైనా, బ్రిటన్‌తో సహా 30కు పైగా దేశాల్లోని 50కి పైగా ప్రముఖ యూనివర్సిటీలు తమ పరిశోధనల ఫలితాలు, ఆవిష్కరణలను వివరించనున్నాయి. ఇంతటి ప్రాధాన్యం కలిగిన ఈ సదస్సులో 'రైతు భరోసా కేంద్రాలు-ఫార్మర్స్ ఫెసిలిటేషన్ సెంటర్స్' అనే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం తరపున వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, స్పెషల్ సీఎస్ పూనమ్ మాలకొండయ్య శుక్రవారం ప్రజంటేషన్ ఇవ్వబోతున్నారు. ఆర్బీకేల ఏర్పాటు ఆలోచన, అమలు తీరు, సాధిస్తున్న సత్ఫలితాలపై ప్రజంటేషన్ ఇవ్వనున్నారు.

సీఎం జగన్‌ను కలిసిన ఎస్‌ఎల్‌బీసీ కన్వీనర్ నవనీత్‌కుమార్

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎస్‌ఎల్‌బీసీ నూతన కన్వీనర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జీఎం నవనీత్‌కుమార్ గురువారం కలిశారు. ఇటీవలే ఎస్‌ఎల్‌బీసీ నూతన కన్వీనర్‌గా నవనీత్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎంను కలిసిన వారిలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజీఎం వేగే రమేష్ కూడా ఉన్నారు.



- సాక్షి, అమరావతి

బీజేపీ, టీడీపీ, జనసేన కలయిక ఎల్లో మీడియా సృష్టి

ఎంపీ మార్గాని భరత్‌రామ్



సాక్షి, రాజమహేంద్రవరం: బీజేపీ, టీడీపీ, జనసేన కలయిక ఎల్లో మీడియా సృష్టేనని, ఈ కథనాల వెనుక ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు కుట్ర ఉందని రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ ఆరోపించారు. రాజమహేంద్రవరంలోని ఎంపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారంలో ఉండగా ప్రతి సంవత్సరం సంక్రాంతికి ఒక్కసారే కుప్పం వెళ్లే చంద్రబాబు.. ఇప్పుడు ఓటమి భయంతో నెలకు నాలుగుసార్లు వెళుతున్నారని ఎద్దేవా చేశారు. వినాయక చవితి నేపథ్యంలో ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేసిన బీజేపీ నాయకులకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు కొనసాగడం చెంపపెట్టుగా అభివర్ణించారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి కుప్పంలో ఏం పని... అని నారా లోకేశ్ వ్యాఖ్యానించడం ఆయన అవగాహన రాహిత్యానికి నిదర్శనమన్నారు. రాష్ట్ర మంత్రి ఎక్కడైనా పర్యటిస్తారనే విషయం లోకేశ్‌కు తెలియదా... అని ఎద్దేవా చేశారు. సర్పంచ్‌గా కూడా గెలవలేని లోకేశ్ ఏకంగా మంత్రి పెద్దిరెడ్డిని ప్రశ్నించడం హాస్యాస్పదమన్నారు. లోకేశ్‌కు సత్తా ఉంటే రాజమహేంద్రవరం నుంచి ఎంపీ లేదా ఎమ్మెల్యేగా పోటీ చేయాలని, అప్పుడు తమ సత్తా ఏమిటో చూపిస్తామని భరత్ చెప్పారు. రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు నిలిచిపోవడానికి టీడీపీ కోర్టులో వేసిన కేసులే కారణమన్నారు. ఆ కేసులు ఉపసంహరించుకుని ఎన్నికలకు రావాలని మార్గాని భరత్ సవాల్ విసిరారు. కరోనా విపత్తు సమయంలోనూ రాష్ట్రాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతగానో కృషి చేశారని తెలిపారు. ఒబెరాయ్ హోటల్స్ వంటి దిగ్గజ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు రావడమే ఇందుకు నిదర్శనమని చెప్పారు.

విద్యారంగ అభివృద్ధికోసమే సంస్కరణలు

విద్యా శాఖ మంత్రి బొత్స



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో విద్యావ్యవస్థ, విద్యార్థులు బాగుపడాలంటే ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులందరూ సహకరించాలని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ కోరారు. ఆయన గురువారం విజయవాడలోని సమగ్ర శిక్ష రాష్ట్ర కార్యాలయంలో ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం నిర్వహించారు. విద్యాభివృద్ధి లక్ష్యంగానే రాష్ట్ర ప్రభుత్వం వివిధ సంస్కరణలు చేపడుతోందని చెప్పారు. వాటిని క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు ప్రస్తుతం రాష్ట్రంలోని 672 ఎంఈవో పోస్టుల్లో 424 మంది పనిచేస్తున్నారన్నారు. వారిలో 413 మంది జిల్లా పరిషత్ పాఠశాలల నుంచి, 11 మంది ప్రభుత్వ పాఠశాలల నుంచి ఉన్నారని తెలిపారు. మిగతా 248 ఖాళీగా ఉన్న ఎంఈవో పోస్టులకు ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులకు పూర్తి అదనపు బాధ్యతలు ఇచ్చామన్నారు. మరో 672 ఎంఈవో పోస్టులను కొత్తగా సృష్టించి జిల్లా పరిషత్ స్కూళ్లవారికి పూర్తి అదనపు బాధ్యతలు ఇస్తామని తెలిపారు. ప్రభుత్వం అన్ని మేనేజ్‌మెంట్లను ఒకేవిధంగా పరిగణిస్తుందని, టీచర్లందరూ సమానమేనన్నారు.

ఉపాధ్యాయులంటే సానుకూల దృక్పథమే

విద్యాశాఖలో అన్నిస్థాయిల సిబ్బందికి ముఖ ఆధారిత హాజరు తప్పనిసరి అని మంత్రి బొత్స స్పష్టం చేశారు. సకాలంలో యాప్ గుర్తించకుంటే సాంకేతిక సమస్యగా పరిగణిస్తామని, ఉపాధ్యాయులపై చర్య లుండవన్నారు. యాప్‌లో సాంకేతిక సమస్యలు ఎదురైతే తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఎప్పుడూ ఉపాధ్యాయుల పట్ల సానుకూల దృక్పథంతో ఉంటుందన్నారు. ఈ యాప్ వల్ల వ్యక్తిగత సమాచార గోప్యతకు ఎలాంటి ముప్పు వాటిల్లదని హామీ ఇచ్చారు. పాఠశాల విద్య ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్, సమగ్ర శిక్ష అదనపు రాష్ట్ర పథక సంచాలకుడు బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కాణిపాకంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

హంస వాహనంపై ఊరేగిన వినాయకుడు



హంసవాహనంపై స్వామివారు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉదయం ధ్వజారోహణ కార్యక్రమాన్ని అర్చకులు ధర్మేశ్వర్ గురుకుల్, వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలిరోజు స్వామివారు హంస వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలోని అన్వేటి మండపంలో స్వర్ణ ధ్వజస్తంభం వద్ద మూషికపటాన్ని ఉంచి గణపతి పూజ, స్వస్తివాచనం, నవగ్రహ సంధి, పుణ్యాహవచనంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాలకు ఉభయదారులుగా కాణిపాకం, అగరంపల్లె, కారకాంపల్లె, వడ్రాంపల్లె, తిరువణంపల్లె గ్రామాలకు చెందిన శీర్‌కరుణీక వంశస్తులు వ్యవహరించారు.

విఘ్నాలన్నీ తొలగి.. ప్రగతి సాధించాలి

- వైఎస్సార్ పీపీ నేత విజయసాయిరెడ్డి ఆకాంక్ష
- వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా వినాయక చవితి వేడుకలు



వినాయకుడికి పూజలు చేస్తున్న విజయసాయిరెడ్డి తదితరులు

సాక్షి, అమరావతి: సకల శాస్త్రాలకు అధిపతిగా, బుద్ధికి, జ్ఞానానికి ఆరాధ్యుడిగా భక్తి శ్రద్ధలతో హిందువులు గణనాథున్ని ఆరాధిస్తారని వైఎస్సార్‌పీపీ నేత, వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వి.విజయసాయిరెడ్డి అన్నారు. జ్ఞానం, లక్ష్య సాధన, నైతిక విలువలు, ప్రకృతి పరిరక్షణ వంటి సుగుణాలను వినాయక చవితి మనకు నేర్పుతుందని తెలిపారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజయసాయిరెడ్డి గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ విఘ్నాలన్నీ తొలగిపోయి రాష్ట్రం మరింత విస్తృతంగా ప్రగతి సాధించాలనీ, ప్రతి ఒక్కరూ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఎవరెన్ని ఆటంకాలు సృష్టించినా వాటిని వినాయకుని దీవెనలతో అధిగమిస్తూ, సకల జనుల సంక్షేమమే లక్ష్యంగా, సీఎం జగన్ నేతృత్వంలోని ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను నిర్విఘ్నంగా అమలు చేస్తోందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ, పార్టీ కేంద్ర కార్యాలయం పర్యవేక్షకులు లేళ్ల అప్పిరెడ్డి, మంత్రి జోగి రమేష్, మండలి విప్ జంగా కృష్ణమూర్తి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ పాల్గొన్నారు.

విశ్వాసులారా! దేవుని కోసం నీతి నిజాయతీలకు కట్టుబడి ఉంటూ, న్యాయమైన సాక్ష్యం ఇవ్వండి. ఇతరుల పట్ల విరోధం ఉన్నాసరే మీరు న్యాయానికి తిలోదకాలు ఇవ్వకూడదు.

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, సెప్టెంబర్, 2

దయ... ధర్మం... దాయాది...

కనివిని ఎరుగని కష్టం ఎదురైనప్పుడు కన్నీటిని తుడిచే సాంత్వన కావాలి. దశాబ్ది కాలం పైగా ఎరుగని భారీ వరదలు... దేశంలోని 150 జిల్లాల్లో 110 జిల్లాలను ముంచెత్తిన కష్టం... దేశ భూభాగంలో మూడోవంతు ప్రాంతంపై, 3.3 కోట్ల మందిపై ప్రభావం... దేశంలోని ప్రతి ఏడుగురిలో ఒక బాధితుడు... పదకొండు వందల మందికి పైగా మృతులు. ఆకస్మిక వరదలతో అతలాకుతలమైన పాకిస్తాన్ ప్రస్తుతం ఉన్న కష్టానికి ఈ లెక్కలే సాక్ష్యం. ఇన్ని ఇక్కట్లతో ఆ దేశం ఆపన్న హస్తం కోసం చూస్తోంది. దాయాదికి సాయం అందించడానికి భారత్ సిద్ధంగా ఉందంటూ వస్తున్న వార్తలపై అనుకూల, ప్రతికూల వైఖరులతో ఇప్పుడు దేశంలో చర్చ రేగుతోంది.

ఐరోపా, చైనా సహా ప్రపంచంలో పలు ప్రాంతాలు అత్యధిక ఉష్ణోగ్రతలు, దుర్భిక్షంతో బాధపడుతుంటే, పాక్ వరదల్లో చిక్కుకుంది. పర్యావరణ విపరిణామాలకు ఇది నిదర్శనం. ఎండా కాలంలోని అత్యధిక ఉష్ణోగ్రతలతో హిమాలయాలు సహా వివిధ పర్వతశ్రేణుల్లో హిమానీనదాలు కరిగి, మే నాటికే పాక్‌లో నదులన్నీ నిండుకుండలయ్యాయి. ఆపై వానాకాలంలో ఊహకందని రీతిలో తక్కువ సమయంలో ఎక్కువ వర్షపాతం రావడంతో పరిస్థితి చేయిదాటింది. జూలై నుంచి పెరుగుతున్న వరదలతో స్థానికులకు కన్నీళ్ళే మిగిలాయి. భూతాపోన్నతికి తక్కువ కారణమైనా, ఇంతటి పర్యావరణ విపరిణామానికి ఇస్లామాబాద్ లోనవడం గమనార్హం. ఈ పరిస్థితుల్లో కర్బన ఉద్గార దేశాలకు తమ తప్పు లేని బాధిత దేశాలకు నిధులివ్వాల్సిన నైతిక బాధ్యత ఉంది.

పాకిస్తాన్‌కు ఇది పచ్చి గడ్డుకాలం. ఈ ఏడాది మొదట్లో ఇమ్రాన్ ఖాన్ ప్రభుత్వం పతనమయ్యాక పీఠమెక్కిన షెహబాజ్ షరీఫ్ సర్కారు ఇంకా నిలదొక్కుకోనే లేదు. ఎన్నికలు జరపాలని ఇమ్రాన్ వీధికెక్కారు. అంతకంతకూ రాజకీయ అనిశ్చితి పెరుగుతోంది. మరోపక్క ద్రవ్యోల్బణం తారస్థాయికి చేరింది. దిగుమతుల సామర్థ్యం అడుగంటింది. ఈ పరిస్థితుల్లో ప్రతి చిన్న సాయం విలువైనదే. అసహజ వాతావరణ పరిస్థితులు చుట్టుముట్టిన పాకిస్తాన్‌కు సాయం అందించాల్సిందిగా ఐరాస సైతం అభ్యర్థించింది. అమెరికా, చైనా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఖతార్, టర్కీ సహా పలు దేశాలు ఇప్పటికే సహాయం అందిస్తున్నాయి. నిజానికి, అప్పుల ఊబిలో కూరుకుపోయిన పాక్ దీర్ఘకాలంగా ఆర్థిక ఉద్దీపన కోసం నిరీక్షిస్తోంది. అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ ఎట్టకేలకు 110 కోట్ల డాలర్ల ఉద్దీపనకు మంగళవారం ఆమోదం తెలిపింది. ఈ పరిస్థితుల్లో సోదర భారత్ సైతం పెద్ద మనసుతో వరద బాధితులకు సాయం చేయడమే సరైన చర్య.

ఇంతవరకూ నోరు విడిచి భారత సాయం కోరని పాక్ పాలకులు సైతం ఒక అడుగు ముందుకు వేయాలి. భారత్ నుంచి కూరగాయల దిగుమతికి ఆలోచిస్తామని ఒకసారి, భారత భూ సరిహద్దు ద్వారా ఆహారం పంపడానికి అనుమతించాలన్న అంతర్జాతీయ సంస్థల అభ్యర్థనపై సంకీర్ణ భాగస్వాములతో, కీలకమైనవారితో చర్చించి నిర్ణయిస్తామని మరోసారి పాక్ ఆర్థిక మంత్రి వ్యాఖ్యానించడం అసంబద్ధం. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడూ భౌగోళిక రాజకీయాలకే ప్రాధాన్య మిస్తే, అది అమానుషం. గతంలోనూ ఇలాగే ద్వైపాక్షిక, దౌత్య గందరగోళాలతో ఇరు దేశాల మధ్య సాయానికి గండిపడ్డ సందర్భాలున్నాయి. 2000ల తొలినాళ్ళలో పరిస్థితి ఇలా ఉండేది కాదు. 2001లో భుజ్ భూకంపం వేళ మనకు పాక్ సాయం చేస్తే, 2005లో కశ్మీర్‌లో, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో భూకంపం వచ్చినప్పుడు నియంత్రణ రేఖ, వాఘా సరిహద్దులు దాటి మనం సరఫరాలు అందించాం. కానీ, 2008 నాటి 26/11 ముంబయ్ దాడుల తర్వాత ప్రకృతి వైపరీత్యాల వేళ సైతం పరస్పర సాయాలు బాగా తగ్గిపోయాయి. నిరుడు కరోనా రెండో వేవ్‌లో తమ దేశం గుండా ఆక్సిజన్ కారిడార్‌కు పాక్ ప్రధాని ఇమ్రాన్ ముందుకొచ్చినా, మన పాలకులు ఓకే చెప్పలేదు.

2010 నాటి వరదల వేళ 2.5 కోట్ల డాలర్ల మేర ఆర్థిక, వస్తు సాయం సహా గతంలో మనం అనేకసార్లు పాక్‌కు సాయం చేసినా, అది పాముకు పాలు పోసినట్టే అయిందని విమర్శకుల వాదన. అందులో కొంత నిజం లేకపోలేదు. అలాగే, కశ్మీర్‌కు వర్తించే ఆర్టికల్ 370ని 2019లో రద్దు చేశాక పొరుగుదేశమే మనతో వాణిజ్య సంబంధాలు తెగతెంపులు చేసుకుంది. అయితే గతాన్ని తవ్వుకొనే కన్నా, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకోవడం ముఖ్యం. దేశంలో అధిక భాగం వ్యవసాయ భూములు నీట మునగడంతో పాకిస్తాన్‌కు ఆహార కొరత, అలాగే ఆరోగ్య సమస్యలు పొంచి ఉన్నాయి. వీటన్నిటి దృష్ట్యా రాజకీయాలను పక్కనపెట్టి అమాయక ప్రజల కష్టాలను ఆలోచించాలి.

సామాన్య పాకిస్తానీయులకు ఆహార, ఆరోగ్య, తాత్కాలిక ఆవాసాల సాయం చేయడం వల్ల భారత్‌కూ లాభాలున్నాయి. సద్భావన పెరుగుతుంది. వ్యూహాత్మకంగా చూస్తే – పాక్‌లో చైనా చేప ట్టిన బీఆర్ఐ ప్రాజెక్టులు ఇరుకునపడ్డాయి. పాక్ సైతం అమెరికాతో సంబంధాలను మళ్ళీ మెరుగు పరుచుకోవాలని చూస్తోంది. పరిస్థితుల్ని సానుకూలంగా మలుచుకోవడానికి ఇదే సమయం. వరద సాయం ద్వారా దాయాదుల స్నేహానికి భారత్ ద్వారాలు తెరవాలి. నిరుడు ఆఫ్ఘన్‌కు 40 వేల మెట్రిక్ టన్నుల గోధుమలు పంపిన మనం పాక్‌కూ సాయం చేయాలి. పొరుగు వారు కొండంత కష్టంలో ఉన్నప్పుడు చూపాల్సిన మానవతకు మీనమేషాలు లెక్కించడం ధర్మం కాదు. అపకారికి సైతం ఉపకారం చేయాలనే సిద్ధాంతాన్ని నమ్మిన ధర్మభూమికి అసలే పాడి కాదు. దాయాదుల పోరులో దయనీయ ప్రజానీకం కష్టపడితే అది ప్రకృతి శాపం కాదు... పాలకుల పాపం!

మరో రూపంలో మహానేత

సందర్భం



అంబటి రాంబాబు

మహానేతలు ప్రజల హృదయాల్లో ఎప్పుడూ నిలిచే ఉంటారు. అందుకు మంచి ఉదాహరణ దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి. తన మాటల ద్వారా, చేతల ద్వారా ప్రజలకు దగ్గరై వారి అభ్యున్నతికి కృషి చేస్తూ అనుకోకుండా అసువులు బాసిన నేత. ఉచిత విద్యుత్తు, ఫీజు రీయింబర్స్‌మెంట్, 108, 104, ఆరోగ్యశ్రీ, గృహనిర్మాణం, జల యజ్ఞం... ఈ పథకాల్లో కొన్నింటిని ఆయనే రూపొందించి అందిస్తే, మరికొన్నింటిని అమలు చేయడం ఎలాగో చూపించారు. రాజకీయ ప్రత్యర్థులు ఎక్కుపెట్టిన దుష్ప్రచారాన్ని చిరునవ్వుతో ఎదుర్కొని, ప్రజా సంక్షేమ పథకాల ద్వారా వారికి పుట్టగతులు లేకుండా చేశారు. వైఎస్సార్ మరణం తర్వాత ఆయన కుటుంబంపై వ్యాపింపచేసిన అబద్ధాలూ, చేసిన ఆరోపణలూ, పెట్టిన ఇబ్బందులూ... అన్నింటినీ ప్రజలు గమనించారు. అందుకే ఆయన కుమారుడు జగన్ మోహన్ రెడ్డిని గెలిపించారు. ఆ విధంగా రాజన్న రాజ్యాన్ని పునఃప్రతిష్ఠించారు.

ఎన్నో జ్ఞాపకాల భాండాగారం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి. దగ్గరగా ఉన్న నాలోటి వ్యక్తులకే కాక, ఏనాడూ ఆయన్ను ప్రత్యక్షంగా చూడని... కలవని కోట్ల మందికి కూడా వైఎస్సార్ ఆత్మీయుడు, ఆరాధ్యుడు, మనసుకు దగ్గరి మనిషి! అనూహ్య పరిస్థితుల్లో ఆయన మరణించి, నేటికి 13 ఏళ్ళు పూర్తవుతోంది. ఆయన మిగిల్చిన జ్ఞాపకాలు మాత్రం చెక్కుచెదర లేదు.

ఇన్నేళ్ల తరవాత కూడా, ఆయన తెలుగు రాష్ట్రాల్లో ప్రతి గ్రామంలో, కోట్ల కొద్దీ తెలుగు హృదయాల్లో అలాగే ఉండిపోయారు. ఉచిత విద్యుత్తు, ఫీజు రీయింబర్స్‌మెంట్, 108, 104, ఆరోగ్యశ్రీ, గృహనిర్మాణం, జల యజ్ఞం... ఈ పథకాల్లో కొన్నింటిని ఆయనే రూపొందించి అందిస్తే, మరి కొన్నింటిని అమలు చేయటం ఎలాగో చూపించారు. రాష్ట్రాలు విడిపోయినా, ముఖ్యమంత్రులు, అధికార పార్టీలూ మారినా, గిట్టక ఈ పథకాల అమలును నీరుగార్చటానికి వారిలో కొందరు ఎన్ని ప్రయత్నాలు చేసినా... నీరుగార్చటానికి ప్రయత్నించినవారు నీరుగారి పోయారు తప్ప, ఆ పథకాలు చెక్కు చెదరలేదు.


మహానేత ముఖ్యమంత్రిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను పరిపాలించినది కేవలం అయిదేళ్ళ మూడు నెలలు. మిగతా కాలం అంతా, ఎవరు అధికారంలో ఉన్నా మహానేత మీద జరిగినదంతా దుష్ప్రచారమే. సొంత పార్టీలో కొందరికీ; విపక్షానికీ, విపక్షాన్ని సమర్థించే మీడియాకూ... అందరికీ టార్గెట్ నంబర్-1 వైఎస్సార్. ఇంతమంది కడుపుమంటనూ ఓపికగా భరించాడు, చిరునవ్వుతోనే జయించాడు. అందరినీ ఎదురొడ్డి నిలిచాడు, గెలిచాడు!

వైఎస్సార్ మరణానంతరం గడచిన 13 సంవత్సరాల్లో, వైఎస్ జగన్‌గారి మీద ఆ దాడి మరింత పెరిగింది. ప్రజలకు మంచి చేసిన చరిత్రే లేని ప్రత్యర్థులు ఈ 13 సంవత్సరాలుగా ఎంచుకున్న మార్గం కూడా అదే. జగన్‌పై దుష్ప్రచారం. అక్రమ కేసుల బనాయింపు. వ్యవస్థల మేనేజ్‌మెంట్! మూడున్నర దశాబ్దాల రాజకీయ జీవితంలో వైఎస్సార్ ఎంతటి దుర్మార్గమైన దుష్ప్రచారాన్ని ఎదుర్కొన్నారో, ఈ 13 ఏళ్లలో వైఎస్ జగన్ అంతకు మించిన దుష్ప్రచారాన్ని ఎదుర్కొన్నారు.

విద్వేషపూరిత యుద్ధం

ప్రజా క్షేత్రంలో, ప్రజా సమస్యల మీద పోరాడే సత్తాలేని వారంతా నాడు తండ్రి మీద... ఆ తరవాత తనయుడి మీద చేసినది రాజకీయ పోరాటం కాదు. వ్యక్తిగత ద్వేషాలతో యుద్ధం. ఢిల్లీ స్థాయిలో జాతీయ పార్టీలను కూడా మచ్చిక చేసుకునే నైపుణ్యం ఉన్న చంద్రబాబుకు; ఎల్లో మీడియాకూ, దుష్ట చతుష్టయానికీ ఆ రోజుల్లో ఏనాడూ వైఎస్సార్ లొంగలేదు. ఆ తరవాత, రాజకీయాల్లో ప్రవేశించిన నాటి నుంచి నేటి వరకు జగన్ ఏనాడూ రాజీపడలేదు. కాబట్టి ఆనాడూ ఈనాడూ ప్రత్యర్థులు ఒక్కరే. అక్కసుతో, అసూయతో, ద్వేషంతో చేసే దుష్ప్రచారాలు మాత్రం మరో నాలుగు రెట్లు పెరిగాయి.

కాబట్టే, తండ్రిని మించిన తనయుడిగా వైఎస్ జగన్ ఈ ప్రచారాలకు తన సంక్షేమ, అభివృద్ధి పథకాలతో మరో నాలుగు అడుగులు ముందుకు వేసి సమాధానమిస్తున్నారు. దుష్ప్రచారాలు, అపోహలు, అసత్యాలు వైఎస్సార్‌కు అధికారం దక్కకుండా చాలా కాలమే ఆపాయిగానీ, శాశ్వతంగా అధికారం దక్కకుండా చేసే అంతటి శక్తి ఈ విష ప్రచారాలకు లేదు. ఒక్కసారి ప్రజలు అధికారం ఇచ్చిన తరవాత, ఆ పరిపాలనకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్న తీరును చూశాక, వైఎస్సార్ మీద ఎన్నికల్లో విజయం సాధించి అధికారం తెచ్చుకోవటం ఇక ఏనాటికీ జరగని పని అని ప్రతిపక్షానికి బాగా అర్థమయింది.



నేడు డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి వర్ధంతి

ఇప్పుడు ముఖ్యమంత్రి జగన్ విషయంలోనూ వారికి అదే అర్థమయింది. కేవలం 38 నెలల పాలనలో ఏకంగా రూ. 1.70 లక్షల కోట్లు డీబీటీగా అందించిన నాయకుడిని ఎదుర్కోవటానికి కావాల్సిన పాజిటివ్ సరంజామా నాలుగు దశాబ్దాల టీడీపీ తుప్పు సైకిల్‌కు లేదు. అలాగే దాన్ని తొక్కే శక్తి 73 ఏళ్ల చంద్రబాబుకూ లేదు. కాబట్టే సైకిల్ పెడల్స్ తొక్కే 'అదృష్టాన్ని' సొంత పుత్రుడికి కాకుండా దత్తపుత్రుడికీ, గత కాలపు మిత్ర పక్షానికీ అప్పగిస్తానని చంద్రబాబు అందరితోనూ కబుర్లు పంపుతున్నారు, బేరాలు ఆడుతున్నారు.

అత్యున్నత న్యాయ నిర్ణేతలు ప్రజలే!

వైఎస్సార్ హఠాన్మరణం తరవాత, ప్రజలంతా జగన్ మీద అమితమైన అభిమానం చూపిస్తే తట్టుకోలేక... వారి కుటుంబాన్ని రాజకీయంగా, ఆర్థికంగా ఎంతగా టార్గెట్ చేశారో, దేశంలోని అత్యంత శక్తిమంతమైన వ్యవస్థల్ని ఎలా ప్రయోగించి ఎంతగా ఇబ్బందులపాలు చేశారో కూడా ఈ పదమూడేళ్ల చరిత్రలో అడుగడుగునా కనిపిస్తుంది! ఈ దుర్మార్గ చరిత్రలన్నింటికీ, ఈ వ్యవస్థల దుర్మార్గానికి ప్రజాస్వామ్యంలో అత్యున్నత న్యాయ నిర్ణేతలైన ప్రజలు ఎలా బదులిస్తున్నారో కూడా ఈ 13 సంవత్సరాల చరిత్రే సజీవ సాక్ష్యంగా నిలుస్తుంది.

వైఎస్సార్, వైఎస్ జగన్... ఇద్దరూ ముఖ్యమంత్రులు. నాడు తండ్రి... నేడు తనయుడు! వైఎస్సార్ చరితార్థుడు. ఆయన కొడుకు, ఆయన అంచనాలకు మించి, తనకు తానుగా ఎదిగాడు! వైఎస్సార్ కంటే ఎక్కువగా శత్రువులను ఎదుర్కొని రాటుతేలి మరీ ఎదిగాడు! 44 ఏళ్ళుగా రాజకీయాల్లో ఉన్న చంద్రబాబు ఒక్కడిగా ప్రజల్లోకి వెళ్ళటానికి ధైర్యం చాలనంతగా ప్రజలకు మంచి చేసి ఎది గాడు. ప్రజలకు మంచి చేసే విషయంలో దేశంలోని ఏ ఇతర రాష్ట్ర ప్రభుత్వానికీ తీసిపోనని ప్రజల మనిషిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిరూ పిస్తుంటే... ఏ తండ్రి అయినా ఇంతకు మించి కోరుకునేది ఏముంటుంది?

మరోవంక, వైఎస్సార్ ప్రత్యర్థి పరిస్థితి చూడండి... నాడు 2004, 2009లో వైఎస్సార్ చేతిలో ఓడాడు, నేడు – వైఎస్ జగన్ చేతిలో కూడా మూడేళ్ళ క్రితం, 2019లో అంతకంటే దారుణంగా ఓడాడు. ప్రత్యర్థి, చివరికి తన కొడుకుని కూడా, అది కూడా అడ్డదారిలో మంత్రిగా నాలుగేళ్ళు కూర్చోబెట్టి కూడా... చిత్తుగా ఓడగొట్టుకున్నాడు. చంద్ర బాబు... బతికి ఉండీ ఎంతటి దురదృష్టవంతుడు! వైఎస్సార్... దివికి ఏగి కూడా ఎంతటి అదృష్ట వంతుడు!

తన రెక్కల కష్టంతో...

మహానేత మరణం తరవాత సానుభూతి పవనాలతో గెలిచాడన్న అపప్రథ కూడా వైఎస్ జగన్‌కు లేదు. 2019లో 175కు 151 ఎమ్మెల్యేలను ఆయన రెక్కల కష్టంతో, ఒంటి చేత్తో గెలిపించుకున్నారు. చివరికి చంద్ర బాబు కంచు కోట అయిన కుప్పంలో కూడా స్థానిక సంస్థల ఎన్నిక లన్నింటిలో టీడీపీకి బీటలు వారేలా చేసినది ఏమిటంటే... ఇంటింటికీ, మనిషి మనిషికీ కులం, మతం, ప్రాంతం, వర్గం, రాజకీయం కూడా చూడకుండా జగన్ చేసిన మంచి మాత్రమే. ప్రజల మధ్య, ప్రజల వాడిగా, ప్రజల తోడుగా... ఒంటి చేత్తో అధికారం తెచ్చుకున్న వైఎస్ జగన్ బాణీ విభిన్నమైనది! వైఎస్సార్ – వైఎస్ జగన్... ఇద్దరూ ఎవరి శైలిలో వారు ప్రజల ఛాంపియన్లు.

వైఎస్సార్ – వైఎస్ జగన్ ఇద్దరికీ వారి రక్తంలోనే ప్రాంతీయ అసమానతలను తొలగించాలన్న భావం బలంగా ఉంది. చేస్తున్నది మంచి అయినప్పుడు నిర్భయంగా అడుగు ముందుకు వేసే స్వభావం ఇద్దరిదీ. ప్రజల గుండె చప్పుడు స్వయంగా విన్న ప్రజా నాయకులు వీరిద్దరూ! ఒక్కో ప్రాంతంలో మనిషితోపాటు అక్కడి మట్టి, అక్కడి పేదరికం చెప్పే సంగతులు, సామాజిక వర్గాల ఆకాంక్షలు, అక్క చెల్లెమ్మల అంత రంగం, పిల్లల భవిష్యత్తు పట్ల విజన్ ఉన్న నాయకులు వీరిద్దరూ. తండ్రి మీద మమకారం ఆకాశమంత ఉన్నా, వినమ్రంగా 108, 104, ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్తు, జలయజ్ఞం వంటి పథకాలకు మరింతగా మెరుగులు దిద్ది కొనసాగించటమే కాకుండా... నేడు ప్రజల ఆర్తిని, అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని వైఎస్సార్ రైతు భరోసా, జగనన్న అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత వంటి నవరత్నాల పథకాలతో అడుగులు ముందుకు వేస్తున్న ధీశాలి, మనసున్న మనిషి... పేద వర్గాల పెన్నిధి వైఎస్ జగన్.

రోల్ మోడల్

మట్టి నుంచి పుట్టిన మొక్కకి... చెట్టు మీద పెరిగే పరాన్నజీవికి ఎంత తేడా ఉంటుందో జనం నుంచి పుట్టిన నాయకుడిని, అధికారం లాక్కున్న నాయకుడికి మధ్య కూడా అంతే భేదం ఉంటుంది.

దళిత, బీసీ, ఎస్టీ, మైనార్టీ, మహిళ, రైతు వర్గాలకు న్యాయం చేసే విషయంలో గట్టిగా అడుగులు పడకపోతే... తరాలు మారినా తల రాతలు మారవని గట్టిగా నమ్మి తన ఆచరణను నిర్ణయించుకున్న దార్శనికుడు జగన్. పరిపాలనలో భారతదేశంలోనే ఒక రోల్ మోడల్ ఆయన. 13 సంవత్సరాల క్రితం దివికి ఏగిన తండ్రి, నేడు భువి మీద తన తనయుడి పాలన చూసి కచ్చితంగా గర్విస్తాడు.

వ్యాస రచయిత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ జలవనరుల మంత్రి

నిజాలు చెప్పలేక రామోజీ యాతన!!



నాడు-నేడు కార్యక్రమం కింద ఆధునాతన వసులతో తీర్చిదిద్దిన బొబ్బిలి సీహెచ్సీ



నేడు

- ప్రసవం అనంతరం రూ.5వేలు చెల్లిస్తూ 'ఆరోగ్య ఆసరా'
- ఈ మూడేళ్లలో 2.61 లక్షల మందికి రూ.76 కోట్లతో ఆసరా
- ప్రభుత్వాసుపత్రుల బలోపేతానికి రూ.16,255 కోట్లతో నాడు-నేడు
- వైద్యానికి అత్యంత ప్రాధాన్యమిస్తూ ఏకంగా 40వేల పోస్టుల భర్తీ
- అంబులెన్స్‌లతో పాటు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌ల సంఖ్య కూడా పెంపు
- 10వేలకు పైగా విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ; గ్రామగ్రామానికీ ఫ్యామిలీ డాక్టర్
- ప్రభుత్వాసుపత్రులు పటిష్ఠం చేస్తూనే... ఆరోగ్య శ్రీ కూడా విస్తరణ
- దీనికింద అందే చికిత్సల సంఖ్య 1051 నుంచి ఏకంగా 3,158కి పెంపు
- ఇన్ని చేస్తున్నా వాస్తవాలతో పనిలేకుండా రామోజీ దిగజారుడు రాతలు
- ఒకటి రెండుచోట్ల లోపాలను రాష్ట్రం మొత్తానికి వర్తింపజేస్తూ అబద్ధాలు

ఛాతీ ఆసుపత్రిలో ప్రసవాలెందుకు చేస్తారు రామోజీరావు గారూ? మీ 'ప్రసవ యాతన'కు అడ్డూఅదుపూ లేదా? అధికారాన్ని కనటానికి చంద్రబాబు నాయుడితో కలిసి మీరెంత వేదన పడుతున్నారో జనానికి తెలియనిదేమీ కాదు. అలాగని ప్రతిరోజూ అబద్ధాలేనా? పండగ పూట అంతంత పెద్దగా పతాక శీర్షికల్లో వండి వార్చే ముందు కనీస వాస్తవాలేంటో తెలుసుకోవాలిగా? అనంతపురం సీడీ ఆసుపత్రిలో కొన్నేళ్లుగా ప్రసవాలే జరగటం లేదన్నది మీరు వాక్రుచ్చిన వార్తా రాజం. సీడీ ఆసుపత్రి అంటే చెస్ట్ డిసీజెస్ ఆసుపత్రి. అక్కడ ఊపిరితిత్తుల వ్యాధులు, ఇతర జబ్బులతో బాధపడుతున్న వారికి వైద్యసేవలందిస్తారు. ఇక్కడ గైనిక్ సేవలే ఉండవు. అలాంటి చోట గైనకాలజిస్టులు లేరంటూ... కొన్నేళ్లుగా ప్రసవాలే జరగటం లేదంటూ మీర్రాసిన రాతల్లో అర్థమేమైనా ఉందా? మీ చంద్రబాబు హయాంలోనూ ఇది చెస్ట్ ఆసుపత్రే కదా? ఇప్పుడెందుకు మీరు అంత యాతన పడుతున్నారు?

ఏది నిజం?

ముఖ్యమంత్రి ఇలాకాలో... అంటూ బాక్సు కట్టి రాసిన రాతలూ అంతే. పులివెందుల ఏరియా ఆసుపత్రిలో 22 మంది వైద్యులకు గాను 10 మందే ఉన్నారంటూ ఎందుకంత విషం చిమ్మటం? అక్కడ మొత్తం 23 మంది వైద్యులని... వారిలో 17 మంది ప్రస్తుతం ఉన్నారని, మరో ఆరుగురు వైద్యులను సమకూర్చడానికి కసరత్తు జరుగుతోందని ఆసుపత్రిలో అడిగితే చెబుతారు కదా? అయినా నిజాలతో పనిలేనపుడు అది తెలుసుకోవాలన్న ఉద్దేశం మాత్రం మీకెందుకుంటుంది లెండి!. 'వైద్యులు లేక గర్భిణులకు ఇబ్బంది... మత్తు వైద్య నిపుణులకూ కొరతే' అంటూ మీరు అచ్చేసిన కథనంలో నిజానిజాలేంటో చెప్పడానికి!!



వైఎస్సార్ తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనంలో ఇంటికి బయల్దేరుతున్న బాలింతలతో మంత్రి రజిని(ఫైల్)

ఆరోగ్య శ్రీ ఉందిగా... వేలకు వేలు ఖర్చెందుకు?

'ఈనాడు' రాతల్లో మరో దారుణమేంటంటే ప్రభుత్వాసుపత్రుల్లో వైద్యులు గానీ, సౌకర్యాలు గానీ లేక.. అంతా ప్రయివేటు ఆసుపత్రులను ఆశ్రయించి వేలకువేలు ఖర్చు చేస్తున్నారనేది!!. అసలు ఏ కొంచెమైనా ఇంగితం ఉండాలి కదా? సిజేరియన్ కావచ్చు, సాధారణం కావచ్చు... ప్రసవాలన్నీ ఆరోగ్య శ్రీ పరిధిలోనే ఉన్నాయి కదా? ప్రభుత్వాసుపత్రులకు వెళుతున్నారంటే వారంతా అర్హులేనని కదా అర్థం? మరి వాళ్లు ఒకవేళ తప్పనిసరై ప్రయివేట ఆసుపత్రులకు వెళ్లినా ఆరోగ్యశ్రీ కింద ప్రసవం జరుగుతుంది కదా? వాళ్లెందుకు వేలకువేలు ఖర్చు చేస్తారు? ఇవేం రాతలు రామోజీరావు గారూ? పైపెచ్చు ప్రసవానికి నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో చేరిన ప్రతి ఒక్కరికీ ప్రసవానంతరం విశ్రాంతి సమయానికి 'ఆరోగ్య ఆసరా' కింద ప్రభుత్వం రూ.5వేలు అందిస్తోంది. ఎందుకంటే పనిచేస్తే తప్ప పొట్టనిండని పేదలు ప్రసవానంతరం పనిచేయటం కష్టం కనక ఈ ఆసరా అవసరమన్నది సీఎం ఉద్దేశం. ఈ మూడేళ్లలో ఇలా ఆరోగ్య ఆసరా కింద 2,61,000 మందికి రూ.76.8 కోట్లు చెల్లించింది ప్రభుత్వం. కాకపోతే ఇవేవీ రామోజీకి కనిపించవు. అసలు 2014 నుంచి 2019 వరకూ చంద్రబాబు హయాంలో ఆరోగ్యశ్రీ కింద ఒక్క ప్రసవమైనా జరిగితే ఒట్టు!. ఎన్నికల గిమ్మిక్కులో భాగంగా 2018 డిసెంబర్లో ఓట్ల కోసం ప్రసవాల్ని ఆరోగ్యశ్రీ పరిధిలోకి తెచ్చారు. 2019 జనవరి 15 నుంచి చికిత్సలు మొదలు పెట్టారు. ఆ సమయంలో ప్రభుత్వాసుపత్రుల్లో వైద్యులు, మౌలిక వసతులు లేక అందరూ ప్రయివేటు ఆసుపత్రులనే ఆశ్రయించారు. వేలకువేలు వదిలించుకున్నారు. కాకపోతే అప్పుడు రాయాల్సిన రాతలన్నీ 'ఈనాడు' ఇప్పుడు రాస్తుండటమే విచిత్రం. చంద్రబాబు హయాంలో 1,051 రకాల చికిత్సలకు మాత్రమే ఆరోగ్య శ్రీ వర్తించగా... ఇపుడది మూడు రెట్లు పెరిగి ఈ నెల నుంచి ఏకంగా 3,158 చికిత్సలకు వర్తించబోతోంది. ఇలాంటి మంచిపనులు 'ఈనాడు'కు కనిపించకపోవటమే ఈ రాష్ట్రం చేసుకున్న దౌర్భాగ్యం.



నాడు చంద్రబాబు ప్రభుత్వంలో బొబ్బిలి సీహెచ్సీ ఇలా..

తల్లీబిడ్డకు సురక్షిత ప్రయాణం..

ప్రభుత్వాసుపత్రుల నుంచి ప్రసవానంతరం తల్లీబిడ్డను సురక్షితంగా ఇంటికి చేర్చడానికి 'తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్' సేవల్ని ప్రభుత్వం బలోపేతం చేసింది. గతంలో 279 పాత వాహనాలే దిక్కు కాగా... వీటిని 500కు పెంచటంతో పాటు ఈ మధ్యే 500 కొత్త వాహనాలతో సేవలు విస్తరించారు. ఏప్రిల్ నుంచి ఇప్పటికి దాదాపు లక్ష మంది దీన్ని వినియోగించుకున్నారు. మునుపు ఒక ట్రిప్పుల్లో ఇద్దరేసి బాలింతల్ని తరలించటంతో ఇబ్బందులు పడ్డ బాలింతలకు ఇప్పుడు ఒక్కరినే తరలించడం పెద్ద ఊరటే!!. కాకపోతే ఇవేవీ 'ఈనాడు'కు కనిపించవు.

40 వేల పోస్టుల భర్తీ...

మునుపెన్నడూ లేని విధంగా ఈ ప్రభుత్వ హయాంలో ఒక్క వైద్య శాఖలోనే ఏకంగా 40వేల పోస్టులు భర్తీ అయ్యాయి. మిగిలిన కొద్ది పోస్టులు కూడా వీలైనంత త్వరగా భర్తీ చేసేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అంతేకాకుండా ప్రభుత్వాసుపత్రుల్ని పునర్నిర్వచించేలా ఏకంగా రూ.16,255 కోట్లతో 'నాడు-నేడు' కింద వాటిని బాగు చేస్తున్నారు. ఇక ధనికులు మాత్రమే ఆలోచించగలిగే 'ఫ్యామిలీ డాక్టర్' విధానాన్ని ప్రతి గ్రామానికీ పరిచయం చేస్తోంది ప్రభుత్వం. వీటన్నిటికీ తోడు టీడీపీ హయాంలో గర్భిణులకు ముందులనేవి ప్రభుత్వాసుపత్రుల్లో దొరికితే ఒట్టు. నిజానికి గర్భిణులకు, బాలింతలకు రకరకాల సమస్యలు సహజం. గర్భిణులకు రక్తపోటు ఉంటే లాబెటాలోల్ మాత్రలు వాడాలి. ఇవి బహిరంగ మార్కెట్లో ఒక్కోటీ రూ.16 పైనే. రోజుకు 2-3 మాత్రల చొప్పున 3 నుంచి 5 నెలలు వాడాలి. అధిక రక్తస్రావం అయితే మిసోప్రోస్టోల్ వాడాలి. ఇవీ ఖరీదైనవే. ఇలాంటివేవీ టీడీపీ హయాంలో లేవు. బయటే కొనుక్కోవాల్సి వచ్చేది. ఇపుడైతే ఆ పరిస్థితులు లేవు. గర్భిణులకు, బాలింతలకు అవసరమైన మందులు... అవి కూడా డబ్ల్యూహెచ్ఓ ప్రమాణాలతో కూడినవి ప్రతి ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయి. ఈ వాస్తవాలేవీ ఈనాడు' పట్టవు మరి.

108 సేవలు మెరుగుపడలేదా?

టీడీపీ హయాంలో 1.19 లక్షల జనాభాకు ఒకటి చొప్పున '104 అంబులెన్స్'లు 440 మాత్రమే ఉండేవి. ఇందులో అంతంతమాత్రంగా సేవలందించినవి 336 మాత్రమే. మిగిలినవి కండీషన్లో ఉండేవి కాదు. వై.ఎస్.జగన్ అధికారంలోకి వచ్చాక 74 వేల మంది జనాభాకు ఒకటి చొప్పున 748 వాహనాలు అందుబాటులోకి తెచ్చారు. అప్పట్లో రోజుకు 1760 కేసుల్ని అటెండ్ అయిన అంబులెన్స్‌లు, ప్రస్తుతం 3294 కేసుల్ని డీల్ చేస్తున్నాయి.

గ్రామీణులకూ మెరుగైన వైద్యం..

గ్రామీణులకు ఉన్నచోటే మెరుగైన వైద్యం అందేలా 10,032 వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను గ్రామాల్లో నెలకొల్పుతున్నారు. వీటి ద్వారా ఇమ్యూనైజేషన్, ఓపీడీ, ఎన్‌సీడీ స్క్రీనింగ్ సహా పలు వైద్య సేవలు, 14 రకాల వైద్య పరీక్షలు, 67 రకాల మందులను ప్రభుత్వం అందిస్తోంది. వీటి ఏర్పాటుకు ఏకంగా రూ.1692 కోట్లు వెచ్చిస్తోంది. డిసెంబర్ 2022 నాటికి అన్ని క్లినిక్ భవనాలూ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తాయి.

పనులు జరుగుతుండటం పట్టదా?

వైద్య విధాన పరిషత్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 251 సీహెచ్‌సీ, ఏరియా, జిల్లా ఆస్పత్రులున్నాయి. వీటిలో 15 సీహెచ్‌సీల్లో ఈ ఏడాది జూలై వరకూ ఒక్క ప్రసవం జరగలేదన్నది 'రామోజీ' రాత. నిజానికి ఏడింట్లోనే ఒక్కటీ జరగలేదని, 6 ఆసుపత్రుల్లో ప్రసవాలు జరిగినా ఆన్‌లైన్లో ఎంటర్ చేయలేదని అధికారులు చెబుతున్నారు. మిగిలిన 7 చోట్ల నాడు-నేడు పనుల వల్ల లేబర్ రూమ్‌లు అందుబాటులో లేవు. కాకపోతే బురద చల్లడానికి ఈ నిజాలేవీ అవసరం లేదుగా?

ఇదీ... నాడు - నేడు లెక్క (రూ.కోట్లల్లో)	10032 వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ల ఏర్పాటు	1125 పీహెచ్‌సీలకు మరమ్మతులు, కొత్త భవనాల నిర్మాణం	వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల కోసం	42 ఏరియా ఆస్పత్రుల మరమ్మతులు, కొత్త భవనాల నిర్మాణం కోసం	ఎంసీహెచ్/ డీసీహెచ్ అభివృద్ధికి	సీహెచ్‌సీల అభివృద్ధికి	పాత వైద్య కళాశాలల బలోపేతానికి	కొత్త వైద్య కళాశాలల నిర్మాణానికి	గిరిజన మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణం	కడపలో స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం	పలాస సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం
	1,692	670	402	682	13	528	3,820	7,880	246	272	50

ఏఎన్‌యూకు జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంక్



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయానికి జాతీయ స్థాయి ఉత్తమ యూనివర్సిటీల కేటగిరీలో మంచి ర్యాంక్ లభించిందని వర్సిటీ ర్యాంకింగ్స్ కో–ఆర్డినేటర్ డాక్టర్ బీహెచ్ నాగ కిషోర్ గురువారం తెలిపారు. 'ద వీక్', 'హన్స రీసెర్చ్' అనే సంస్థలు కలిసి 2022వ సంవత్సరానికి నిర్వహించిన సర్వేలో ఏఎన్‌యూకు జాతీయ స్థాయి ఉత్తమ యూనివర్సిటీల్లో 16వ ర్యాంక్, సౌత్ జోన్ పరిధిలో బహుళ స్థాయి విశ్వవిద్యాలయాల కేటగిరీలో ఏడో ర్యాంక్, రాష్ట్రాల బహుళ విశ్వవిద్యాలయాల కేటగిరీలో ఎనిమిదో ర్యాంక్ వచ్చినట్లు వివరించారు. ఓవరాల్‌గా అన్ని విభాగాల్లో రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంక్ లభించిందని తెలిపారు. సమష్టి కృషితోనే ఏఎన్‌యూ ఈ ఘనత సాధించగలిగిందని వర్సిటీ వీసీ ఆచార్య పి.రాజశేఖర్ పేర్కొన్నారు. ఏఎన్‌యూ ఉత్తమ ర్యాంక్‌లు పొందడంపై రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ డాక్టర్ బి.కరుణ తదితరులు హర్షం వ్యక్తంచేశారు.

చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

- ఏపీ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారేష్



కృష్ణలంక (విజయవాడ తూర్పు): జనాభా దామాషా ప్రకారం పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి చట్ట సభల్లో బీసీలకు 50% రిజర్వేషన్లు కల్పించాలని ఏపీ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎన్.మారేష్ డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని పంట కాలువ రోడ్డులో బీసీ సంఘం రాష్ట్ర కార్యాలయాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. బీసీ బిల్లుకు సహకరించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ఉన్న బీసీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. రాబోయే రోజుల్లో బీసీ సంఘం ఆధ్వర్యంలో గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. రానున్న ఎన్నికల్లో ఏ పార్టీ అయితే బీసీలకు 50% సీట్లు కేటాయిస్తుందో ఆ పార్టీకే బీసీలు పట్టం కడతారన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రచార కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వేముల బేబీరాణి, ఏపీ బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాము పాల్గొన్నారు.

'ఆవ భూముల' కొనుగోళ్లలో అక్రమాలు కనిపించడంలేదు

ప్రైవేటు సంప్రదింపుల ద్వారానే ప్రభుత్వం భూములు కొన్నది

- ఈ భూములు వృథా కావడంలేదు.. పేదలకే ఇస్తున్నారు
- అభిప్రాయపడ్డ హైకోర్టు ధర్మాసనం
- ముంపు లేకుండా భూముల ఎత్తు పెంచుతున్నామన్న అదనపు ఏజీ
- ఇందుకు ఎకరాకు రూ.7 లక్షలు ఖర్చు చేస్తున్నాం
- ప్రభుత్వం లేని వారి వైపు ఉంటే, పిటిషనర్లు ఉన్న వారి వైపు ఉన్నారు
- భూములిచ్చిన వారు ఎవరూ అభ్యంతరం తెలపలేదు
- పోలవరం పూర్తయితే ముంపే ఉండదు
- పోలవరం ఎప్పుడు పూర్తవుతుందన్న ధర్మాసనం
- 2024లోపే పూర్తి చేసి జాతికి అంకితమిస్తామన్న అదనపు ఏజీ
- ముగిసిన వాదనలు.. తీర్పు వాయిదా



సాక్షి, అమరావతి : తూర్పు గోదావరి జిల్లాలోని ఆవ భూముల కొనుగోళ్లలో అక్రమాలు జరిగినట్లు కనిపించడంలేదని హైకోర్టు వ్యాఖ్యానించింది. ప్రైవేటు సంప్రదింపుల ద్వారానే ప్రభుత్వం ఆ భూములు కొన్నదని, అవి ఎంత మాత్రం వృథా కావడంలేదని తెలిపింది. ఆ భూములను పేదల ఇళ్ల స్థలాల కోసం ఉపయోగిస్తోందని తెలిపింది. ఆవ భూముల్లో పేదలందరికీ ఇళ్ల స్థలాల పథకం కింద పట్టాలు మంజూరు చేయడంపై దాఖలైన వ్యాజ్యాల్లో వాదనలు ముగిశాయి. తీర్పును వాయిదా వేస్తూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ సోమయాజులు ధర్మాసనం గురువారం ఉత్తర్వులిచ్చింది.

తూర్పు గోదావరి జిల్లా కోరుకొండ, రాజానగరం మండలాల్లో 586.96 ఎకరాల ఆవ భూములను ఇళ్ల స్థలాలకు కేటాయించకుండా ప్రభుత్వాన్ని ఆదేశించాలని, ఆ భూముల కొనుగోళ్లలో జరిగిన అక్రమాలపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ ఎ.శ్రీనివాసరావు 2020లో హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన అప్పటి సీజే ధర్మాసనం, ఆ భూములను పేదలందరికీ ఇళ్ల పథకం కింద ఇళ్ల స్థలాలకు కేటాయించవద్దని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ 2020 ఆగస్టులో మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఇదే అంశంపై మరిన్ని వ్యాజ్యాలు కూడా దాఖలయ్యాయి. ఈ వ్యాజ్యాలన్నింటిపై సీజే జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా ధర్మాసనం గురువారం మరోసారి విచారణ జరిపింది. పిటిషనర్ల తరఫు న్యాయవాది డీవీఎస్ఎస్ ప్రసాదబాబు వాదనలు వినిపిస్తూ, ఆవ భూములంటే ముంపునకు గురయ్యేవని అన్నారు. ప్రభుత్వం ఈ భూములకు నిర్దేశించిన దానికంటే ఎక్కువ చెల్లించిందని, రూ.600 కోట్ల మేర అక్రమాలు జరిగాయని తెలిపారు. ఇక్కడ ఇళ్లు నిర్మిస్తే పక్కన ఉన్న గ్రామాలు కూడా ముంపునకు గురవుతాయన్నారు. ఇదే తమ ప్రధాన ఆందోళన అని, ప్రభుత్వ విధానానికి తాము వ్యతిరేకం కాదని చెప్పారు. ప్రభుత్వాలు ఇస్తున్న ఉచితాల గురించి ప్రసాద్‌బాబు ప్రస్తావించగా, ఆ వ్యవహారం సుప్రీంకోర్టు చూసుకుంటుందని ధర్మాసనం స్పష్టం చేసింది.

పేదోళ్లు పేదోళ్లుగానే ఉండాలన్న ఉద్దేశంతోనే ఈ వ్యాజ్యాలు

రాష్ట్ర ప్రభుత్వం తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకరరెడ్డి వాదనలు వినిపిస్తూ, పేదోళ్లు పేదోళ్లుగానే ఉండాలన్నదే పిటిషనర్ల ఉద్దేశమని చెప్పారు. ఆవ భూములు ప్రభుత్వానివి కావని, రికార్డుల ప్రకారం జిరాయితీ భూములని చెప్పారు. పిటిషనర్లు కోర్టును తప్పుదోవ పట్టిస్తున్నారని తెలిపారు. గోదావరి జిల్లాలకు వరద సహజమన్నారు. వరద రాకుంటే వాటిని గోదావరి జిల్లాలు అనడానికి లేదని, అనంతపురం జిల్లాగా పిలవాలని నవ్వుతూ అన్నారు. ముంపునకు గురికాకుండా భూముల ఎత్తును ఒక మీటర్ పెంచుతున్నామన్నారు. ఇందుకోసం ఎకరాకు రూ.7 లక్షలు ఖర్చు చేస్తున్నామన్నారు.

ఎలాంటి మోసం లేదు.. నిబంధనల ప్రకారమే భూ సేకరణ

భూ సేకరణ చట్ట నిబంధనలకు లోబడే సంప్రదింపుల ద్వారా భూములు తీసుకున్నామని అదనపు ఏజీ తెలిపారు. ఇందులో ఎలాంటి మోసం లేదన్నారు. భూములిచ్చిన వారు ఎలాంటి అభ్యంతరం వ్యక్తం చేయలేదన్నారు. ఇప్పటికే రూ.170 కోట్లను భూ సేకరణ కింద చెల్లించామన్నారు. ఈ మొత్తం ప్రాజెక్టు విలువ రూ.300 కోట్లయితే, పిటిషనర్లు రూ..600 కోట్ల మేర అక్రమాలు జరిగాయని చెప్పడం హాస్యాస్పదమన్నారు. పిటిషనర్లు ఉన్న వారి వైపు ఉంటే, ప్రభుత్వం లేని వారి వైపు ఉందని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే ముంపు ఉండదని తెలిపారు. పోలవరం ఎప్పుడు పూర్తవుతుందని ధర్మాసనం ప్రశ్నించగా.. ఇది జాతీయ ప్రాజెక్టు అని, 2024లోపే పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని సుధాకరరెడ్డి చెప్పారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం తీర్పును వాయిదా వేసింది. 2020లో ఓ ప్రధాన న్యాయమూర్తి ఉన్నప్పుడు ఆవ భూముల కొనుగోళ్లలో భారీగా అక్రమాలు జరిగాయని, దీనిపై సీబీఐ విచారణకు ఆదేశించాలంటూ గగ్గోలు పెట్టిన ప్రసాద్‌బాబు, గురువారం నాటి విచారణలో ఆ ఊసే ఎత్తకపోవడం విశేషం.

ఎనిమిదవ నెలకే ప్రసవ వేదన..

- అంబులెన్స్‌లో గర్భిణికి ప్రసవం చేసిన సీహెచ్‌వో



శిశువును చూపుతున్న సీహెచ్‌వో

సంతమాగులూరు (అద్దంకి): హై రిస్క్‌తో ఎనిమిదవ నెలకే ప్రసవ వేదన పడుతున్న గర్భిణికి గ్రామ వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సీహెచ్‌వో (ఎంఎల్‌హెచ్‌పీ) వైద్యాధికారి సలహాలతో ప్రైవేట్ అంబులెన్స్‌లో సురక్షిత ప్రసవం చేశారు. బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలంలోని ఏల్చూరుకి చెందిన శ్రావణికి బుధవారం నొప్పులు వస్తున్నాయని ఆశా వర్కర్ నాగ దుర్గా ప్రసన్నతో చెప్పింది. ఆమె గ్రామ వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సీహెచ్‌వో సౌజన్యకు విషయాన్ని తెలిపారు. వెంటనే ఆమె గర్భిణి ఇంటికి వెళ్లి నెలలు నిండకుండానే నొప్పులు వచ్చినట్లు గుర్తించింది. హై రిస్క్‌తో ఉందని గ్రహించి వెంటనే ప్రైవేటు అంబులెన్స్‌లో వైద్యశాలకు తీసుకెళ్తుండగా, మార్గ మధ్యంలో గర్భిణికి తీవ్రంగా నొప్పులు వచ్చాయి. సీహెచ్‌వో సంతమాగులూరు వైద్యాధికారి వెంకటనారాయణ సలహాతో సురక్షితంగా కాన్పు చేసింది. దీంతో ఆమెను వైద్యాధికారితోపాటు గర్భిణి బంధువులు అభినందించారు.

బినామీల పేరిట బాబు దోపిడీ

బహుజన పరిరక్షణ సమితి నేతల మండిపాటు



తాడికొండ: తన అనుయాయులకు దోచిపెట్టేందుకే చంద్రబాబు ముందస్తు పన్నాగంతో ఈ ప్రాంతంలో తక్కువ ధరలకు బినామీలతో భూములు కొనుగోలు చేయించి.. అటు రైతులను, ఇటు రాష్ట్రాన్ని నిలువు దోపిడీ చేశారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో 704వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షల్లో గురువారం పలువురు పాల్గొన్నారు. సారవంతమైన భూములను అసైన్డ్ పేరుతో కుల వాదులకో ప్యాకేజీ, పేదలకో ప్యాకేజీ ఇచ్చి వివక్షతో అందరినీ ఇబ్బందులకు గురిచేశారని మండిపడ్డారు. రాజధానికి భూములిచ్చిన రైతులకు కనీసం రిటర్నబుల్ ప్లాట్లు కూడా ఇవ్వకుండా తాత్కాలిక నిర్మాణాల పేరుతో నిలువు దోపిడీ చేసి పరోక్షంగా లబ్ధి పొందారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బహుజన పరిరక్షణ సమితి నాయకులు నూతక్కి జోషి పాల్గొన్నారు.

ఉన్నతి ఫౌండేషన్‌కు పురస్కారం



కోష్యారి నుంచి పురస్కారాన్ని అందుకుంటున్న డాక్టర్ నరేంద్రరెడ్డి

గుంటూరు మెడికల్: సీనియర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి చైర్మన్‌గా వ్యవహరిస్తున్న ఉన్నతి ఫౌండేషన్‌కు అరుదైన గౌరవం దక్కింది. మహారాష్ట్ర గవర్నర్ భగత్‌సింగ్ కోష్యారి చేతుల మీదుగా ప్రజాడైరీ మ్యాగజైన్ సెలబ్రిటీ పురస్కారాన్ని డాక్టర్ నరేంద్రరెడ్డి అందుకున్నారు. ప్రజా మీడియా ఎంటర్‌టైన్‌మెంట్ 22వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ముంబైలోని రాజ్‌భవన్‌లో నిర్వహించిన వేడుకల్లో డాక్టర్ నరేంద్రరెడ్డి ఈ పురస్కారాన్ని స్వీకరించారు. పేదలకు ఉన్నతి ఫౌండేషన్ ద్వారా అందిస్తున్న వైద్యసేవలను గుర్తించి మహారాష్ట్రకు చెందిన ప్రజామీడియా ఈ పురస్కారానికి ఎంపిక చేసింది. గుంటూరు జీజీహెచ్‌లో పేద రోగులకు మోకీలు మార్పిడి ఆపరేషన్లకు అవసరమైన ఇంప్లాంట్స్‌ను ఉన్నతి ఫౌండేషన్ ద్వారా నరేంద్రరెడ్డి ఉచితంగా అందిస్తున్నారు. నరేంద్రరెడ్డికి బీఎంఆర్ గ్రూప్ చైర్మన్ బూసిరెడ్డి మల్లేశ్వరరెడ్డి అభినందనలు తెలిపారు.

- తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. రెండు కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 66,086 మంది స్వామిని దర్శించుకోగా, 27,305 మంది తలనీలాలు సమర్పించారు. హుండీలో రూ.3.72 కోట్లు వేశారు. దర్శనానికి ఐదు గంటల సమయం పడుతోంది.

ముత్య గణపతి



ప్రకాశం జిల్లా సింగరాయకొండలోని రైల్వేస్టేషన్ రోడ్డులో ఏర్పాటు చేసిన ముత్య గణపతి విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వివిధ రంగుల ముత్యాలతో చేసిన ఈ విగ్రహం విశేషంగా ఆకట్టుకుంటోంది. ఆర్యవైశ్య గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో రాజస్థాన్ కళాకారులు 30వేల ముత్యాలు వినియోగించి గణేశ్ విగ్రహాన్ని రూపొందించారు.

– సింగరాయకొండ

నగదు కోసమే దంపతుల హత్య

- వీడిన నెల్లూరు దంపతుల హత్య కేసు మిస్టరీ
- పనోడే సూత్రధారి.. మరో వ్యక్తితో కలిసి ఘాతుకం
- ఎట్టకేలకు నిందితుల అరెస్ట్
- వాస్తవాలు తెలుసుకోకుండా ఎల్లోమీడియా తప్పుడు ప్రచారం
- ఈ నేరాన్ని వైఎస్సార్‌సీపీపైకి నెట్టేందుకు విఫల యత్నం

నెల్లూరు(క్రైమ్): నెల్లూరులో సంచలనం సృష్టించిన దంపతుల హత్య కేసులోని మిస్టరీని పోలీసులు ఛేదించారు. దీంతో ఎల్లో మీడియా ప్రచారం శుద్ధ అబద్ధం అని స్పష్టమైంది. ఈ ఘటనకు సంబంధించి వాస్తవాలు తెలుసుకోకుండా వైఎస్సార్‌సీపీ నేతలపైకి తప్పిదాన్ని నెట్టి, ప్రజల్లో చులకన చేయాలనుకున్న టీడీపీ, ఎల్లో మీడియా పన్నాగం బెడిసికొట్టింది. హోటల్లో పనిచేసే వ్యక్తే.. వరుసకు సోదరుడయ్యే మరొకనితో కలిసి నగదు కోసం ఈ ఘాతుకానికి ఒడిగట్టారని తేలడంతో పోలీసులు వారిద్దరినీ అరెస్ట్ చేసి రూ.83 వేల నగదు, 3 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం నెల్లూరు జిల్లా ఎస్పీ సీహెచ్ విజయారావు మీడియాకు వివరాలు చెప్పారు. నెల్లూరులోని పడారుపల్లి అశోక్‌నగర్‌కు చెందిన వాసిరెడ్డి కృష్ణారావు(54), సునీత(50) దంపతులు నగరంలోని కరెంట్ ఆఫీసు సెంటర్‌లో శ్రీరామ్ క్యాంటీన్ నిర్వహిస్తున్నారు. ఆగస్టు 27న అర్ధరాత్రి దంపతులు తమ ఇంట్లోనే దారుణ హత్యకు గురయ్యారు. క్యాంటీన్‌లో పని చేసే సిబ్బందిని పోలీసులు విచారణకు పిలవగా శివ అనే వ్యక్తి మినహా అందరూ హాజరయ్యారు. దీంతో అనుమానం వచ్చిన పోలీసులు అతని ఇంటిపై నిఘా ఉంచారు. గత నెల 31నమధ్యాహ్నం పోలీసులు శివ ఇంటికి వెళ్లగా శివతో పాటు ఉన్న రామకృష్ణ ఇద్దరూ పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించారు. అయితే పోలీసులు వారిని వెంబడించి పట్టుకున్నారు. వారి వేలి ముద్రలు, సంఘటన స్థలంలో లభ్యమైన వేలి ముద్రలకు సరిపోయాయి. విచారణలో నిందితులు ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్టు తేలింది. గత నెల 27 రాత్రి ఇద్దరూ మద్యం తాగి.. హోటల్ యజమాని ఇంటికి చేరుకున్నారు. కొద్దిసేపటికి కృష్ణారావు ఇంటికొచ్చారు. తలుపు తీసే సమయంలో ప్రహరీ పక్కన నక్కి ఉన్న రామకృష్ణ కర్రతో అతని తలపై బలంగా కొట్టడంతో కిందపడిపోయాడు. బయట ఉన్న శివ వచ్చి కత్తితో గొంతు కోసి హతమార్చాడు. మృతుడి జేబులో ఉన్న రూ.10 వేలు తీసుకున్నారు. అనంతరం ఇంట్లోకి వెళ్లి నిద్రిస్తున్న సునీత తలపై రామకృష్ణ కర్రతో బలంగా కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఇల్లంతా వెతికి రూ.1.50 లక్షలు తీసుకుని బయటకొచ్చారు. పోలీసుల విచారణతో నిందితులిద్దరూ దొరికిపోయారు.

జీవ వైవిధ్య పరిరక్షణకు కమిటీలు

- రాష్ట్ర వ్యాప్తంగా 13,300 గ్రామాల్లో ఏర్పాటు
- బయో డైవర్సిటీ బోర్డు చైర్మన్‌బీఎంకే రెడ్డి

రంపచోడవరం (అల్లూరి సీతారామరాజు జిల్లా) : జీవ వైవిధ్యాన్ని కాపాడేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 13,300 గ్రామాల్లో కమిటీలు ఏర్పాటు చేసినట్లు బయో డైవర్సిటీ బోర్డు చైర్మన్ డాక్టర్ బీఎంకే రెడ్డి తెలిపారు. పందిరిమామిడిలోని డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ రీసెర్చ్ స్టేషన్, కృషి విజ్ఞాన కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవడం ద్వారానే మానవ మనుగడ సాధ్యమన్నారు. పాపికొండలు, శేషాచలం అడవులు, నల్లమల్ల ఫారెస్టులో ప్రసిద్ధి చెందిన జీవరాశులు ఉన్నాయని తెలిపారు. జీవ వైవిధ్య పరిరక్షణ అంటే ప్రకృతి వనరుల సంరక్షణే అని అన్నారు. ప్రస్తుతం ఉన్న వ్యవసాయ పద్ధతులలో 40 ఏళ్ల తర్వాత భూమి సారం కోల్పోయి నిర్వీర్యమవుతుందని, ఆహార భద్రత ఉండదని నిపుణులు హెచ్చరిస్తున్నారని తెలిపారు. భవిష్యత్ ఆహార భద్రత కోసం జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఇందు కోసమే రాష్ట్ర వ్యాప్తంగా జీవ వైవిధ్య కమిటీలు ఏర్పాటు చేశామని చెప్పారు. పంచాయతీ స్థాయిలో ఒక్కో కమిటీకి రూ.10 వేలు మంజూరు చేసినట్లు తెలిపారు. అంతకు ముందు ఆయన కేవీకే ఆవరణలో ఎర్రచందనం మొక్కలు నాటారు. తాటి కల్లుతో నీరా తయారు చేసే యూనిట్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కేవీకే కోఆర్డినేటర్ లలితాకామేశ్వరి, శాస్త్రవేత్త వెంగయ్య, ఆదర్శ తదితరులు పాల్గొన్నారు.

ఈ నెలా మస్తు వానలు!

న్యూఢిల్లీ: సెప్టెంబర్‌లో కూడా అధిక వర్షపాతం నమోదవుతుందని భారత వాతావరణ శాఖ ప్రకటించింది. నైరుతీ రుతుపవనాలు ముందుగానే నిష్క్రమించవచ్చంటూ గత వారం వేసిన అంచనాలను వెనక్కు తీసుకుంది. అవి మరికొంతకాలం కొనసాగుతాయని ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర గురువారం మీడియాకు వెల్లడించారు. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడటం తదితరాలు ఇందుకు కారణమని చెప్పారు. వాటి ప్రభావంతో ఉత్తరప్రదేశ్, బిహార్లలో రానున్న రెండు మూడు రోజుల్లో భారీగా వర్షాలు కురుస్తాయని పేర్కొన్నారు. ఈ ఏడాది మొత్తమ్మీద సాధారణం కంటే 7 శాతం దాకా ఎక్కువ వర్షపాతం నమోదైనా యూపీ, పశ్చిమబెంగాల్, బిహార్, జార్ఖండ్, మణిపూర్, త్రిపురల్లో పలు ప్రాంతాల్లో మాత్రం వర్షాభావ పరిస్థితులే నెలకొన్నాయి. ఇది ఖరీఫ్ సీజన్లో వరి నాట్లపై బాగా ప్రభావం చూపింది. ఈ లోటును సెప్టెంబర్ వర్షపాతం భర్తీ చేస్తుందని మహాపాత్ర ఆశాభావం వెలిబుచ్చారు.

క్లుప్తంగా...

దావూద్ ఆచూకీ తెలిపితే రూ. 25 లక్షల రివార్డు



ముంబై: 1993 ముంబై వరుస పేలుళ్ల సూత్రధారి, మాఫియా డాన్ దావూద్ ఇబ్రహీం ఆచూకీ తెలిపితే రూ.25 లక్షల రివార్డును జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ప్రకటించింది. అతని సన్నిహితుడు చోటా షకీల్‌పై రూ.20 లక్షలు, అనుచరులు హాజీ అనీస్, జావెద్ పటేల్ అలియాస్ జావెద్ చిక్నా, ముష్తాక్ అబ్దుల్ రజాక్ మెమన్ అలియాస్ టైగర్ మెమన్‌లపై రూ.15 లక్షల చొప్పున రివార్డు ప్రకటించింది. డి-కంపెనీపై ఫిబ్రవరిలో కేసు నమోదు చేసినట్లు తెలిపింది.

'హేమంత్'పై త్వరగా తేల్చండి

జార్ఖండ్ గవర్నర్‌కు యూపీఏ విజ్ఞప్తి

రాంచీ: జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ శాసనసభ్యత్వాన్ని కొనసాగించేదీ లేనిదీ తక్షణం తేల్చాలని గవర్నర్‌ను అధికార యూపీఏ కూటమి కోరింది. కూటమి ఎమ్మెల్యేలు గవర్నర్ రమేశ్ బైస్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రమిచ్చారు. ''స్వయంగా రాజ్‌భవన్ నుంచే సమాచార లీకేజీలు జరగడం దురదృష్టకరం. వీటితో రాష్ట్రంలో గందరగోళ పరిస్థితులు తలెత్తాయి. నిపుణులతో సంప్రదించాకే నిర్ణయం వెల్లడిస్తానని గవర్నర్ చెప్పినట్టు ఎంపీ గీత కోరా వెల్లడించారు. సెప్టెంబర్ ఐదున అసెంబ్లీని ప్రత్యేకంగా సమావేశపరచాలని గవర్నర్‌ను కోరాలని మంత్రివర్గ అత్యవసర భేటీ నిర్ణయించింది.

ఇద్దరు భారతీయ అమెరికన్లకు బైడెన్ కీలక బాధ్యతలు

వాషింగ్టన్: బైడెన్ భారతసంతతికి చెందిన మను ఆస్తానా, మధు బెరివాల్‌లకు నేషనల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అడ్వైజరీ కౌన్సిల్(ఎన్ఐఏసీ)లో స్థానం కల్పించనున్నట్లు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ప్రకటించారు. కీలకమైన మౌలికరంగ సదుపాయాల్లో భద్రతను పెంచడం, సైబర్ బెడదను అరికట్టడంపై అధ్యక్షుడికి ఎన్ఐఏసీ సలహాలిస్తుంది. ఇక ఉత్తర అమెరికాలోనే అతి పెద్ద విద్యుత్ గ్రిడ్ పర్యవేక్షణ బాధ్యతలను విద్యుత్ రంగ నిపుణుడైన ఆస్తానాకు అప్పగించారు.

ఇద్దరు ఉగ్రవాదులు హతం

శ్రీనగర్: జమ్మూ కశ్మీర్‌లోని బారాముల్లా జిల్లా సాపోర్‌లో బుధవారం రాత్రి జరిగిన ఎన్‌కౌంటర్‌లో జైషే మొహమ్మద్‌కు చెందిన ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. బొమై ప్రాంతంలో కూంబింగ్ సందర్భంగా బలగాలతో ఎదురుకాల్పుల్లో మృతి చెందిన వీరిని సాపోర్‌కు చెందిన మహ్మద్ రఫీ, పుల్వామా వాసి కైసర్ అష్రాఫ్‌గా గుర్తించారు.

ట్విట్టర్‌లో ఎడిట్ ఆప్షన్

న్యూయార్క్: ట్విట్టర్ యూజర్లు తమ ట్వీట్లను ఎడిట్ చేసుకునే సదుపాయం త్వరలో అందుబాటులోకి రానుంది. ''ట్విట్టర్ బ్లూ సర్వీస్ ప్రీమియం ఖాతాదారులకు త్వరలో ఈ సదుపాయం కల్పించనున్నాం. ట్వీట్ చేసిన 30 నిమిషాలలోపు ఆ ట్వీట్‌లో స్పెల్లింగ్ మార్పులు, హ్యాష్‌ట్యాగ్‌లు జోడింపులు చేసుకోవచ్చు'' అని ట్విట్టర్ వెల్లడించింది.

రెండు కోట్ల జనం లాక్‌డౌన్

బీజింగ్: చైనాలో కరోనా వైరస్ మళ్లీ పంజా విసురుతోంది. ఇటీవల చెంగ్డూ సిటీలో 1,000 కేసులు వెలుగుచూడటంతో వైరస్ వ్యాప్తికి అడ్డుకట్టవేసేందుకు కఠిన చర్యల్లో భాగంగా ప్రభుత్వం మళ్లీ జనంపై ఆంక్షలు విధించింది. ఏకంగా 2.1 కోట్లపై లాక్‌డౌన్ విధించింది. పాలన పరంగా, ఆర్థిక కార్యకలాపాలకు కేంద్ర బిందువైన సిచువాన్ ప్రావిన్స్‌లోని చెంగ్డూ సిటీలో ఎవరూ బయటకు రావొద్దని ఆదేశాలిచ్చింది. కుటుంబానికి ఒక్కరు చొప్పున కరోనా నెగెటివ్ సర్టిఫికెట్‌తో వస్తేనే సరకులు కొనేందుకు అనుమతిస్తారు.

యూపీలో మదర్సాలపై సర్వే

లక్నో: మదర్సాల్లో విద్యార్థులకు కనీస వసతులపై యూపీ ప్రభుత్వం దృష్టిసారించింది. అనధికారిక/గుర్తింపులేని మదర్సాల సమగ్ర వివరాల సేకరణ కోసం సర్వే చేయనుంది. వాటి పేరు, నిర్వహించే సంస్థ, ఆదాయ వనరులు, ఎన్జీవోకు అనుబంధమా వంటివాటినీ సర్వేచేయనుంది. రాష్ట్రంలో 16 వేలకు పైగా మదర్సాలున్నాయి. వాటిలో 560 మదర్సాలకు ప్రభుత్వ నిధులు అందుతున్నాయి.

భారత్ బ్రహ్మాస్త్రం

పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందిన తొలి బాహుబలి నౌక ఐఎన్ఎస్ విక్రాంత్

- రూ. 20 వేల కోట్ల ఖర్చు, క్షిపణి దాడినీ తట్టుకునేలా నిర్మాణం
- ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ తయారీ దేశాల సరసన భారత్
- ఏకంగా 14 అంతస్తులు, 2,300 కంపార్ట్‌మెంట్లు
- నేడు జాతికి అంకితం చేయనున్న ప్రధాని
- వచ్చే ఏడాది తూర్పు నౌకాదళ అమ్ముల పొదిలోకి



రక్షణ రంగంలో మన శక్తి సామర్థ్యాలను ప్రపంచానికి ఘనంగా చాటే రోజు రానే వచ్చింది. ఇప్పటిదాకా మన దగ్గరున్న యుద్ధ నౌకలన్నీ బ్రిటన్, రష్యాల నుంచి దిగుమతి చేసుకున్నవే. అలాంటిది అగ్రదేశాలే ఆశ్చర్యపోయేలా అత్యాధునిక విమానవాహక యుద్ధనౌక ఐఎన్ఎస్ విక్రాంత్‌ను పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో భారత్ విజయవంతంగా నిర్మించింది. ఈ సామర్థ్యమున్న అమెరికా, రష్యా, ఇంగ్లండ్, ఫ్రాన్స్ సరసన సగర్వంగా తలెత్తుకుని నిలిచింది. చైనాతో ఉద్రిక్తత నెలకొన్న వేళ ఆత్మనిర్భర్ భారత్‌కు ఊతమిస్తూ నిర్మించిన ఈ బాహుబలి యుద్ధనౌకను ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం జాతికి అంకితం చేయనున్నారు. కొచ్చి తీరంలో నావికాదళానికి అప్పగించనున్నారు. ఇది 2023లో తూర్పు నౌకాదళ అమ్ములపొదిలో పూర్తిస్థాయిలో చేరే అవకాశముంది.

ఐఎన్ఎస్ విక్రాంత్. విజయానికి, శౌర్యానికి గుర్తు. మన దేశ గౌరవానికి ప్రతీక. మన తొలి విమాన వాహక నౌక. బ్రిటన్ నుంచి 1961లో కొనుగోలు చేసిన ఈ నౌక ఎన్నో యుద్ధాల్లో కీలకపాత్ర పోషించింది. మరపురాని విజయాలు అందించింది. 1997లో రిటైరైంది. ఇప్పుడు పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన తొలి నౌక ఐఏసీ-1కు కూడా అదే పేరు పెట్టారు. నాటి విక్రాంత్ కంటే మెరుగైన సాంకేతికతతో రూపొందించిన ఈ బాహుబలి యుద్ధ నౌక భారత్ చేతిలో బ్రహ్మాస్త్రమే కానుంది.

అత్యాధునిక సాంకేతికత

విక్రాంత్ నిర్మాణంలో అత్యాధునిక సాంకేతికతను వాడారు. క్యారియర్ మెషినరీ ఆపరేషన్లు, షిప్ నేవిగేషన్, ఆటోమేటిక్ సర్వైబిలిటీ సిస్టం ఏర్పాటు చేశారు. మేజర్ మాడ్యులర్ ఓటీ, ఎమర్జెన్సీ మాడ్యులర్ ఓటీ, ఎల్ఎం 2500 గ్యాస్ టర్బైన్లు 4, ప్రధాన గేర్‌బాక్స్‌లు, షాఫ్టింగ్, పిచ్ ప్రొపెల్లర్ కంట్రోలర్స్, ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ సిస్టమ్, స్టీరింగ్ గేర్, ఎయిర్ కండిషనింగ్ ప్లాంట్లు, కంప్రెసర్లు, సెంట్రిఫ్యూజన్, 60 క్రిటికల్ పంప్స్, విద్యుత్ ఉత్పత్తి, సరఫరా వ్యవస్థలు, అగ్నిమాపక వ్యవస్థ తదితరాలున్నాయి. టేకాఫ్ సమయంలో ఎయిర్‌క్రాఫ్ట్‌కు అదనపు లిఫ్ట్ ఇచ్చే ఫ్లైట్ డెక్ స్కీ జంప్‌తో స్టోబార్ కాన్ఫిగరేషన్ ఏర్పాటు చేశారు. దాంతో అతి తక్కువ సమయంలో టేకాఫ్ వీలవుతుంది. ఏ భాగమైనా మొరాయించినా ఆ ప్రభావం మిగతా భాగాలపై పడదు. దాంతో ప్రయాణం నిరాటంకంగా సాగుతుంది.

నౌక మోసుకుపోగలిగే ఆయుధ సంపత్తి

- 34 యుద్ధ విమానాలు (మిగ్-29కే యుద్ధ విమానాలు, కమోవ్-31 విమానాలు, ఏఎల్‌హెచ్ హెలికాప్టర్లు, ఎంహెచ్-60ఆర్‌సీ హాక్ మల్టీరోల్ హెలికాప్టర్లు)
- దేశీయంగా రూపొందించిన తేలికపాటి హెలికాప్టర్లు

550 సంస్థలు, 100 ఎంఎస్ఎంఈల భాగస్వామ్యం

కేరళలోని కొచ్చి షిప్‌యార్డ్‌లో 2005లో విక్రాంత్ నిర్మాణాన్ని ప్రారంభించారు. నేవీ అంతర్గతసంస్థ అయిన వార్ షిప్ డిజైన్ బ్యూరో (డబ్ల్యూడీబీ) దీన్ని రూపొందించింది. 2009 నుంచి మొదలైన పూర్తిస్థాయి నిర్మాణం 13 ఏళ్లలో పూర్తయింది. బీఈఎల్, భెల్, స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా, జిందాల్, ఎస్ఆర్ గ్రూప్, మిథానీ, జీఆర్ఎస్ఈ, కెల్ట్రాన్, కిర్లోస్కర్, ఎల్ అండ్ టీ మొదలైన 550 దిగ్గజ పరిశ్రమలతో పాటు 100కు పైగా ఎంఎస్ఎంఈలు నిర్మాణంలో పాలుపంచుకున్నాయి. పరికరాలు, యంత్రాలన్నీ దాదాపుగా స్వదేశీ తయారీవే. 23 వేల టన్నుల ఉక్కు, 2,500 కి.మీ. ఎలక్ట్రిక్ కేబుల్స్, 150 కి.మీ. పైపులు, 2 వేల వాల్వులు, గ్యాలీ పరికరాలు, ఎయిర్ కండిషనింగ్, రిఫ్రిజిరేషన్ ప్లాంట్లు, స్టీరింగ్ గేర్స్ వంటివన్నీ స్వదేశీయంగా తయారు చేసినవే. కొన్ని భాగాలను మాత్రం రష్యా నుంచి దిగుమతి చేసుకున్నారు. రెండువేల మంది షిప్‌యార్డు అధికారులు, సిబ్బంది, 13 వేలమంది కార్మికులు, ఉద్యోగులు విక్రాంత్ నిర్మాణంలో భాగస్వాములు. నౌక నిర్మాణం జరిగిన 13 ఏళ్ల పాటు రోజూ 2 వేల మందికి ఉపాధి దొరికింది. పరోక్షంగా పలు తయారీ సంస్థల్లో 40 వేల మందికి ఉపాధి లభించింది. 42,8000 టన్నుల సామర్థ్యంతో రెండు టేకాఫ్ రన్‌వేలు, ఒక ల్యాండింగ్ స్ట్రిప్‌లతో క్షిపణి దాడిని తట్టుకునేలా నిర్మించారు. రూ.20 వేల కోట్లు ఖర్చయింది. గత ఏడాది ట్రయల్స్ విజయవంతంగా ముగిశాయి.

గంటలో వెయ్యిమందికి చపాతీ, ఇడ్లీ రెడీ

ఈ నౌకలో మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ తరహా వైద్య సదుపాయాలున్నాయి. ఫిజియోథెరపీ క్లినిక్, ఐసీయూ, ల్యాబొరేటరీ, సీటీ స్కానర్, ఎక్స్‌రే మెషీన్లు, డెంటల్ కాంప్లెక్స్, ఐసోలేషన్ వార్డులతో కూడిన అత్యాధునిక మెడికల్ కాంప్లెక్స్ ఉంది. 16 బెడ్లు, రెండు ఆపరేషన్ థియేటర్లున్నాయి. ఐదుగురు మెడికల్ ఆఫీసర్లు, 17 మంది మెడికల్ సెయిలర్స్ ఉంటారు. ఇక దీని కిచెన్ కూడా అత్యాధునికమే. గంటలో ఏకంగా 1,000 మందికి చపాతీలు, ఇడ్లీలు తయారుచేసే ఆధునిక పరికరాలున్నాయి.

విక్రాంత్ విశ్వరూపం...

పొడవు	262 మీటర్లు
వెడల్పు	62 మీటర్లు
ఎత్తు	59 మీటర్లు
బరువు	40 వేల టన్నులు
నిర్మాణ వ్యయం	రూ. 20 వేల కోట్లు
నిర్మాణశైలి	5 సూపర్‌స్ట్రక్చర్లు
అంతస్తులు	14
కంపార్ట్‌మెంట్లు	2,300
మహిళా క్యాబిన్లు	02
సిబ్బంది	1,750 మంది
రన్ వేలు	2, ఒక ల్యాండింగ్ స్ట్రిప్
ప్రయాణ వేగం	28 నాట్స్ (గంటకి 52 కి.మీ.)
సామర్థ్యం	30 విమానాలు, హెలికాప్టర్లు
టర్బైన్లు	4 ఎల్ఎం 2500 ప్లస్ గ్యాస్ టర్బైన్లు
టర్బైన్ల సామర్థ్యం	88 మెగావాట్లు
పార్కింగ్	6 హెలికాప్టర్లు, 12 జెట్స్
సెన్సార్లు	3 వేల ఫైర్ సెన్సార్లు, 700 ఫ్లడ్ సెన్సార్లు
ప్రత్యేకత	మిగ్-29 విమానాలు ఎగరగలిగే డెక్
ఫ్లైట్ డెక్	12,500 చ.మీ. (రెండున్నర హాకీ ఫీల్డ్‌లతో సమానం)
ఉపయోగించిన స్పెషల్ గ్రేడ్ ఉక్కు	21,500 టన్నులు
నిర్మాణంలో పాలుపంచుకున్నది	15 వేలమంది సిబ్బంది, ఉద్యోగులు

మరో యుద్ధనౌకను నిర్మించగలం

విక్రాంత్ తయారీలో ప్రతి రోజూ ఉత్కంఠగానే గడిచింది. కరోనాతో కాస్త ఆలస్యమైనా అద్భుతంగా నిర్మించాం. మరో యుద్ధనౌకను కూడా నిర్మించగల సామర్థ్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకున్నాం. విక్రాంత్ తయారీలో 76 శాతం స్వదేశీ పరిజ్ఞానమే. తర్వాతి క్యారియర్ నిర్మాణానికల్లా దీన్ని 85 శాతం వరకు పెంచుకోగలం.

– మధునాయర్, కొచ్చి షిప్‌యార్డు సీఎండీ

ఎందుకంత కీలకం?

రక్షణపరంగా, రవాణాపరంగా ఎంతో కీలకమైన హిందూ సముద్రంలో పైచేయి సాధించేందుకు ఐఎన్ఎస్ విక్రాంత్ మనకు బ్రహ్మాస్త్రంలా ఉపయోగపడనుంది. ఏ దేశానికైనా యుద్ధ విమానాలను మోసుకుపోగలిగే సామర్థ్యం కలిగిన నౌకలు ఉంటే నావికాశక్తి పటిష్టంగా ఉంటుంది. దీంతో సముద్ర జలాల్లోనూ, గగన తలంపై కూడా పట్టు సాధించగలం. చైనా దగ్గర రెండు విమాన వాహక నౌకలు, 355 యుద్ధ నౌకలు, 48 విధ్వంసక నౌకలు, 43 ఫ్రిజెట్లు, 61 కార్వెట్లున్నాయి. మూడో విమాన వాహక నౌక తయారీ కూడా మొదలైంది. మనకు మాత్రం ఇప్పటిదాకా విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రమాదిత్య మాత్రమే ఉంది. 10 విధ్వంసక నౌకలు, 12 ఫ్రిగేట్లు, 20 కార్వెట్లున్నాయి. ఐఎన్ఎస్ విక్రాంత్ రాకతో బంగాళాఖాతం, అరేబియా సముద్ర జలాలపై మన పట్టు మరింత బిగుస్తుంది. ఎలాంటి ముప్పునైనా ఎదుర్కొనే అత్యాధునిక వ్యవస్థ ఐఎన్ఎస్ విక్రాంత్ సొంతం.

– సాక్షి, విశాఖపట్నం

గోర్బచెవ్ అస్తమయం



యూఎస్ఎస్ఆర్ ఆఖరి అధ్యక్షుడు

- పుతిన్ నివాళులు.. మోదీ సంతాపం

లండన్/న్యూయార్క్: యూనియన్ ఆఫ్ సోవియెట్ సోషలిస్ట్ రిపబ్లిక్స్(యూఎస్ఎస్ఆర్) చిట్టచివరి అధ్యక్షుడు మిఖాయిల్ ఎస్ గోర్బచెవ్(91) బుధవారం మాస్కోలోని ఓ ఆస్పత్రిలో కన్నుమూశారు. చాలాకాలంగా ఆయన తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారని రష్యా మీడియా పేర్కొంది. 1985 నుంచి 1991లో సోవియెట్ యూనియన్ విచ్ఛిన్నమయ్యే వరకు గోర్బచెవ్ అధ్యక్షుడిగా కొనసాగారు. గోర్బచెవ్ మృతికి భారత ప్రధాని మోదీ సహా ప్రపంచదేశాల నేతలు సంతాపం ప్రకటించారు. 20వ శతాబ్దపు ప్రముఖ రాజనీతిజ్ఞుల్లో గోర్బచెవ్ ఒకరని కొనియాడారు. భారత్-రష్యా సంబంధాల బలోపేతానికి ఆయన ఎంతో కృషి చేశారని ట్వీట్ చేశారు. మాస్కోలోని ఆస్పత్రిలో ఉన్న గోర్బచెవ్ భౌతికకాయాన్ని పుతిన్ సందర్శించి, నివాళులర్పించారని అధ్యక్ష భవనం తెలిపింది. ఇతర కార్యక్రమాల కారణంగా అధ్యక్షుడు పుతిన్ శనివారం జరిగే గోర్బచెవ్ అంత్యక్రియల్లో పాల్గొనడం లేదని పేర్కొంది. గోర్బచెవ్ అంత్యక్రియల్లో గౌరవవందనం, తదితర ప్రభుత్వ లాంఛనాలు ఉంటాయని స్పష్టం చేసింది.

పెరిస్ట్రోయికా రూపకర్త: కమ్యూనిస్ట్ పార్టీ జనరల్ సెక్రటరీ హోదాలో 1985లో గోర్బచెవ్ యూఎస్ఎస్ఆర్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు. సోవియెట్ వ్యవస్థలో సంస్కరణలు అవసరమని భావించిన ఆయన పారదర్శకత(గ్లాస్‌నోస్త్), పునర్నిర్మాణం(పెరెస్ట్రోయికా) అనే విధానాలను ప్రకటించారు. వీటి ఫలితంగా ప్రభుత్వ వ్యవస్థలపై కమ్యూనిస్ట్ పార్టీ పెత్తనం ముగిసింది. మతం, సాహిత్యం, మీడియాపై నియంత్రణలు తొలిగాయి. రాజకీయ ఖైదీలకు విముక్తి లభించింది. దాదాపు దశాబ్దకాలం పాటు అఫ్గానిస్తాన్‌లో తిష్టవేసిన సోవియెట్ బలగాలను 1989లో గోర్బచెవ్ ఉపసంహరించుకున్నారు. ఆయుధ నియంత్రణ, నిరాయుధీకరణకు సంబంధించి అమెరికా తదితర దేశాలతో పలు ఒప్పందాలు కుదుర్చుకోవడం ద్వారా ప్రచ్ఛన్న యుద్ధానికి ముగింపు పలికారు. అణ్వాయుధాల నియంత్రణకు అమెరికాతో ఒప్పందం కుదుర్చుకున్నారు. వీటన్నిటి ద్వారా ప్రపంచశాంతికి బాటలు పరిచిన గోర్బచెవ్, అప్పటి అమెరికా అధ్యక్షుడు రొనాల్డ్ రీగన్‌తో కలిసి 1990లో నోబెల్ శాంతి పురస్కారం అందుకున్నారు. అయితే, ఆయన చేపట్టిన ఆర్థిక సంస్కరణలు సోవియెట్ యూనియన్‌లో వికటించాయి. పరిశ్రమలపై ప్రభుత్వ నియంత్రణను తొలగించి, ప్రైవేట్ సంస్థలకు అవకాశం కల్పించడం వంటి చర్యల ఫలితం ఆహారం, వినియోగవస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయి. అవినీతి హద్దులు దాటింది. అధికారమంతా ఓ వర్గం చేతుల్లోకి వెళ్లిపోయింది. సోవియెట్ రిపబ్లిక్కుల్లో స్వాతంత్ర్యం కోసం ఉద్యమాలు మొదలయ్యాయి. ఈ పరిణామాలతో ఆగ్రహం చెందిన కమ్యూనిస్ట్ అతివాదులు 1991 ఆగస్ట్‌లో గోర్బచెవ్‌పై తిరుగుబాటు చేశారు. మరో నాలుగు నెలల తర్వాత పదవి నుంచి దిగిపోవాల్సి వచ్చింది. అనంతర పరిణామాల్లో సోవియెట్ యూనియన్ 15 దేశాలుగా ముక్కలైంది.

లైంగిక వేధింపుల కేసులో మఠాధిపతి అరెస్ట్



చిత్రదుర్గ(కర్ణాటక): కర్ణాటకలో రాజకీయంగా కీలక సామాజిక వర్గమైన లింగాయత్‌లకు సంబంధించిన ఒక మఠాధిపతి శివమూర్తి మురుగ శరణారును పోలీసులు అరెస్ట్‌చేశారు. చిత్రదుర్గలో మఠం ఆధ్వర్యంలో ఒక హైస్కూల్ నడుపుతున్నారు. ఆ పాఠశాలలో చదువుతూ, అందులోని హాస్టల్‌లో ఉండే ఇద్దరు టీనేజీ బాలికలను 2019 జనవరి నుంచి మూడున్నరేళ్లపాటు శివమూర్తి లైంగికంగా వేధించారని పోక్సోసహా పలు సెక్షన్ల కింద మైసూరు సిటీ పోలీసులు శనివారం కేసులు నమోదుచేయడం తెల్సిందే. గురువారం సాయంత్రం నుంచీ ఆయనను ప్రశ్నించిన పోలీసులు ఆ తర్వాత అరెస్ట్ చేశారు. హాస్టల్ వార్డెన్ రష్మినీ అదుపులోకి తీసుకున్నారు. బాధితుల్లో ఒకరు దళిత బాలిక కావడంతో ఎస్సీ, ఎస్టీ వేధింపుల (నిరోధక) చట్టం కేసు నమోదైంది. చాన్నాళ్లుగా తనపై కొందరు కుట్ర పన్నుతున్నారని అరెస్ట్‌కు ముందు శివమూర్తి ఆరోపించారు. ఈ నేపథ్యంలో చిత్రదుర్గలో నిరసనలు పెల్లుబికాయి. దర్యాప్తును హైకోర్టు పర్యవేక్షించాలని లాయర్లు కోరారు.

అవినీతిపరుల కోసం ఒక్కటవుతున్నారు



ఆదిశంకరుల జన్మస్థానమైన కాలడిలో మోదీ పూజలు

- కొన్ని పార్టీల తీరు దారుణం: మోదీ
- ఇదో కొత్త రకం రాజకీయ ఏకీకరణ

కొచ్చి: అవినీతిపరులపై కొంతకాలంగా కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న కఠిన చర్యలు జాతీయ రాజకీయాల్లో కొత్త తరహా విభజనకు దారితీశాయని ప్రధాని నరేంద్ర మోదీ అభిప్రాయపడ్డారు. ''అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని కాపాడేందుకు పలు రాజకీయ సమూహాలు ఒక్కటవుతున్నాయి. ఇందుకోసం బహిరంగంగానే చేతులు కలుపుతున్నాయి. ఈ వైనాన్ని దేశమంతా గమనిస్తూనే ఉంది'' అంటూ కాంగ్రెస్ తదితర విపక్షాలపై పరోక్షంగా విమర్శలు ఎక్కుపెట్టారు. ఇలాంటి గ్రూపులతో దేశ ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ''దేశాభివృద్ధికి అవినీతే అతి పెద్ద అడ్డంకి. యువత ప్రయోజనాలకూ గొడ్డలిపెట్టు'' అన్నారు. రెండు రోజుల పర్యటన కోసం మోదీ గురువారం కేరళ చేరుకున్నారు. ఈ సందర్భంగా కొచ్చి విమానాశ్రయం వద్ద జరిగిన సభలో భారీ జన సమూహాన్ని ఉద్దేశించి మాట్లాడారు. ''దేశవ్యాప్తంగా బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అభివృద్ధి పరుగులు పెడుతోంది. డబుల్ ఇంజన్ ప్రభుత్వాల వల్లే ఇది సాధ్యమవుతోంది. కేరళలోనూ బీజేపీ ప్రభుత్వం ఏర్పాటైతే అభివృద్ధిలో రాష్ట్రం కొత్త శిఖరాలకు చేరుతుంది'' అన్నారు. ''దేశాభివృద్ధికి, సానుకూల మార్పుకు పాటుపడుతున్నది బీజేపీయేనని కేరళ ప్రజలు అర్థం చేసుకున్నారు. అందుకే తమ రాష్ట్రాభివృద్ధి విషయంలో కూడా బీజేపీ మీద వారు ఆశలు పెంచుకుంటున్నారు'' అని చెప్పుకొచ్చారు. దేశంలో ప్రతి పౌరునికీ మౌలిక సదుపాయాలు కల్పించడం, ఆధునిక మౌలిక వ్యవస్థ నిర్మాణమే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాథమ్యమని ప్రధాని చెప్పారు. ఈ సందర్భంగా కొచ్చి మెట్రో తొలి దశతో పాటు పలు రైల్వే ప్రాజెక్టులను మోదీ ప్రారంభించి జాతికి అంకితం చేశారు. మరికొన్నింటికి శంకుస్థాపన చేశారు.

కాలడి సందర్శన..

ఎర్నాకుళం జిల్లా కాలడిలో ఆది శంకరుల జన్మస్థలిని ప్రధాని మోదీ సందర్శించారు. పెరియార్ నది ఒడ్డున ఉన్న ఈ పవిత్ర ప్రాంత సందర్శన గొప్ప అనుభూతినిచ్చిందన్నారు. అద్వైత సిద్ధాంతకర్త అయిన ఆది శంకరులు భరత జాతికి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు.

బ్రిటన్‌లో ప్రచారానికి తెర



లండన్: బ్రిటన్ ప్రధాన మంత్రి, కన్జర్వేటివ్ పార్టీ అధినేతను ఎన్నుకునే కీలక ఎన్నిక ప్రక్రియ తుది అంకానికి చేరువైంది. మాజీ ఆర్థిక మంత్రి, భారతీయ మూలాలున్న రిషి సునాక్, విదేశాంగ మంత్రి లిజ్ ట్రస్‌లమధ్య పోరు చివరి దశకు దగ్గరైంది. సొంత కన్జర్వేటివ్ పార్టీ (టోరీ) సభ్యుల మద్దతు కోసం ఇద్దరూ చివరిసారిగా అభ్యర్థించి గురువారం ప్రచారాన్ని ముగించారు. లండన్‌లోని వింబ్లీలో చివరి ప్రచార ప్రసంగం సందర్భంగా సునాక్ తన భార్య, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. సునాక్ తండ్రి యశ్‌వీర్ వైద్యుడు. తల్లి ఉషా ఫార్మసిస్ట్. ''ప్రజాసేవలోకి అడుగుపెట్టేలా వాళ్లు నాకెంతగానో స్ఫూర్తినందించారు. పిల్లల కోసం ఎన్నో త్యాగాలు చేసిన అమ్మానాన్నలకు రుణపడి ఉంటా. సన్మార్గంలో నడిపించి, కష్టపడే తత్వం నేర్పించి, కుటుంబం కోసం శ్రమించే సామర్థ్యాలను అందించారు'' అన్నారు. అక్షిత ఓ అద్భుతమైన, ప్రేమమయ సతీమణి అంటూ భార్యను పొగడ్తల్లో ముంచెత్తారు. భార్య, తల్లిదండ్రుల నుంచి పూర్తి మద్దతు దక్కడం తన అదృష్టమని వ్యాఖ్యానించారు. ఈ ఘనమైన దేశంలో సాధించలేనిదంటూ ఏదీ లేదంటూ ముగించారు. బ్రిటన్‌లో జీవన వ్యయం విపరీతంగా పెరగడం, నేరాలు, పన్నులు పైకి ఎగబాకడం, వలస విధానంలో సంస్కరణలు, విదేశాంగ విధానం తదితరాలపై సునాక్, ట్రస్ తమ ప్రాధాన్యాలను పేర్కొంటూ ప్రచార పర్వాన్ని ముగించారు.

నేడు పోలింగ్, సోమవారం ఫలితాలు

కన్జర్వటివ్ పార్టీ సభ్యులు శుక్రవారం ఓటింగ్‌లో పాల్గొననున్నారు. సాయంత్రం ఐదింటిదాకా పోలింగ్ కొనసాగుతుంది. సోమవారం ఫలితాలను వెల్లడిస్తారు. పలు సర్వేల ప్రకారం సునాక్ కంటే ట్రస్ ఈ రేసులో ముందునట్లు తెలుస్తోంది. అనారోగ్య సమస్యల కారణంగా ఎలిజబెత్ రాణి ఈసారి లండన్‌లోని బకింగ్‌హామ్ ప్యాలెస్ నుంచి కాకుండా స్కాట్లాండ్‌లోని బాల్మోరల్ కోట నుంచి తదుపరి ప్రధానిని ప్రకటిస్తారు. రాణి ప్రస్తుతం ఈ కోటలోనే విశ్రాంతి తీసుకుంటున్నారు.

మనుషుల్ని కలిపేది మద్యమే

డీ అడిక్షన్ సెంటర్లో ఛత్తీస్‌గఢ్ విద్యా మంత్రి ప్రేమ్‌సింగ్ వ్యాఖ్యలు

బలరాంపూర్: 'మద్యం మనుషులను ఏకం చేస్తుంది. అయితే, నీళ్లు కలుపుకుని మితంగా మాత్రమే తాగాలి'అంటూ ఛత్తీస్‌గఢ్ విద్యాశాఖ మంత్రి ప్రేమ్‌సాయి సింగ్ టేకం చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. వద్రాఫ్‌నగర్‌లో బుధవారం పోలీసులు నిర్వహించిన డీ అడిక్షన్ కార్యక్రమానికి స్కూలు విద్యార్థులు హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ కవి హరివంశ్‌రాయ్ బచ్చన్ 'మధుశాల'లో రాసిన 'మందిరం, మసీదు కొట్లాటలు తెస్తే, మధువు ఐక్యం చేస్తుంది' అన్న కవితా పంక్తిని ఉదాహరించారు. అంతా స్వీయ నియంత్రణపైనే ఆధారపడి ఉంటుందన్నారు. మద్యానికి బానిసలు కారాదన్నారు. రోడ్ల పరిస్థితిపైనా వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ''వాటిని రిపేర్ చేయాలని జనం కోరుతుంటారు. కానీ రోడ్లు బాగుంటే వేగం పెరిగి ప్రమాదాలు జరుగుతాయి. అదే రోడ్లు బాగులేకుంటే జాగ్రత్తగా వెళతారు. ప్రమాదాలు కూడా తక్కువగా జరుగుతాయి'' అని సూత్రీకరించారు.


సర్వైకల్ క్యాన్సర్‌కు త్వరలో వ్యాక్సిన్

అదర్ పూనావాలా వెల్లడి

న్యూఢిల్లీ: గర్భాశయ ముఖద్వార (సర్వైకల్) క్యాన్సర్ నివారణకు తొలిసారిగా దేశీయంగా తయారు చేసిన క్వాడ్రివలెంట్ హ్యూమన్ పాపిలోమా వైరస్ (క్యూహెచ్‌పీవీ) వ్యాక్సిన్‌ను ఈ ఏడాది ఆఖర్లోగా విడుదల చేయనున్నట్టు సీరం ఇన్‌స్టిట్యూట్ సీఈఓ అదర్ పూనావాలా ప్రకటించారు. దీని ధర కూడా అందరికీ అందుబాటులో రూ.200–400 మధ్యలో ఉంటుందని చెప్పారు. కేంద్రంతో చర్చించాక తుది ధరను ఖరారు చేస్తామన్నారు. ''వ్యాక్సిన్‌ను తొలుత కేంద్ర ప్రభుత్వం ద్వారా అందుబాటులో ఉంచుతాం. వచ్చే ఏడాది నుంచి ప్రైవేట్‌లోనూ అందుబాటులోకి తెస్తాం. దేశీయ అవసరాలు తీరాకే ఎగుమతిపై ఆలోచిస్తాం'' అని గురువారం వెల్లడించారు.

మైనార్టీలపై చైనా మారణకాండ

- వీగర్ ముస్లింలపై క్రూరమైన నేరాలు
- యూఎన్ నివేదికలో వెల్లడి
- నివేదికలో అమెరికా హస్తం: చైనా



మిషెల్లీ బచెలెట్

జెనీవా: చైనా ప్రభుత్వం మైనార్టీలపై మారణహోమాన్ని సృష్టిస్తోందని గత కొంత కాలంగా అంతర్జాతీయ సమాజం వ్యక్తం చేస్తున్న ఆందోళనలకు ఐక్యరాజ్య సమితి (యూఎన్) స్వరం కలిపింది. ఉగ్రవాద నిర్మూలన పేరుతో పశ్చిమ జిన్ జియాంగ్ ప్రాంతంలో వీగర్లు, ఇతర ముస్లింలను నిర్బంధించి చైనా ప్రభుత్వం హింసకు పాల్పడుతున్న విషయం వాస్తవమేనని ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల సంఘం పేర్కొంది. నిర్బంధంలోకి తీసుకున్న మైనార్టీలపై కనీస మానవత్వం చూపించకుండా ఘోరమైన నేరాలకు పాల్పడే అవకాశాలను కొట్టిపారేయలేమని యూఎన్ తాజా నివేదిక స్పష్టం చేసింది. చాలా కాలం కిందటే ఈ నివేదిక బయటకు రావాల్సి ఉంది. కానీ చైనా ప్రభుత్వం ఒత్తిడితో ఇన్నాళ్లుగా యూఎన్ తన నివేదికను బయట పెట్టలేదు. యూఎన్ మానవ హక్కుల చీఫ్ మిషెల్లీ బచెలెట్ బుధవారం నాడు తన పదవీ కాలం ముగియడానికి కేవలం 13 నిముషాల ముందు ఈ నివేదిక బయట పెట్టడం అంతర్జాతీయంగా సంచలనం సృష్టించింది. పశ్చిమ జిన్ జియాంగ్ ప్రాంతంలోని వీగర్లు, ఇతర ముస్లిం మైనార్టీల ఐదేళ్లుగా డ్రాగన్ ప్రభుత్వం హింసాకాండకు పాల్పడుతున్నట్టుగా మానవ హక్కుల సంస్థలు, పశ్చిమ దేశాలు గగ్గోలు పెడుతూనే ఉన్నాయి. 10 లక్షల మంది వీగర్లను నిర్బంధించినట్టుగా వార్తలు వచ్చాయి. యూఎన్ నివేదికను అమెరికా, మరికొన్ని పశ్చిమ శక్తుల కుట్రగా చైనా అభివర్ణించింది.

విశ్వాస పరీక్షలో నెగ్గిన కేజ్రీవాల్ సర్కార్

న్యూఢిల్లీ: ''మిగతా రాష్ట్రాల్లో సఫలమైన బీజేపీ ఆపరేషన్ కమలం ఢిల్లీలో పూర్తిగా విఫలమైంది. ఒక్క ఆప్ ఎమ్మెల్యేను కూడా లాగలేకపోయింది'' అని ఆప్ చీఫ్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. గురువారం ఆప్ సర్కార్ విశ్వాస పరీక్షలో నెగ్గింది. ఈ సందర్భంగా అసెంబ్లీలో జరిగిన చర్చలో కేజ్రీవాల్ మాట్లాడారు. తమ ఎమ్మెల్యేలు పార్టీకి విశ్వాసపాత్రులని చాటి చెప్పేందుకే విశ్వాస పరీక్ష పెట్టామన్నారు.

గుజరాత్‌లో ఆప్ ఓటు శాతం పెరిగింది

గుజరాత్‌లో ఆప్‌కు ఆదరణ పెరుగుతోందని కేజ్రీవాల్ అన్నారు. ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియాపై సీబీఐ అక్రమ దాడుల తర్వాత అక్కడ ఆప్ ఓటు షేరు నాలుగు శాతం పెరిగిందన్నారు. ఆయనను అన్యాయంగా అరెస్ట్‌చేస్తే మరో రెండు శాతం ఓటు శాతం ఎగబాకుతుందన్నారు. ''సిసోడియా సొంతూర్లోనూ సోదాలు చేశారు. బ్యాంక్ లాకర్ తెరిపించారు. అయినా ఏమీ దొరకలేదు. ఈ దాడుల ద్వారా ఆప్‌కు, సిసోడియా నిజాయతీకి ప్రధాని మోదీనే స్వయంగా నిజాయతీ సర్టిఫికెట్ ఇచ్చేశారు'' అన్నారు. మరోవైపు ఢిల్లీలో మళ్లీ పాత మద్యం విధానం అమల్లోకి వచ్చింది. ఖాదీ, కుటీర పరిశ్రమల కమిషన్ చైర్మన్‌గా తాను పాల్పడిన అవినీతిపై సీబీఐ విచారణ చేయించాలన్న ఆప్ ఆరోపణలపై లెఫ్టినెంట్ గవర్నర్ మండిపడ్డారు.



గాండ్రించిన పులి

పదిహేను రోజులు క్రిందట రెండు ఆవులను పులి చంపేసిన సంఘటన మరువక ముందే అదే ప్రాంతంలో మరోమారు దాడి చేసి మరో రెండు ఆవులను గురువారం చంపేసింది. - 8లో

వృద్ధులు,సీనియర్ సిటిజన్‌లకు ఐడీ కార్డులు



వృద్ధులు, సీనియర్ సిటిజన్‌లు ఐడీ కార్డులు పొందవచ్చునని విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల శాఖ ఇన్‌చార్జ్ ఉపసంచాలకుడు ఎం. కిరణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. - 8లో



సంక్షేమానికి ప్రజల పట్టం

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న ప్రజాసంక్షేమానికి రాష్ట్రప్రజలంతా పట్టం కడుతున్నారనడానికి వైఎస్సార్ సీపీలో చేరుతున్న ప్రజానీకమే నిదర్శనమని ఎమ్మెల్యే శంబంగి అన్నారు. - 8లో

న్యూస్‌రీల్

సోషల్ మీడియా పాత్ర కీలకం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు



వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృత స్థాయిలో తీసుకువెళ్లడంలో సోషల్ మీడియా కీలక పాత్ర పోషించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు సూచించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్, కో కన్వీనర్‌లుగా నియామకమైన యువత మజ్జి శ్రీనివాసరావును జిల్లా పరిషత్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా గురువారం కలిశారు. ఈ సందర్భంగా జిల్లా సోషల్ మీడియా కన్వీనర్‌గా నియామకమైన యలకల వాసునాయుడును ఆయన సత్కరించారు. అనంతరం వారితో మాట్లాడుతూ ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకువచ్చేందుకు ప్రతిపక్షాలు కుట్ర రాజకీయాలకు పాల్పడుతున్నాయని, సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని చెప్పారు. ఇటువంటి కార్యకలాపాలను తిప్పికొట్టి, ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మేలును, వాస్తవాలను తెలియజెప్పాలని సూచించారు. కో- కన్వీనర్‌లు కెల్ల సురేష్, ఎం.రామోజీ, సిహెచ్.రాజేష్,వర్మ, బి.వెంకట కనకారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రెస్ క్లబ్ నిర్వహణకు అడ్‌హక్ కమిటీ

- తొలి సమావేశంలో సభ్యత్వ నమోదుకు నిర్ణయం

విజయనగరం అర్బన్: విజయనగరం పట్టణ పరిధిలోని ప్రెస్ క్లబ్ నిర్వహణకు సంబంధించి జర్నలిస్టులతో అడ్‌హక్ కమిటీని ఏర్పాటు చేసి, తొలి సమావేశాన్ని స్థానిక డీపీఆర్‌ఓ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి డి.రమేష్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో కమిటీ సభ్యులు పలు నిర్ణయాలను తీసుకున్నారు. ప్రెస్ క్లబ్ నిర్వహణ, సభ్యత్వ రుసుం, నిధుల సమీకరణ తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. సభ్యత్వ ప్రక్రియకు సంబంధించి ప్రాథమికంగా అక్రిడిటేషన్ కలిగి.. ప్రస్తుతం విజయనగరం హెడ్ క్వార్టర్‌లో పని చేస్తున్న జర్నలిస్టులకు అవకాశం కల్పించాలని నిర్ణయం తీసుకున్నారు. అక్రిడేషన్ లేనివారు దరఖాస్తు చేస్తే అడ్‌హక్ కమిటీ చర్చించి తదుపరి నిర్ణయం తీసుకోవాలని సభ్యులు పేర్కొన్నారు. సభ్యులుగా చేరిన వారు రూ.300 కనీస రుసుం చెల్లించాలని సభ్యులు నిర్ణయించారు. సమావేశంలో ఏపీఆర్‌ఓ డి.నారాయణరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రంచనగా పింఛన్



వైఎస్సార్ పింఛన్ల పంపిణీ జిల్లాలో గురువారం వేకువ జామున 4గంటలకే ప్రారంభమైంది. వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ సొమ్మును అందజేశారు. వినాయక చవితి మరుసటి రోజునే ఈ మొత్తం అందడంతో లబ్ధిదారులకు నిజమైన పండగ వచ్చింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

విజయనగరం జిల్లా కేంద్రంలోని స్టేడియం కాలనీ ప్రాంతంలో పైడితల్లికి పింఛన్ అందజేస్తున్న వలంటీరు కుసుమ

జై..జై.. గణేశా..



విజయనగరంలోని జొన్నగుడ్డి సమీపంలో ఎగ్జిబిషన్ గ్రౌండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన వేరుశనగ కాయల వినాయకుడు



రాజాం సిటీ: బొద్దాంలో కూల్ డ్రింక్ సీసాలతో ఏర్పాటు చేసిన వినాయకుడు



వెలుగురేఖలు

సర్వేంద్రియానాం నయనం ప్రధానం... అన్న సూక్తిని అనుసరిస్తూ రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అవ్వాతాతలు, విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపుతోంది. కంటి ప్రాధాన్యతను గుర్తించి విద్యార్థి దశలోనే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తూ పరీక్షలు నిర్వహిస్తూ కంటి పరిరక్షణకు తగు చర్యలు చేపట్టింది.

- వృద్ధుల్లో వైఎస్సార్ కంటి వెలుగులు
- ఫేజ్ - 1, 2లో 2,92,462 మంది విద్యార్థులకూ..
- 1,53,545 మంది అవ్వాతాతలకు కంటి పరీక్షలు
- 17,912 మందికి శస్త్రచికిత్సలు
- కంటి పరీక్షల నిర్వహణలో రాష్ట్రంలో జిల్లా ప్రథమం

విజయనగరం ఫోర్ట్:

మానవ శరీరంలో నేత్ర సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలి. ఎందుకంటే నేత్రాలకు ఉన్న ప్రాధాన్యత అంతటిది. ప్రస్తుతం వయసుతో సంబంధం లేకుండా కంటి సమస్యలు చిన్న, పెద్ద అన్న తేడా లేకుండా బాధిస్తున్నాయి. పిల్లల నుంచి పెద్దల వరకు అంతా పలు రకాల కంటి సమస్యలతో సతమతమవుతున్నారు. దీన్ని గుర్తించిన రాష్ట్రంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యార్థులు, వృద్ధుల్లో వెలుగులు నింపేందుకు వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టింది. ఇప్పటికే రెండు విడతలు పూర్తయ్యాయి. ప్రస్తుతం మూడో విడత కొనసాగుతుంది. కోవిడ్ కారణంగా ఏడాదిన్నర పాటు కంటి వెలుగు కార్యక్రమానికి విరామం వచ్చింది. మళ్లీ కంటి వెలుగు కార్యక్రమం చేపట్టింది. వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో విజయనగరం జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది.

2,92,462 మంది విద్యార్థులకు తొలివిడత పరీక్షలు

డా.వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా తొలి విడతలో 2019 అక్టోబర్ 10 నుంచి 16 వరకు జిల్లాలో 3357 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. 3,03,717 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేయాల్సి ఉండగా 2,92,462 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 13,109 మందికి కంటి సమస్యలు ఉన్నట్టు గుర్తించి తదుపరి ఎగ్జామినేషన్ కోసం రిఫర్ చేశారు. రెండో విడతలో వీరికి 2019 నవంబర్ ఒకటో తేదీ నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు రెండు నెలల పాటు కంటి పరీక్షలు నిర్వహించారు. 13,109 మందికిగాను 12,951 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 3844 మందికి కంటి అద్దాలు అందించారు. 338మందికి స్పెషలిస్టు వైద్యులతో పరీక్షలు చేయడానికి రిఫర్ చేశారు.



కంటి సమస్య ఉన్న వృద్ధురాలిని పరీక్షిస్తున్న వైద్యుడు

గొప్ప కార్యక్రమం



వైఎస్సార్ కంటి వెలుగు గొప్ప కార్యక్రమం. ఇప్పటికే ఫేజ్ - 1, 2లో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించాం. ప్రస్తుతం ఫేజ్ - 3 నడుస్తుంది. ఫేజ్ - 3లో అవ్వాతాతలకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నాం.

– డాక్టర్ బి.శివప్రసాద్, జిల్లా అంధత్వ నివారణ అధికారి

మూడో విడతలో అవ్వాతాతలకు కంటి పరీక్షలు

మూడో విడత కంటి వెలుగు కార్యక్రమం 2020 ఫిబ్రవరి 18 నుంచి ప్రారంభమైంది. ప్రస్తుతం ఇంకా కొనసాగుతునే ఉంది. 2,83,983 మందికి మూడో విడతలో పరీక్షలు నిర్వహించగా 1,53,545 మందికి ఇంతవరకు పరీక్షలు నిర్వహించారు. ఇందులో 54,562 మందికి కంటి అద్దాలు అవసరమని గుర్తించారు. ఇందులో 41,158 మందికి కంటి అద్దాలు అందించారు. 21,211 మందికి కంటి శస్త్రచికిత్సలు నిర్వహించారు.

కంటి శస్త్రచికిత్సలు చేసే ఆస్పత్రుల వివరాలు

- జిల్లా కేంద్రాస్పత్రి, పుష్పగిరి కంటి ఆస్పత్రి,
- విశాఖ శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి,
- పీఎల్ సాలూరు ఆస్పత్రి

చోడిలో కొత్త వంగడం

- అధిక దిగుబడి రకంగా గుర్తించిన రాష్ట్ర విత్తన సబ్ కమిటీ
- వీఆర్ 1099 రకాన్ని రూపొందించిన పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు



వీఆర్ 1099 చోడి పంట

విజయనగరం ఫోర్ట్: విజయనగరం వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు చోడి పంటలో కొత్త వంగడాన్ని రూపొందించారు. ఇప్పటికే వ్యవసాయ పరిశోధన స్థానం నుంచి ఆరు వంగడాలు రాగా... తాజాగా ఏడో వంగడాన్ని కూడా రూ పొందించారు. వీఆర్ 1099 నూతన చోడి రకాన్ని వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తలు రూపొందించారు. ఆగస్టు 30వ తేదీన 40వ రాష్ట్ర విత్తన సబ్ కమిటీ సభ్యులు ఈ వంగడం అధిక దిగుబడితో పాటు అగ్గి తెగులును తట్టు కుని పోషకాలు మెండుగా ఉన్న రకంగా గుర్తించారు.

పరిశోధన స్థానంలో రుపొందించిన వంగడాల వివరాలు	
సంవత్సరం	వంగడం
1998	చంపావతి
2006	భారతి
2009	శ్రీచైతన్య
2012	హిమ
2019	సువర్ణముఖి
2020	ఇంద్రావతి
2022	వీఆర్1099

అధిక దిగుబడి



వీఆర్ 1099 రకం అధిక దిగుబడిని ఇస్తుంది. ముఖ్యంగా అగ్గి తెగులును తట్టుకుంటుంది. ఇప్పటికే పలు వంగడాలను రూపొందించాం. భవిష్యత్తులో మరిన్ని నూతన వంగడాలను రైతులకు అందించడానికి కృషి చేస్తాం.

– వై.సంధ్యారాణి, శాస్త్రవేత్త, వ్యవసాయ పరిశోధన స్థానం

35 నుంచి 38 క్వింటాళ్ల దిగుబడి

వీఆర్ 1099 రకం హెక్టారుకు 35 నుంచి 38 క్వింటాళ్ల వరకు దిగుబడిని ఇస్తుంది. ఇందులో ఐరన్, జింక్ అధికంగా ఉంటుంది. కాండం వెన్ను మీద వచ్చే అగ్గి తెగులను తట్టుకుంటుంది. 110 నుంచి 115 రోజులు దీని పంట కాలం. ఈ రకం అన్ని కాలాలకు అనుకూలంగా ఉంటుంది. అగ్గి తెగులు, పాముపొడ తెగులు తట్టుకునే సామర్థ్యం కలదు. ఈ రకం 125 శాతం ఎరువులకు కూడా ప్రతిస్పందిస్తుంది. గింజ ఆకర్షణీయమైన ముదురు గోధుమ వర్ణాన్ని కలిగి ఉంటుంది. గిరిజన, మైదాన ప్రాంతాల్లో కూడా ఈ పంట సాగుకు అనుకూలం.

వైఎస్సార్ పింఛన్ల పంపిణీలో జిల్లా ఫస్ట్

- తొలి రోజున 88.68 శాతం పంపిణీ

విజయనగరం అర్బన్: వైఎస్సార్ పింఛన్ల పంపిణీలో జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. గురువారం తొలి రోజున 92.39 శాతం మందికి పెన్షన్ పంపిణీ చేసి రాష్ట్రంలోనే జిల్లా ఈ ర్యాంక్ సాధించింది. డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో డీఆర్‌డీఏ పీడీ కల్యాణచక్రవర్తి పర్యవేక్షణలో జిల్లా వ్యాప్తంగా పంపిణీ జరిగింది. ఉదయం నాలుగు గంటలకే పంపిణీ వ్యవస్థలోని సచివాలయ వలంటీర్లు తమ పరిధిలోని ప్రతి పెన్షనర్ల వద్దకు వెళ్లి పింఛన్ సొమ్మును నేరుగా చేతికి అందజేశారు. ప్రధానంగా వృద్ధులకు, అనారోగ్యంతో ఉన్నవారి పింఛన్‌ల పంపిణీ విషయంతో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. జిల్లాలోని 14 రకాల పెన్షన్‌లు 2,78,001 మందికి పంపిణీ చేయాల్సి ఉంది. ఒక్క రోజులోనే 92.39 శాతంతో 2 లక్షల 56 వేల 846 మందికి పంపిణీ చేసామని డీఆర్‌డీఏ పీడీ తెలిపారు. 96 శాతం దాటి పంపిణీ చేసిన మండలాల్లో ముందు వరసలో నెల్లిమర్ల అర్బన్, దత్తిరాజేరు, కొత్తవలస, బొండపల్లి ఉన్నాయి. 80 శాతం దాటి పంపిణీ చేసిన నాలుగు మండలాలు మినహా మిగిలిన అన్ని మండలాలలోనూ 90 శాతం దాటి పంపిణీ చేయడం ఈ నెల విశేషమని డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి తెలిపారు.

ఫేషియల్ యాప్‌లో హాజరు

- నేటి నుంచి పూర్తి స్థాయిలో..
- ప్రభుత్వ ఉపాధ్యాయుల హాజరుకు ఫోన్ యాప్ వినియోగం
- ఇప్పటికే యాప్‌లో రిజిస్ట్రేషన్
- విజయనగరం జిల్లాలో 82 శాతం మంది పేర్లు నమోదు
- పార్వతీపురం మన్యం జిల్లాలో 58.46 శాతమే

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

ఇంటిగ్రేటెడ్ అటెండెన్స్ మొబైల్ యాప్ ద్వారా ఫేషియల్ రికగ్నేషన్ విధానంలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులంతా శుక్రవారం నుంచి పూర్తి స్థాయిలో తమ అటెండెన్స్ వేసుకోనున్నారు. వాస్తవానికి ఈ నెల 1వ తేదీ నుంచే రాష్ట్రంలో ప్రైవేట్, అన్ ఎయిడెడ్ మినహా ప్రభుత్వ యాజమాన్యంలోని అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఈ యాప్ ద్వారానే హాజరు వేసుకోవాలని పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ శాఖ నియంత్రణలో ఉన్న అన్ని కార్యాలయాల్లోని బోధనేతర సిబ్బంది కూడా ఈ యాప్ లోనే హాజరు వేసుకోవాల్సి ఉంది. గురువారం ప్రభుత్వంతో ఉపాధ్యాయ సంఘాల చర్చలు సానుకూలంగా ముగిసిన నేపథ్యంలో శుక్రవారం నుంచి పూర్తి స్థాయిలో యాప్ ద్వారానే అటెండెన్స్ ఉంటుందని ఉపాధ్యాయ వర్గాలు చెబుతున్నాయి.

విద్యా వ్యవస్థను పటిష్టం చేయడంలో భాగంగా ప్రభుత్వం ఇప్పటికే పలు సంస్కరణలను ప్రారంభించింది. మన బడి నాడు – నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ బడుల రూపురేఖలు మార్చేసింది. కార్పొరేట్ స్కూళ్లను తలదన్నేలా తయారైన ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపిస్తున్నారు. ఈ నేపథ్యంలో బోధన, బోధనేతర సిబ్బంది కచ్చితంగా సమయానికి పాఠశాలలకు వచ్చేలా చేయడానికి చర్యలు మొదలయ్యాయి. ఇంటిగ్రేటెడ్ అటెండెన్స్ మొబైల్ యాప్ ద్వారా అటెండెన్స్ వేసే విధానాన్ని ప్రభుత్వం తీసుకొచ్చింది. ఇందుకోసం ఇప్పటికే ప్రయోగాత్మక పరిశీలనలు పూర్తయ్యాయి. యాప్‌లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కూడా మొదలైంది.

విజయనగరం జిల్లాలో 8,324 మంది ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది ఉన్నారు. వారిలో 6,823 మంది (81.97 శాతం) యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారు. యాప్‌లో తమ పేరు రిజిస్టర్ చేసుకున్నారు. గురువారం తొలిరోజు 1,177 మంది ఫేషియల్ యాప్ ద్వారానే తమ అటెండెన్స్ వేసుకున్నారు.

పార్వతీపురం మన్యం జిల్లాలో 4,901 మంది ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది ఉన్నారు. యాప్‌లో రిజిస్ట్రేషన్ విషయంలో అక్కడ కాస్త వెనుకబాటు కనిపిస్తోంది. ఏజెన్సీ ప్రాంతాల్లో ఫోన్ సిగ్నల్స్ వంటి సాంకేతిక సమస్యలు కూడా అందుకు కారణమయ్యాయి. ఈ నెల 1వ తేదీ నాటికి 2,865 మంది మాత్రమే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని తమ పేరు రిజిస్టర్ చేసుకున్నారు. వారిలో 411 మంది గురువారం ఆ యాప్ ద్వారానే తమ హాజరు నమోదు చేసుకున్నారు.



- ఈ చిత్రంలో కనిపిస్తున్న వారు విజయనగరం జిల్లా మెంటాడ మండలం తమ్మిరాజుపేట హైస్కూల్ ఉపాధ్యాయులు. గురువారం ఉదయం ఫేషియల్ యాప్ ద్వారా తమ హాజరును వేసుకున్నారు.



- ఈ చిత్రంలో కనిపిస్తున్న టీచర్ పేరు లిల్లీరాణి. పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేటలోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఫేషియల్ యాప్ ద్వారా అటెండెన్స్ వేసుకున్నారు.



- ఈ చిత్రంలో ఉపాధ్యాయుడి పేరు నగేష్. పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండలంలో చప్పబుచ్చమ్మపేట పాఠశాలలో తన హాజరును ఫేషియల్ యాప్ ద్వారా గురువారం ఉదయం నమోదు చేసుకున్నారు.

వినాయక నిమజ్జనంలో అపశ్రుతి

- ఇద్దరు చిన్నారుల మృతి



యలకల కౌశిక్(ఫైల్)



సంధ్య(ఫైల్)

చీపురుపల్లి: మండలంలోని కరకాం గ్రామంలో వినాయక నిమజ్జనంలో అపశ్రుతి చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళ్తే.. వినాయక చవితి పండుగ రోజున బుధవారం గ్రామంలో పలువురు తమ ఇళ్లల్లో పూజలు నిర్వహించారు. సాయంత్రం వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు గ్రామానికి సమీపంలో ఉన్న తోటపల్లి కాలువకు వెళ్లారు. తోటపల్లి కాలువలో ఎవరి విగ్రహాలను వారు నిమజ్జనం చేసే క్రమంలో గ్రామానికి చెందిన మీసాల సంధ్య, యలకల కౌశిక్ అనే చిన్నారులు ప్రమాదవశాత్తు తోటపల్లి కాలువలో పడి ప్రాణాలు విడిచారు. ఈ సంఘటనతో గ్రామంలో విషాదం నెలకొంది. మీసాల సంధ్య మెట్టపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతుండగా, యలకల కౌశిక్ కరకం ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. వీరి మృతితో తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఇదిలా ఉండగా ఈ విషయాన్ని గ్రామస్తులు బయటకు తెలియనివ్వలేదు. ఈ విషయంపై ఎస్‌ఐ సన్యాసినాయుడుతో మాట్లాడగా తమకు ఎలాంటి ఫిర్యాదు లేకపోవటంతో కేసు నమోదు చేయలేదని తెలిపారు.

డిప్యూటీ ఈఓల నియామకం

విజయనగరం ఫూల్‌బాగ్: విజయనగరం జిల్లాలోని విజయనగరం, బొబ్బిలి డివిజన్‌లకు సంబంధించి డిప్యూటీ ఈఓల నియామకాలకు సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విజయనగరం డీఈఓ కార్యాలయ ఏడీ కంది వాసుదేవరావుకు డిప్యూటీ ఈఓ(ఎఫ్ఏసీ)గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విజయనగరం డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్‌టీనాయుడుకు బొబ్బిలి డిప్యూటీ ఈఓ (ఎఫ్ఏసీ)గా నియామకమయ్యారు.

క్లుప్తంగా

లక్ష్మీనృసింహ స్వామికి తులసి దళార్చన



తులసి దళాలతో దర్శనమిస్తున్న లక్ష్మీనృసింహస్వామి

సీతానగరం: మండల కేంద్రంలోని ఉన్న వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో వెలసిన లక్ష్మీనృశింహస్వామికి భక్తులు గురువారం తులసి దళాల అర్చనతో దర్శనమిచ్చాడు. ఈ మేరకు ఆలయ అర్చకుడు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి తులసీ దళాలతో అర్చన చేసి జాజి, మారేడు పత్రితో అలంకరణ చేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ప్రతి గురువారం ప్రత్యేక అలంకరణతో భక్తులకు దర్శన మిచ్చేలా స్వామివారిని ముస్తాబు చేస్తున్నామన్నారు. ప్రతి గురువారం స్వామి వారిని వేలాది మంది భక్తులు దర్శించు కోవడం ఆనవాయితీగా వస్తోందని, భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు సమర్పిస్తామని వివరించారు.

వృద్ధులు,సీనియర్ సిటిజన్‌లకు ఐడీ కార్డులు



ఇన్‌చార్జ్ ఉపసంచాలకుడు ఎం.కిరణ్‌కుమార్

పార్వతీపురం: వృద్ధులు, సీనియర్ సిటిజన్‌లు ఐడీ కార్డులు పొందవచ్చునని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల శాఖ ఇన్‌చార్జ్ ఉపసంచాలకుడు ఎం.కిరణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వృద్ధులు,సీనియర్ సిటిజన్‌లు ఐడీ కార్డులు పొందేందుకు జాతీయ వృద్ధుల హెల్ప్‌లైన్ నంబర్ 14567ను సంప్రదించవచ్చని సూచాంచారు. ఎంపీడీఓ కార్యాలయం , గ్రామ, వార్డు సచివాలయాల్లో ఐడీ కార్డులు అందుబాటులో ఉన్నాయన్నారు. వయోవృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు వయోవృద్ధులశాఖ కార్యాలయానికి నేరుగా వచ్చినా ఐడీ కార్డును పొందవచ్చని సూచించారు.

కార్డువల్ల ఉపయోగాలు

- ఆర్టీసీ బస్సు ప్రయాణంలో రాయితీ
- బస్సు, ట్రైన్‌లో ప్రత్యేకంగా కేటాయించిన సీట్లు
- తిరుపతివంటి దేవస్థానాలలో త్వరితగతిన దైవదర్శనం
- ప్రభుత్వ ఆస్పత్రులలో ప్రత్యేక ఓపీ
- బ్యాంకులలో సేవలు
- కొన్ని అత్యవసర సమయాలలో కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడం కోసం

60ఏళ్ల దాటిన వారంతా సీనియర్ సిటిజన్‌కార్డును ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.

ఆటోడ్రైవర్‌పై కత్తితో దాడి



చికిత్స పొందుతున్న ఆటో డ్రైవర్ శ్రీనివాసరావు

వీరఘట్టం: మండలంలోని రేగులపాడు గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ ఐక శ్రీనివాసరావుపై అదే గ్రామానికి చెందిన కడగల భాస్కరరావు కత్తితో దాడి చేసి కడుపులో పొడవడంతో శ్రీనివాసరావు ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. మంగళవారం జరిగిన ఈ దాడిపై ఆటోడ్రైవర్ భార్య బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.హరికృష్ణ తెలిపారు. క్షతగాత్రుడు శ్రీకాకుళంలోని రిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడని ప్రాణాపాయం తప్పిందని ఎస్సై తెలిపారు.

● పండగ విషాదం

చెరువులో దిగి వ్యక్తి మృతి



రాజాం సిటీ: చెరువులో లభ్యమైన కృష్ణారావు మృతదేహం



బొండపల్లి: రాము మృతదేహం



ఎల్.కోట: బస్సును ఢీకొట్టి రోడ్డుపై పడి ఉన్న జ్ఞానేశ్వరరావు, సూరిబాబు



ఎల్.కోట: కారును ఢీకొట్టిన లారీ

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధి వస్త్రపురికాలనీకి చెందిన కూర్మాపు కృష్ణారావు (65) వినాయకచవితిని పురస్కరించుకుని పూలు కోసేందుకు గత నెల 30 సాయంత్రం కొండంపేట సీతయ్య చెరువుకు వెళ్లాడు. ఒడ్డున చెప్పులు విడిచి చెరువులోకి దిగాడు. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళన చెంది 31న ఉదయం కాలనీవాసులతో కలిసి కుటుంబసభ్యులు చెరువు వద్దకు వెళ్లి ఒడ్డున ఉన్న చెప్పులు, దుస్తులు చూసి ఆందోళన చెందారు. కొంతమంది కాలనీవాసులు చెరువులో దిగి వెతికినా ప్రయోజనం లేకపోయింది. దీంతో విషయాన్ని పోలీసులకు తెలియజేయడంతో అగ్నిమాపక సిబ్బందితో వచ్చి చెరువులో వెతుకులాట ప్రారంభించి బురదలో కూరుకుపోయిన మృతదేహాన్ని బయటకు తీయగా కృష్ణారావుదిగా కుటుంబసభ్యులు గుర్తించారు. మృతునికి భార్య అన్నపూర్ణతో పాటు కుమార్తె నీలిమ, కుమారుడు హరి ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వీబీ రామకృష్ణ తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

బొండపల్లి: మండలంలోని నెలివాడ జంక్షన్ సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం మధ్యాహ్నం మోటార్ సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని లారీ ఢీకొనడంతో సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్సై ఎస్.రవి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని గొట్లాం గ్రామానికి చెందిన కింతాడ రాము(41) గజపతినగరంలోని ఓ ప్రైవేట్ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తూ వినాయక పూజా కార్యక్రమానికి హాజరై తిరిగి స్వగ్రామం వెళ్తుండగా విజయనగరం నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, బాబు,పాప ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

కొత్తవలస–అరకు రోడ్డులో ప్రమాదాలు

లక్కవరపుకోట (కొత్తవలస): మండలంలోని వీరభద్రపురం(నరపాం) గ్రామానికి చెందిన ఎ.సూరిబాబు,ఎన్.జ్ఞానేశ్వరరావులు ద్విచక్రవాహనంపై విశాఖపట్నం నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న గాజువాక డిపో బస్సును విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో ఢీకొట్టారు. దీంతో ఇద్దరూ తుళ్లి రోడ్డుపై పడిపోగా జ్ఞానేశ్వరరావు తలకు తీవ్ర గాయం కావడంతో అధికంగా రక్తస్రావం జరిగింది. సూరిబాబు కాలు, చేతికి గాయాలయ్యాయి.స్థానికుల సమాచారంతో వచ్చిన 108 వాహనం క్షతగాత్రులను విశాఖ కేజీహెచ్‌కు తరలించింది. జ్ఞానేశ్వరరావు పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. అలాగే అదే రోడ్డులో ఫైర్‌స్టేషన్ సమీపంలో విశాఖపట్నం నుంచి ఎస్.కోట వెళ్తున్న కారును ఎస్.కోట నుంచి విశాఖ వెళ్తున్న లారీ ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో కారు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. అయితే అదృష్టవశాత్తు ఎవరికి ప్రమాదకరమైన గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. పై రెండు ప్రమాదాలపై కొత్తవలస పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షేమానికి ప్రజల పట్టం



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే శంబంగి తదితరులు

- వైఎస్సార్‌సీపీలో చేరిన 60 టీడీపీ కుటుంబాలు
- ఆహ్వానించిన ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

బొబ్బిలి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అమలు చేస్తున్న ప్రజాసంక్షేమానికి రాష్ట్రప్రజలంతా పట్టం కడుతున్నారనడానికి వైఎస్సార్ సీపీలో చేరుతున్న ప్రజానీకమే నిదర్శనమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. టీడీపీ బొబ్బిలి పట్టణ అధ్యక్షుడు రాంబార్కి శరత్ ప్రాతినిధ్యం వహిస్తున్న 8వ వార్డు నుంచి సుమారు 60 మంది కుటుంబాలతో సహా ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో గురువారం చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు వారందరికీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గత ప్రజా కంటక పాలన నుంచి ప్రజలను రక్షించేందుకు చేపట్టిన ప్రజాసంకల్ప యాత్రలో ప్రజల కష్టాలను గుర్తించి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు అందరూ ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల నాటికి టీడీపీలో చంద్రబాబు, లోకేష్ మాత్రమే ఉంటారని ఎద్దేవా చేశారు.

టీడీపీలో ఎందుకుండాలి?

వైఎస్సార్‌సీపీ హయాంలో పార్టీలకు అతీతంగా పనులన్నీ జరుగుతున్నప్పుడు టీడీపీలో ఎందుకుండాలని భావించి తాము స్వచ్ఛందంగా వైఎస్సార్ సీపీలో చేరుతున్నామని ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు తెలిపారు. 9వ వార్డు కౌన్సిలర్ బొత్స రమణమ్మ, సిరిపురపు రామ్మోహన రావు, మొగిది భాస్కర రావుల ఆధ్వర్యంలో బెవర ఈసు, బొద్దూరు శ్రీను, ఎవర్న రామకృష్ణ, గంట్రేటి వెంకట్, ఎస్.ధమయంతి, మీసాల మౌనిక, జి ఈశ్వర రావు, కె.శంకర రావు, సోమురోతు అచ్చెన్నాయుడు తదితర 60 మంది కుటుంబాలతో సహా వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్‌గా ముగిది మురళీకృష్ణను నియమించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాల నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 500.00
విజయనగరం	రూ. 504.00
శ్రీకాకుళం	రూ. 504.00

బులియన్

విశాఖపట్నం

బంగారం(24క్యా. 10గ్రా.)	50,730–00
బంగారం(22క్యా. 10గ్రా.)	46,500–00
వెండి (కిలో)	58,000–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹110	₹190	₹ 200

ఉన్నతాధికారులకు రైతుల అభిప్రాయాలు

- సుజల స్రవంతి కాలువ నిర్మాణానికి సహకరించాలి
- ప్రత్యేక భూ సేకరణ డిప్యూటీ కలెక్టర్ బి.సుదర్శనదొర



ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కళ్లేపల్లి రైతులు

లక్కవరపుకోట (కొత్తవలస): పోలవరం ప్రాజెక్టు నుంచి సాగునీరు మళ్లించేందుకు బాబు జగ్గజీవన్‌రావు ఉత్తరాంధ్ర సుజల స్రవంతి కాలువ నిర్మాణానికి భూములు కోల్పోతున్న రైతుల అభిప్రాయాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని ప్రత్యేక భూ సేకరణ డిప్యూటీ కలెక్టర్ బి.సుదర్శనదొర తెలిపారు. మండలంలోని కళ్లేపల్లి గ్రామంలో గురువారం గ్రామసభ నిర్వహించి కాలువ నిర్మాణంలో భూములో కోల్పోతున్న రైతుల అభిప్రాయాలను కోరారు. ముందుగా రైతు పోరాట కమిటీ అధ్యక్షుడు చల్లా జగన్, రైతులు జెక్కాన సింహాద్రప్పడు, వెంకటరమణ తదితరులు మాట్లాడుతూ మాకు జీవనాధారమైన కొద్దిపాటి భూములను కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం గ్రామంలో ఎకరా భూమి సుమారు రూ.70లక్షల నుంచి రూ.80లక్షలకు పైగా పలుకుతోందన్నారు. మాకూ అదేస్థాయిలో పరిహారం అందజేయాలని లేదంటే భూములను ఇచ్చేదిలేదని తెగేసిచెప్పారు. అలా కాని పక్షంలో ఏ ప్రాంతమైనా ఫరవాలేదని భూమికి భూమి ఇచ్చినా సమ్మతమేనని తెలిపారు. అనంతర ప్రత్యేక కలెక్టర్ సుదర్శనదొర మాట్లాడుతూ రైతులు కచ్చితంగా భూమి ఇవ్వవలసిందేనని స్పష్టం చేశారు. భూములు త్యాగం చేసిన రైతులకు పూర్తిస్థాయిలో న్యాయం చేస్తామన్నారు. గ్రామంలో సుమారు 204 ఎకరాల భూమి కాలువ నిర్మాణానికి అవసరమైనట్లు గుర్తించామని చెప్పారు. చివరగా రైతులు డిప్యూటీ కలెక్టర్‌కు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ టి.రామకృష్ణ, పోలవరం కాలువ డీఈ సీహెచ్.సుప్రజ, జేఈ సుహాసిని, ఆర్‌ఐ కిశోర్, గ్రామ సర్పంచ్ గోకేడ ముసలనాయుడు, తూర్పాటి అప్పలరాజు, గవర గణేష్ తదితరులు పాల్గొన్నారు.

తనయుడ్ని చంపిన తండ్రి



హతుడు రాజు

విజయనగరం క్రైమ్: స్థానిక పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో తండ్రీ కొడుకుల మధ్య జరిగిన సంఘర్షణలో కుమారుడ్ని తండ్రి చంపేశాడు. బుధవారం వేకువ జామున జరిగిన సంఘటనకు సంబంధించి వన్‌టౌన్ పోలీసులు గురువారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎన్‌సీఎస్ థియేటర్ వెనుక అపార్ట్‌మెంట్‌లో లండ పైడయ్య గార్డెనర్‌గా పనిచేస్తూ భార్య అప్పయమ్మతో కలిసి ఓ పాకలో జీవిస్తున్నాడు. వారి కొడుకు రాజు(25)కు పెళ్లయి ఇద్దరు పిల్లలున్నారు. రాజు భార్యను పట్టించుకోకుండా రోజూ మద్యం తాగి ఇంటికి వస్తూ భార్య, తల్లిపై చేయిచేసుకుంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత అదే తీరున తల్లిని కొట్టడంతో తల్లి వాచ్‌మన్ ఇంటికి పారిపోయింది. అనంతరం తండ్రీ కొడుకుల మధ్య ఘర్షణ పెరిగింది. ఘర్షణలో భాగంగా తండ్రి కర్రతో కొడుకు తలపై బలంగా కొట్టడంతో అక్కడికక్కడే పడిపోయాడు. అనంతరం తండ్రి కొడుకును అక్కడి నుంచి డెంకాడ మండలం పోతయ్యపాలెం తీసుకువెళ్లి పడేశాడు. విషయం తెలుసుకున్న పోలీసులు బుధవారం సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. నిందితుడ్ని అరెస్ట్ చేసి, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు తెలిపారు.

గాండ్రించిన పులి

- వెదురువాడ పంచాయతీలో మరో రెండు ఆవులు బలి
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన అటవీశాఖ అధికారులు
- భయం గుప్పిట్లో గిరిజన గ్రామాలు ప్రజలు



పులిదాడిలో మృతి చెందిన ఆవును పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు



ఎం.కె.పాలెంలో మృతి చెందిన దూడ

బొండపల్లి: పదిహేను రోజులు క్రిందట రెండు ఆవులను పులి చంపివేసిన సంఘటన మరువక ముందే అదే ప్రాంతంలో మరోమారు దాడి చేసి మరో రెండు ఆవులను గురువారం చంపేసింది. దీంతో గిరిజన గ్రామాల చెందిన రైతులు, ప్రజలు భయం గుప్పిట్లో ఉంటూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమని ఉంటున్నారు. మండలంలోని వెదురువాడ పంచాయతీ కొత్త పనసల పాడు గ్రామానికి చెందిన జన్ని పైడమ్మ ఆవుతో పాటు, అదే పంచాయతీలోని ఎం.కె.పాలెం గ్రామానికి చెందిన చంపి ఎరకన్నదొర ఆవు దూడను పులి చంపివేసింది. ఆవులను ఆరుబయట కట్టగా పులి దాడి చేసి ఒక ఆవును సమీపంలో మెట్టపైకి లాక్కుని వెళ్లగా, మరో ఆవు దూడను చంపివేసి వదిలేసింది. విషయం తెలుసుకుని సంఘటనా ప్రాంత్రాన్ని ఫారెస్టు రేంజర్ ఎస్.అప్పలరాజు, ఆంధ్ర సెక్షన్ ఆఫీసర్ కేవీఎన్.రాజు, బీట్ ఆఫీసర్ కె.రామారావు, కొత్తపాలెం బీట్ ఫారెస్టు గార్డు కేవీ వెంకట జగదీష్,తో పాటు ఎంపీడీఓ ఎ.వేదవతి, పంచాయతీ కార్యదర్శి మహేంద్ర వర్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎం.వెంకిరాజు గురువారం పరిశీలించారు. మృతి చెందిన ఆవు, దూడకు పశువైద్యాధికారి పంచనామా నిర్వహించారు. గ్రామాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అలాగే అత్యవసరమైతేనే బయటకు రావాలని సూచించారు. పులి జాడను కనిపెట్టేందుకు నిఘా కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని అటవీ శాఖ అధికారులు తెలిపారు. పులి అరుపులు వేకువ జామున వినపడ్డాయని ప్రాణ భయంతో బయటకు రాలేదని గిరిజనులు అటవీశాఖ అధికారులకు ఈ సందర్భంగా తెలిపారు.

పురుగు మందు తాగి విద్యార్థిని ఆత్మహత్య



మానస మృతదేహం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నారాయణరావు

పాచిపెంట: ఇంటర్ ఫెయిల్ కావడంతో మనస్తాపం చెందిన ఓ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన మండలంలోని తోటవలస గ్రామంలో తీవ్ర విషాదం నింపింది. తాజాగా వెలువడిన ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఫెయిల్ కావడాన్ని జీర్ణించుకోలేకపోయిన తోటవలస గ్రామానికి చెందిన అలమండ మానస ఆత్మహత్యకు పాల్పడింది. మానస సాలూరులో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతోంది. ఏప్రిల్‌లో జరిగిన పరీక్షల్లో ఫెయిల్ అయ్యింది. వెంటనే సప్లిమెంటరీ పరీక్షలు రాసింది. మరోసారి ఫెయిల్ కావడంతో మనస్తాపం చెంది పంట చేసుకోసం తీసుకువచ్చి తల్లిదండ్రులు ఇంట్లో దాచిన పురుగు మందు మంగళవారం తాగేసింది. విషయం తెలుసుకున్న తల్లి వెంటనే సాలూరు సీహెచ్‌సీకి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తీసుకు వెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందింది. విద్యార్థిని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై వెంకటరమణ పేర్కొన్నారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మండలం చినబొండపల్లి గ్రామానికి చెందిన గుడుపూరి నారాయణరావు ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. మంగళవారం రాత్రి జరిగిన ఈ సంఘటనపై జిల్లా ఆస్పత్రి ఔట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నారాయణ రావు, భార్య తిరుపతమ్మలు గుంటూరు జిల్లా సరిమవడి గ్రామంలో ఉంటూ గెస్ట్‌హౌస్ వాచ్‌మెన్‌గా 7 సంవత్సరాల నుంచి పనిచేస్తున్నారు. వారం రోజుల క్రితం భార్యాభర్తలు గొడవపడి స్వగ్రామం వచ్చి విడాకుల కోసం ఊరిలో పెద్దల వద్ద పంచాయితీ పెట్టారు. పంచాయతీ పెద్దలు వారం రోజులు ఆలోచించి మీ నిర్ణయం చెప్పండని తెలిపారు. దీంతో భార్య పుట్టింటికి వెళ్లిపోవడంతో నారాయణ రావు మనస్తాపం చెంది ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన తల్లి కేకలు వేయడంతో ఇరుగుపొరుగు వారు వచ్చి కాపాడి 108 వాహనం ద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఔట్‌పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు

జియ్యమ్మవలస మండలంలో మరో వ్యక్తి..

జియ్యమ్మవలస మండలం చినకుదమ గ్రామానికి చెందిన పల్లశ్రీను బుధవారం రాత్రి ఆత్మహత్యా యత్నం చేశాడు. ఈ సంఘటనపై జిల్లా ఆస్పత్రి ఔట్‌పోస్టుపోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తాగుడుకు బానిసైన శ్రీనును మానివేయమని భార్య అశ్వని ఎంత చెప్పినా వినిపించుకోకపోవడంతో తన ఇద్దరు పిల్లలనుతీసుకుని మరుపెంట గ్రామానికి కన్నవారింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెందిన గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వాంతులు చేసుకోవడాన్ని గమనించిన శ్రీను తల్లి స్థానికుల సహాయంతో 108 వాహనం ద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఔట్‌పోస్టు పోలీసులు కేసునమోదుచేసి దర్యాప్తు చేపడుతున్నారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీను

క్లుప్తంగా

సీతం విద్యార్థుల ఇండస్ట్రియల్ టూర్

విజయనగరం అర్బన్: సీతం ఇంజినీరింగ్ కళాశాల మేనేజ్‌మెంట్ స్టడీస్ విద్యార్థులు సత్యసాయి జిల్లా పెనుకొండలో గల కియా మోటార్స్‌ను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా కార్ల సాంకేతిక విధులకు సంబంధించిన అంశాలపై అవగాహన ఏర్పరచుకున్నారని ప్రిన్సిపాల్ డీవీ రామ్మూర్తి తెలిపారు. టూర్‌లో విద్యార్థుల బృందంతో పాటు డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడీ డాక్టర్ ఎస్.వరూధిని, తదితరులున్నారు.

ఉద్యోగాలు ఇప్పించాలని వినతి

భోగాపురం: టీడీపీ ప్రభుత్వ హయంలో తొలగించిన తమను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సాక్షరభారత్ వీసీఓలు కోరారు. ఈ మేరకు డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయుసీ నాయకులు బుగత అశోక్, సాక్షరభారత్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

లెండిలో డ్యాన్స్ ఐకాన్ టీమ్ సందడి

డెంకాడ: జొన్నాడ వద్ద ఉన్న లెండి ఇంజినీరింగ్ కళాశాలలో డ్యాన్స్ ఐకాన్ ప్రోగ్రాం ప్రమోషన్ కార్యక్రమంలో భాగంగా బృందం సందడి చేసింది. ఈనెల 11న ఆహాలో ఈ ప్రోగ్రాం ప్రారంభంకానుంది. ఈ నేపథ్యంలో బృంద సభ్యులు యాంకర్ ఓంకార్, డ్యాన్స్‌మాస్టర్ యశ్వంత్, మోనాల్ లెండి ఇంజినీరింగ్ కళాశాలకు గురువారం విచ్చేసి విద్యార్థులతో ఆ విషయాలను పంచుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ రామారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ టి.హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదిభట్ల జయంతి

విజయనగరం టౌన్: హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు 158వ జయంతి ఉత్సవాలు పట్టణంలోని కానుకుర్తివారి వీధిలో దాసు స్వగృహంలో ఆదిభట్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆదిభట్లముని మనుమరాలు కామేశ్వరమ్మ దాసు విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా హరికథా భాగవతారిణి మండా వరలక్ష్మిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆనంద నారాయణదాసు, మంజూష, రాజ్యలక్ష్మి, ధవళ సర్వేశ్వరరావు, గోటేటి హిమబిందు, సూర్యకాంతి, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శంగా అంగన్‌వాడీ కేంద్రాలు

భోగాపురం రూరల్: గ్రామీణ ప్రాంతాల్లోని చిన్నారులకు పౌష్టిక ఆహారం అందించడంతో పాటు చక్కని విద్యాబోధన చేయడంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాలు ఎంతో ఆదర్శంగా ఉన్నాయని ఎన్‌ఈఈడీ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టరు పి. వేణుగోపాలరావు అభిప్రాయపడ్డారు. మండలంలోని సవరవిల్లి సెక్టార్ పరిధిలో ఉన్న రామదాసుపేట మినీ అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతో పాటు చదువు కూడా చెబుతున్నారన్నారు. గర్భిణులు, బాలింతలకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందిస్తున్నారని చెప్పారు. అనంతరం కేంద్రానికి వంట సామగ్రి, చిన్నారులకు పలకలు, పుస్తకాలు ఉచితంగా అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ యు. విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు పి. తాతయ్యలు, ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ జి. శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ బి.నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వీణా కచేరి

విజయనగరం టౌన్: గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా స్థానిక మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలో గురువారం సాయంత్రం నిర్వహించిన వీణాకచేరీ ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకుంది. కళాశాల ప్రిన్సిపాల్ ఆర్‌వీ ప్రసన్నకుమారి ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులు ఆర్ఎస్.విద్యామాధురి, కేవీ.సుమేధ, పి.సాధనాల లలిత కచేరి నిర్వహించారు. మృదంగంపై వి.గణేష్ సహకరించారు. అనంతరం శ్రీకాకుళానికి చెందిన యామినీకృష్ణ గాత్రకచేరీతో అలరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అందుబాటులో సిబ్బంది

నెల్లిమర్ల రూరల్: సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని ఎంపీడీఓ గిరిబాల కోరారు. మండలంలోని అలుగోలు గ్రామ సచివాలయాన్ని గురువారం ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజలకు సుపరిపాలన అందించాలనే మంచి లక్ష్యంతో ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు.
సిబ్బంది అంకితభావంతో పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం ఉన్నత పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన అమలు తీరును పరిశీలించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సారిక వైకుంఠంనాయుడు, కార్యదర్శి రామ్‌జీ పాల్గొన్నారు.

ఏడో తేదీలోగా ఈకేవైసీ చేయించుకోవాలి

విజయనగరం ఫోర్ట్: ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి నుంచి కొంతమంది రైతులకు ఆర్థిక సాయం అందలేదని, ఇటువంటి వారంతా ఈకేవైసీ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి వి. తారకరామారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కామన్ సర్వీస్ సెంటర్, సచివాలయం, మీ సేవ కేంద్రాల్లో ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు.

గణనాథుడికి జేజేలు..

పట్టణాలు, గ్రామాల్లో కొలువైన పార్వతీపుత్రుడికి భక్తులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. కరోనా నేపథ్యంలో రెండేళ్ల పాటు ఉత్సవాలకు దాదాపు దూరమైన భక్తజనులు ఈ ఏడాది భారీగా మంటపాలు ఏర్పాటు చేశారు. బుధవారం ఉదయం విగ్రహాలను మేళ,తాళాల నడుమ ఊరేగించి అనంతరం మంటపాల్లో ప్రతిష్ఠించారు. నగరంతో పాటు గ్రామాల్లోని ముఖ్య కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన విగ్రహాలు ఆకట్టుకుంటున్నాయి. ఇదిలా ఉంటే ఇళ్లలో పండగ జరుపుకున్న వారు గురువారం సాయంత్రమే విగ్రహాలను నిమజ్జనం చేశారు.

– విజయనగరం/నెల్లిమర్ల నెట్‌వర్క్


నెల్లిమర్ల: నిమజ్జనానికి విగ్రహాలను తీసుకెళ్తున్న మహిళలు


విజయనగరం టౌన్: తోటపాలెంలో కొలువైన వినాయకుడు


విజయనగరం టౌన్: పవన్ రెసిడెన్సీలో ఏర్పాటు చేసిన గణనాథుడు


నెల్లిమర్ల: తలపై విగ్రహాలతో చిన్నారులు


నెల్లిమర్ల: రథం ఆకృతిలో నిర్మించిన మంటపం


నెల్లిమర్ల: కొలువైన వినాయకుడు


డెంకాడ: గొడిపాలెం యాతపేటలో ఇంటిని తలపించేవిధంగా వినాయక మంటపం

సంక్షేమానికి మీరే సాక్షి ..

● ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స

డెంకాడ: రాష్ట్రంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు.. వాటిని అందుకుంటున్న లక్షలాది మంది లబ్ధిదారులైన మీరే సాక్షి అని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. మండలంలోని సింగవరంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల వల్ల ఒక్కో కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరినదీ వివరించారు. ముందుగా గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించిన ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు చిన్నారులతో మాట్లాడారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నదీ, లేనిదీ ఆరా తీశారు. అనంతరం గ్రామంలో ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ సురేష్‌బాబు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కులమతాలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గ్రామాల్లో సచివాలయాలను ఏర్పాటు చేసి ప్రభుత్వ సేవలను ప్రజలకు ముంగిటకు తెచ్చారని కొనియాడారు. సంక్షేమ పాలన అందిస్తున్న జగనన్నను మరోసారి దీవించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వెంకట సత్య వాసుదేవరావు, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, డెంకాడ సొసైటీ అధ్యక్షుడు రొంగలి కనకసింహాచలం, సర్పంచ్ పిట్ట పద్మావతి, మాజీ సర్పంచ్‌లు లెంక అప్పలనాయుడు, బమ్మిడి వెంకటరమణ, పిట్ట అప్పారావు, ఎంపీడీఓ డీడీ స్వరూపారాణి, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారుకు ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ సురేష్‌బాబు, తదితరులు

ఘన స్వాగతం..

విజయనగరం: నగరంలోని ఏడో డివిజన్ కాపువీధిలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి, తదితరులకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, తదితరులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై వివరించారు. ఎటువంటి అవినీతి లేకుండా పథకాలు అందుతున్నాయని మహిళలు చెప్పడంతో ఎమ్మెల్యే సంతృప్తి వ్యక్తం చేశారు. మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటామని చెప్పారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ, ప్రతి మహిళనూ లక్షాధికారిని చేయాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమన్నారు. అందుకు తగ్గట్టుగానే సంక్షేమ పథకాలు అందించడంతో పాటు ప్రజల కష్టసుఖాలను తెలుసుకుంటున్నారన్నారు. కార్పొరేటర్ పొంతపల్లి మాలతి మాట్లాడుతూ, తమ డివిజన్‌లో ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ప్రతి ఒక్కరి యోగక్షేమాలను తెలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. తమ డివిజన్ పరిధిలో తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చిన వెంటనే వాటర్ ట్యాంక్ మంజూరు చేయడం గొప్ప విషయమని కొనియాడారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేవతీదేవి, సహాయ కమిషనర్ ప్రసాదరావు, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండలి డైరెక్టర్ బంగారు నాయుడు, జోనల్ ఇన్‌చార్జులు బాడసింగి ఈశ్వరరావు, రెడ్డి గురుమూర్తి, బొద్దాన అప్పారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు చిట్టి రాజు, పొంతపల్లి గోపి, తదితరులు పాల్గొన్నారు.


విజయనగరం: ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి

అనుమతి ఉన్న ప్రదేశాల్లోనే నిమజ్జనం

పూసపాటిరేగ: మండలంలోని చింతపల్లి బీచ్‌లో అనుమతి ఉన్న ప్రదేశాల్లో మాత్రమే వినాయక విగ్రహాలు నిమజ్జనం చేయాలని ఎస్సై ఎ.నరేష్ అన్నారు. మండలంలోని చింతపల్లిలో బీచ్‌ను గురువారం ఆయన సందర్శించారు. బీచ్‌లో ఎక్కడెక్కడ విగ్రహాలు నిమజ్జనం చేయాలో స్థానికులకు వివరించారు. ఆయనతో పాటు మెరైన్ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

బాధ్యతల స్వీకరణ



పూసపాటిరేగ: మండల విద్యాశాఖాధికారిగా టి.లలితకుమారి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె విజయనగరం సాంస్కృతిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయినిగా పనిచేస్తూ ఇన్‌చార్జ్ ఎంఈఓగా విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు అభినందించారు.

కాకినాడ నుంచి అయోధ్యకు పాదయాత్ర

భోగాపురం రూరల్: మండలంలోని జాతీయ రహదారిమీదుగా శ్రీరాముని పాదుకలతో కాకినాడ నుంచి కాశీ మీదుగా అయోధ్యకు పాదయాత్ర చేస్తున్న భక్తబృందం గురువారం పోలిపల్లి వద్ద కనిపించింది. ఈ సందర్భంగా గురుస్వామి సుబ్బారావు మాట్లాడుతూ, 23 మంది బృందంతో ఆగస్టు 23న కాకినాడలో పాదయాత్రగా బయలుదేరామన్నారు. సుమారు 1800 కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్తామని, ముందుగా కాశీ దర్శించుకుని, అనంతరం అయోధ్యను చేరుకుంటామని చెప్పారు. మూడు నెలల పాటు యాత్ర కొనసాగుతుందన్నారు. పోలిపల్లి సర్పంచ్ కర్రోతు వెంకటరమణ భక్తబృందానికి మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పించారు.


అయోధ్యకు పాదయాత్ర ద్వారా వెళ్తున్న భక్త బృందం

అకౌంటెంట్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం ఫోర్ట్: జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ అధీనంలో నడుస్తున్న బాలసదనంలో కాంట్రాక్ట్ పద్ధతిపై పనిచేయడానికి స్టోర్ కీపర్ కమ్ అకౌంటెంట్ పోస్టుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారిణి బి. శాంతకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చిన దరఖాస్తులను షార్ట్‌లిస్ట్ చేసిన తర్వాత ఇంటర్వ్యూకు పిలుస్తారని పేర్కొన్నారు. అభ్యర్థుల వయసు 01-07.2022 నాటికి 30 నుంచి 45 సంవత్సరాల లోపు ఉండాలన్నారు. దరఖాస్తులను కలెక్టరేట్‌లో ఉన్న ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలని చెప్పారు. ఇతర వివరాలకు డబ్ల్యూసీడీఎస్‌సీ.ఏపీ. ఎన్ఐసీ.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

ఆకలి తీర్చడంలో ఫుడ్‌బ్యాంక్‌ల సేవలు గొప్పవి


అన్న ప్రసాదం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, గౌరీ సేవా సంఘం ప్రతినిధులు

● ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: పేదల ఆకలి తీర్చేందుకు ఫుడ్‌బ్యాంక్‌లు అందిస్తున్న సేవలు ఎంతో గొప్పవని ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ఎన్‌సీఎస్ థియేటర్ ఎదురుగా ఉన్న ఫుడ్‌బ్యాంక్ వద్ద గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో 300 రోజులు ఉచితంగా అన్న వితరణ చేసిన సందర్భంగా గురువారం ప్రత్యేక అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. మొత్తం 13 రకాల ఆహార పదార్థాలతో పేదలకు అన్నసంతర్పణ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నగరంలో నాలుగు చోట్ల ఫుడ్‌బ్యాంక్‌లను ఏర్పాటు చేశామన్నారు. ప్రజల భాగస్వామ్యంతో ఫుడ్ బ్యాంకులు నడవాలన్న ఆలోచనకు తగ్గట్టుగా వివిధ స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి ఆహారం అందిస్తున్నాయన్నారు. గవర సామాజికవర్గానికి చెందిన గౌరీ సేవా సంఘ ప్రతినిధులు నిరాటంకంగా 300 రోజుల పాటు అన్నదానం చేయడం విశేషమని చెప్పారు. గౌరీ సేవా సంఘ ప్రతినిధి మద్దాల భాస్కరరావు మాట్లాడుతూ, పేదల ఆకలి బాధలను తీర్చే అద్భుతమైన అవకాశం తమ సంఘానికి దక్కడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఏ రాజు, ఆదారి నగేష్, ఎంకేబీ శ్రీను, కనిశెట్టి సుధాకర్, ముల్లేటి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సామాన్యులకు అందుబాటులో ఆర్టీసీ

● హైర్ బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యేలు కోలగట్ల, బొత్స


జెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు కోలగట్ల వీరభద్రస్వామి, బొత్స అప్పలనర్సయ్య

విజయనగరం టౌన్: సామాన్యులకు అందుబాటులో ఉండే విధంగా ఆర్టీసీ మూడు హైర్ బస్సులను ప్రవేశపెట్టడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. విజయనగరం నుంచి శ్రీకాకుళం మధ్య ప్రయాణించే విధంగా మూడు కొత్త హైర్ బస్సులను ఆయన గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ గదల బంగారమ్మలతో కలిసి గురువారం స్థానిక డిపో ఆవరణలో ప్రారంభించారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ, ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉండేలా కొత్త బస్సులను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య మాట్లాడుతూ, రాష్ట్రంలో వెయ్యి బస్సులకు టెండర్లు పిలిచారని చెప్పారు. సుమారు వంద కోట్ల రూపాయలతో రహదారుల అభివృద్ధికి పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, జైహింద్ కుమార్, ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.రవికుమార్, ప్రజారవాణాధికారి కె.శ్రీనివాసరావు, సీహెచ్ అప్పలనారాయణ, డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు, సుధాకర్, సుధాబిందు, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

చవితి వేడుకల్లో జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే


ధర్మపురిలోని తన నివాసంలో గణపతిపూజలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కుటుంబ సభ్యులు


కుటుంబ సభ్యులతో తన నివాసంలో వినాయక పూజ చేస్తున్న ఎమ్మెల్యే కోలగట్ల

విజయనగరం: విఘ్నాలను తొలగించి విజయాలను అందించే విఘ్నేశ్వరుడు ప్రతి ఒక్కరి జీవితంలో వెలుగులు, ఆనందాలు నింపాలని విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి ఆకాంక్షించారు. వినాయకచవితి సందర్భంగా వారి నివాసాల్లో కుటుంబ సభ్యులతో కలసి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా పూజా కార్యక్రమాల్లో జెడ్పీ చైర్మన్ సతీమణి మజ్జి పుష్పాంజలి, కుమార్తె సిరిసహస్ర, కుమారుడు మోక్షిత్, ఎమ్మెల్యే కోలగట్ల సతీమణి వెంకటరమణి, మనుమరాళ్లు శ్రీనిక, యశ్వికలున్నారు.

మరిన్ని పతకాలు సాధించాలి

● ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు


వెయిట్‌లిఫ్టర్ గురునాయుడును సన్మానిస్తున్న ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు

నెల్లిమర్ల రూరల్: వెయిట్ లిఫ్టింగ్ క్రీడలో మరిన్ని పతకాలు సాధించి దేశానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఎమెల్సీ డాక్టర్ పెనుమత్స సూర్యనారాయణరాజు (సురేష్ బాబు) ఆకాంక్షించారు. ఇటీవల మెక్సికో దేశంలో జరిగిన అంతర్జాతీయ యూత్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ తరఫున ప్రాతినిథ్యం వహించిన గురునాయుడు రెండు బంగారు పతకాలను సాధించిన సంగతి తెలిసిందే.. ఈ నేపథ్యంలో క్రీడాకారుడిని ఎమ్మెల్సీ పెనుమత్స గురువారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గురునాయుడి క్రీడాస్ఫూర్తిని ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రతిభగల క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం తప్పనిసరిగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కోచ్ చల్లా రాము, సర్పంచ్ అట్టాడ కృష్ణ, నాయకుడు యడ్ల గోవింద పాల్గొన్నారు.

బంగారు గొలుసు దోచుకున్న దుండగులు

విజయనగరం క్రైమ్: వృద్ధురాలి మెడలోని గొలుసు లాక్కొని ఇద్దరు వ్యక్తులు బైక్‌పై పరారైన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి వన్‌టౌన్ పోలీసులు గురువారం అందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక ప్రదీప్‌నగర్‌లో బుధవారం వేకువజామున 4.30 గంటల ప్రాంతంలో ఇంటి బయట పువ్వులు తెంపుతున్న షర్మిల అనే 65 ఏళ్ల వృద్ధురాలి మెడలో ఉన్న తులంన్నర బంగారు గొలుసును ఇద్దరు యువకులు తెంచుకుని పారిపోయారు. దీంతో ఆమె వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. సీఐ బి. వెంకటరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దరఖాస్తులు ఆహ్వానం..

భోగాపురం: భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ సుగుణావతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భోగాపురం మండలం జగ్గయ్యపేట, పూసపాటిరేగ మండలం పేరాపురం -1, పూసపాటిరేగ -2, కాలపురెడ్డి పేట కేంద్రాల్లో ఖాళీలున్నాయని పేర్కొన్నారు.ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 7వ తేదీ లోపు భోగాపురం ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

క్లుప్తంగా

ఎస్‌ఎఫ్‌సీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం

హైకోర్టుకు నివేదించిన అడ్వొకేట్ జనరల్



సాక్షి, అమరావతి: స్టేట్ ఫైనాన్స్ కమిషన్‌ను (ఎస్‌ఎఫ్‌సీ)ను ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ప్రభుత్వం గురువారం హైకోర్టుకు నివేదించింది. ఇందుకు సంబంధించిన ప్రక్రియ కొనసాగుతోందని ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ హైకోర్టుకు వివరించారు. దీనిపై పూర్తి వివరాలను కోర్టు ముందుంచుతానన్నారు. దీనికి హైకోర్టు అంగీకరిస్తూ తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు ధర్మాసనం ఉత్తర్వులిచ్చింది. నాల్గవ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ పదవీ కాలం 2020లో ముగిసిందని, ఇప్పటి వరకు కమిషన్ ఏర్పాటుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని, కమిషన్ ఏర్పాటునకు తగిన చర్యలు తీసుకునేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలంటూ టీడీపీకి చెందిన వెంకటరెడ్డి ఇటీవల హైకోర్టులో పిల్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే.

'పోర్టు' నిర్మాణంపై సింగిల్ జడ్జి తీర్పును రద్దు చేయండి

ధర్మాసనం ముందు నవయుగ పోర్ట్ అప్పీల్

సాక్షి, అమరావతి: మచిలీపట్నం పోర్టు నిర్మాణం విషయంలో తమతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాన్ని రద్దు చేస్తూ జారీ చేసిన ఉత్తర్వులను సమర్థిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ నవయుగ పోర్ట్ లిమిటెడ్ అప్పీల్ దాఖలు చేసింది. ఈ అప్పీల్‌పై గురువారం రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ ప్రస్తావించారు. ఈ అప్పీల్‌పై శుక్రవారం విచారణ జరపాలని కోరారు. ఇందుకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజుల ధర్మాసనం స్పందిస్తూ, శుక్రవారం సాధ్యం కాదని స్పష్టం చేసింది. సోమవారం విచారణ జరుపుతామని తెలిపింది. ఇందుకు నవయుగ తరఫు న్యాయవాదులు సైతం అంగీకరించడంతో ధర్మాసనం అప్పీల్‌పై విచారణను ఈ నెల 5కి వాయిదా వేసింది.

మార్గనిర్దేశకుడు వైఎస్సార్..



దేశంలోని అనేక రాష్ట్రాల్లో వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌ను సరఫరా చేయడానికి కారణం వైఎస్ రాజశేఖరరెడ్డి ఆలోచనే. దానిని 2004, మే 14న సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన రోజునే ఆయన ప్రారంభించారు.

పేదల ఆరోగ్యానికి భరోసా కల్పించేందుకు కేంద్రం అమలుచేస్తున్న ఆయుష్మాన్ భారత్.. వివిధ రాష్ట్రాలు అమలుచేస్తున్న ఆరోగ్యశ్రీ పథకాలు వైఎస్సార్ ఘనతే. దీనికి 2007, డిసెంబర్ 5న ఆయన శ్రీకారం చుట్టారు.

దేశంలో అనేక రాష్ట్రాలు ఉన్నత విద్యను పేదలకు అందుబాటులో తీసుకొచ్చేందుకు అమలుచేస్తున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి తొలుత శ్రీకారం చుట్టింది వైఎస్సే. పాలకులకు వైఎస్ రాజశేఖరరెడ్డి టార్చ్‌బేరర్‌గా నిలిచారనడానికి ఈ మూడు పథకాలు సజీవ సాక్ష్యాలు. ఆ మహానేత భౌతికంగా దూరమై నేటికి సరిగ్గా 13 ఏళ్లు.

సాక్షి, అమరావతి : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు సీఎంగా వైఎస్ రాజశేఖరరెడ్డి పనిచేసింది కేవలం ఐదేళ్ల మూడు నెలలే. కానీ, ఆ కొద్దికాలంలోనే తెలుగునేల ఆయన్ను కలకాలం గుర్తుంచుకునేలా సుపరిపాలన అందించారు. పాలనకు మానవత్వాన్ని జోడించి పాలకుడంటే ఇలా ఉండాలి అని దేశానికి చాటిచెప్పారు. సంక్షేమాభివృద్ధి పథకాలు, సుపరిపాలనతో ప్రజల హృదయాల్లో చెరగని ముద్రవేశారు. వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగులో 1949, జూలై 8న జన్మించిన వైఎస్.. వైద్య విద్యను అభ్యసించారు. పులివెందులలో ఆస్పత్రిని ఏర్పాటుచేసి.. రూపాయికే వైద్యంచేసి రూపాయి డాక్టర్‌గా ప్రజల ప్రశంసలు అందుకున్నారు.

ప్రజాభ్యుదయమే పరమావధిగా..

డాక్టర్‌గా ప్రజల నాడి తెలిసిన వైఎస్ రాజశేఖరరెడ్డి పులివెందుల నియోజకవర్గం నుంచి 1978లో రాజకీయ అరంగేట్రం చేశారు. అప్పటినుంచి తుది శ్వాస విడిచే వరకూ అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా ప్రజాభ్యుదయమే పరమావధిగా రాజీలేని పోరాటం చేశారు. దాంతో పులివెందుల నుంచి 1978, 1983, 1985.. కడప లోక్‌సభ స్థానం నుంచి 1989, 1991, 1996, 1998.. ఆ తర్వాత పులివెందుల నుంచి 1999, 2004, 2009 ఎన్నికల్లో విజయం సాధించారు. ప్రజలు ఆయన్ను అజేయుడిగా నిలిపారు.

పాలకులకు మార్గనిర్దేశకుడిగా..

వరుస ఓటములతో ఉమ్మడి ఏపీలో జీవచ్ఛవంలా మారిన కాంగ్రెస్‌ను వైఎస్ మండుటెండలో 1,475 కి.మీల పొడవున పాదయాత్ర చేసి ఒంటిచేత్తో అధికారంలోకి తెచ్చారు. పాదయాత్రలో ప్రజల కష్టాలను అర్థంచేసుకుని, నేనున్నానని భరోసా ఇచ్చిన ఆయన 2004, మే 14న సీఎంగా తొలిసారి ప్రమాణస్వీకారం చేశారు. ఇక ఆ తర్వాత ఆయన ప్రజలను ఓటర్లుగా కాకుండా కుటుంబ సభ్యులుగా భావించారు. విద్య, వైద్యం కోసం ప్రజలు అప్పులపాలవుతుండటాన్ని పసిగట్టి.. వాటిని ఉచితంగా అందించేందుకు ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ పథకాలను ప్రవేశపెట్టారు. అలాగే, ప్రమాదాల నుంచి ప్రజలను రక్షించడానికి 108 సర్వీసును ప్రారంభించి లక్షలాది మందికి ప్రాణంపోశారు. ఇక అత్యంత ప్రజాదరణ పొందిన ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, 108 సర్వీసులను అనేక రాష్ట్రాలు అమలుచేస్తుండటం ఆయన దార్శనికతకు నిదర్శనం. ఇక ఐదేళ్లలో సంక్షేమాభివృద్ధి పథకాలతో జనరంజక పాలన అందించిన వైఎస్.. గెలుపోటములకు తనదే బాధ్యత అని 2009 ఎన్నికల్లో ప్రకటించారు. ప్రతిపక్షాలు మహాకూటమి కట్టినా 2009 ఎన్నికల్లో ఇటు రాష్ట్రంలోనూ.. అటు కేంద్రంలోనూ ఒంటిచేత్తో కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చి, 2009, మే 20న రెండోసారి సీఎంగా ప్రమాణ స్వీకారంచేశారు.

రూ.లక్ష కోట్లతో జలయజ్ఞం..

కడలి పాలవుతున్న నదీ జలాలను ప్రాజెక్టుల ద్వారా మళ్లించి, తెలుగు నేలను సుభిక్షం చేయడానికి జలయజ్ఞం చేపట్టారు. రూ.లక్ష కోట్ల వ్యయంతో కోటి ఎకరాలకు నీళ్లందించేలా ఒకేసారి 84 ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. తెలుగు ప్రజల దశాబ్దాల స్వప్నమైన పోలవరాన్ని పట్టాలెక్కించారు. 2009 నాటికే 16 ప్రాజెక్టులను పూర్తిగా.. 25 ప్రాజెక్టులను పాక్షికంగా వెరసి 41 ప్రాజెక్టుల ద్వారా 19.53 లక్షల ఎకరాలకు నీళ్లందించడంతోపాటు 3.96 లక్షల ఎకరాలను స్థిరీకరించారు. ఐదేళ్లలో 23.49 లక్షల ఎకరాలకు నీళ్లందించే ప్రాజెక్టులను పూర్తిచేయడం ద్వారా దేశ సాగునీటి రంగంలో రికార్డును నెలకొల్పారు.

దార్శనికతకు తార్కాణాలెన్నో..

ప్రపంచవ్యాప్తంగా 2007–08, 2008–09లో ఆర్థిక మాంద్యం అనేక దేశాలను అతలాకుతలం చేసింది. ఆ ప్రభావం భారత్‌పై కూడా పడింది. కానీ.. అది రాష్ట్రంపై పడకుండా వైఎస్ చేయగలిగారు. సాగునీటి ప్రాజెక్టులు, పేదల ఇళ్ల నిర్మాణం, రహదారుల పనులు వంటి అభివృద్ధి పనులు చేపట్టి.. మార్కెట్లోకి ధనప్రవాహం కొనసాగేలా చేసి.. వాటి ద్వారా రాష్ట్రానికి పన్నులు వచ్చేలా చేసి.. మాంద్యం ముప్పు నుంచి రాష్ట్రాన్ని వైఎస్ కాపాడారని అప్పట్లో ఆర్థిక నిపుణులు ప్రశంసించారు. ఇక ఐటీకి వెన్నుదన్నుగా నిలిచి ఎగుమతులను రెట్టింపయ్యేలా చేశారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని శరవేగంగా పూర్తిచేసి హైదరాబాద్‌ను ప్రపంచపటంలో నిలిపారు.

పండగలా వ్యవసాయం..

వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన వైఎస్‌కు రైతుల కష్టనష్టాలు బాగా తెలుసు. అందుకే పంట పండినా.. ఎండినా రైతు నష్టపోకుండా.. వ్యవసాయాన్ని పండగలా మార్చేలా పలు కీలక నిర్ణయాలు అమలుచేశారు.

- పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు.. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ సరఫరా చేసే ఫైలుపై తొలి సంతకం చేశారు.
- పంటలులేక విద్యుత్ చార్జీలు కట్టలేని రైతులపై టీడీపీ సర్కార్ రాక్షసంగా బనాయించిన కేసులను ఒక్క సంతకంతో ఎత్తేశారు.
- రూ.1,100 కోట్ల వ్యవసాయ విద్యుత్ బకాయిలను మాఫీ చేశారు. దాదాపు 35 లక్షల పంపు సెట్లకుపైగా ఉచిత విద్యుత్‌ను అందించారు. రూ.400 కోట్లతో మొదలైన వ్యవసాయ విద్యుత్ సబ్సిడీ.. ఆ తర్వాత ఏడాదికి రూ.6 వేల కోట్లకు చేరినా వెనక్కు తగ్గలేదు.
- వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఇస్తే విద్యుత్ తీగలపై బట్టలు ఆరేసుకోవాల్సిందేనని ఎగతాళి చేసిన నేతలు కూడా అధికారంలోకి వచ్చాక.. ఆ పథకాన్ని కొనసాగించాల్సిన పరిస్థితిని వైఎస్ కల్పించారు. వైఎస్ స్ఫూర్తితో దేశంలో పలు రాష్ట్రాలు సాగుకు ఉచిత విద్యుత్‌ను సరఫరా చేస్తున్నాయి.
- ఇక పావలా వడ్డీకే రైతులకు రుణాలందించి.. పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సిన దుస్థితిని తప్పించారు.
- నాణ్యమైన విత్తనాలు, ఎరువులను అందించారు. పంట పండినా.. ఎండినా రైతు నష్టపోకూడదనే లక్ష్యంతో పంటల బీమాను అమలు చేశారు. ఇన్‌పుట్ సబ్సిడీని అందించారు.
- పండిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడం కోసం ఢిల్లీతో పోరాడారు. 2004 నుంచి 2009 మధ్య ధాన్యం కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.550 నుంచి రూ.1,000 వరకూ పెరగడమే అందుకు నిదర్శనం.

రాజకీయానికి రాజసం నేర్పిన మహానేత వైఎస్సార్

- రాజన్న పాలన జగనన్న రూపంలో కొనసాగుతోంది
- ఆస్ట్రేలియాలో నిర్వహించిన వైఎస్సార్ వర్ధంతిలో మంత్రి రోజా



సాక్షి, అమరావతి: రాజకీయానికి రాజసం నేర్పిన మహానేత, రాజనీతికి విశ్వసనీయత అద్దిన ప్రజానేత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసులు, క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా చెప్పారు. వైఎస్సార్ ప్రజల మనిషని పేర్కొన్నారు. ఆమె గురువారం ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్ నగరంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులతో కలిసి వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్ చిత్రపటానికి పూజలు చేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ ఒక లెజెండ్ అన్నారు. 2004కు ముందువరకు పేదప్రజల కష్టాలు విన్న భగవంతుడు వాటిని తీర్చడానికి తనకు మారుగా వైఎస్సార్‌ను పంపారని చెప్పారు. ఆయన రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో అందిస్తూ సువర్ణపాలనకు నాంది పలికారన్నారు. రాముడి పాలనలా రాజన్న పరిపాలన ఒక సువర్ణయుగంలా మారిందని చెప్పారు. 2009 సెప్టెంబర్ 2న పేదప్రజల కోసం వెళుతూ ప్రమాదంలో అనంతవాయువుల్లో కలిసిపోయారని గద్గదస్వరంతో గుర్తుచేసుకున్నారు. ఆయన లేరన్న వార్తతో పేదల కలలసౌధం కూలిపోయిందని చెప్పారు. ఎన్నో గుండెలు ఆగిపోయాయన్నారు. ఆయన పేదల గుండెల్లో శాశ్వతంగా బతికే ఉన్నారని తెలిపారు. రాజన్న మరణంతో దిక్కులేనిస్థితిలో ఉన్న జనానికి నేనున్నానంటూ రాజన్న రక్తమైన మన ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందరికి అండగా నిలిచి నేడు రాజన్న పాలనను మళ్లీ తెచ్చారని చెప్పారు. తండ్రి ఆశయాల కోసం పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఏ సర్వే జరిగినా బెస్ట్ సీఎంగా వైఎస్ జగన్ నిలుస్తున్నారన్నారు. 2024 ఎన్నికల్లో 175 సీట్లలో వైఎస్సార్‌సీపీని గెలిపించి వైఎస్ జగన్‌ని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుని రాజన్న పరిపాలనను కొనసాగించుకోవడమే వైఎస్సార్‌కు మనం ఇచ్చే ఘనమైన నివాళి అని ఆమె పేర్కొన్నారు. జోహార్ వైఎస్సార్, జై జగన్, వైఎస్సార్ ఆశయాలను నెరవేరుస్తాం, సీఎం వైఎస్ జగనన్నకి అండగా ఉంటాం.. అంటూ మంత్రి రోజా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌ను ఉద్దేశించి పాడిన పాట అందరి కంట తడిపెట్టించింది. కళాకారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఆస్ట్రేలియా కన్వీనర్ చింతలచెరువు సూర్యనారాయణరెడ్డి, పార్టీ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో విజిలెన్స్ తనిఖీలు

సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, వైద్య శాఖ అధికారులు సంయుక్తంగా గురువారం 42 పీహెచ్‌సీ, సీహెచ్‌సీలు, ఇతర ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్టు ఆ విభాగం డీజీ శంఖబ్రతబాగ్చీ ఓ ప్రకటనలో తెలిపారు. ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న మందులు, వైద్య పరీక్షల వివరాల పట్టికలు కూడా అందుబాటులో లేవని తేలిందన్నారు. విజయనగరం జిల్లా కొత్తవలస పీహెచ్‌సీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయలేదు, తిరుపతి జిల్లా నారావారిపల్లెలో వెంటిలేటర్స్, ఇంక్యుబేటర్స్ నిరుపయోగంగా ఉన్నాయన్నారు. తిరుపతి జిల్లా బంగారుపాలెం సీహెచ్‌సీలో 108, వైఎస్సార్ తల్లీ బిడ్డా ఎక్స్‌ప్రెస్‌లు నిర్వహణలో లోపాలు, ప్రకాశం జిల్లా పొదిలిలో ల్యాబ్ ఎక్విప్‌మెంట్ పనిచేయకపోవడం అధికారుల దృష్టికి వచ్చిందన్నారు. వైద్యులు, సిబ్బంది విధుల్లో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'హైరిస్క్ గ్రూప్‌తో కలిసి పనిచేస్తే మంచి ఫలితాలు'

సాక్షి, అమరావతి: ఎయిడ్స్ నియంత్రణలో భాగంగా హైరిస్క్ వర్గాల వారిని గుర్తించడం కష్టమే అయినప్పటికీ.. వారిని గుర్తించి వారితో కలిసి వ్యాధి నియంత్రణకు పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయని వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి, ఏపీ శాక్స్ పీడీ నవీన్‌కుమార్ అన్నారు. హైరిస్క్ గ్రూప్ వ్యక్తులకు అందించే సేవలపై 14 రాష్ట్రాల రీజినల్ సమీక్ష, భవిష్యత్ ప్రణాళిక రూపకల్పన సమావేశాన్ని తిరుపతిలో మూడు రోజుల పాటు న్యాకో నిర్వహిస్తోంది. గురువారం సమావేశం ప్రారంభోత్సవ కార్యక్రమంలో నవీన్‌కుమార్ మాట్లాడారు. వ్యాధి వ్యాప్తి కట్టడికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, బాధితులకు అందిస్తోన్న వైద్య సేవలు, ఇతర తోడ్పాటును వివరించారు. కమ్యూనిటీ సంఘాలను మరింత బలోపేతం చేసి వ్యూహాత్మక ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. సెక్స్ వర్కర్‌లు, స్వలింగ సంపర్కులు, ట్రాన్స్‌జెండర్‌లు, ఇతరులకు మెరుగైన సేవలందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

'అక్టోబర్ 2 నాటికి భూ హక్కు పత్రాలు'

శ్రీకాకుళం పాతబస్టాండ్: అక్టోబర్ 2 నాటికి భూ హక్కు పత్రాలు పంపిణీ చేసేందుకు సిద్ధం చేయాలని సీసీఎల్ఏ కమిషనర్ సాయి ప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. జగనన్న శాశ్వత భూ హక్కుకు సంబంధించిన భూ రీ సర్వే, మ్యుటేషన్లపై జిల్లా కలెక్టర్లతో గురువారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వేకు సంబంధించి పనులు వేగవంతం చేయాలన్నారు. కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ మాట్లాడుతూ జిల్లాకు 350 గ్రామాల్లో రీ సర్వే లక్ష్యం కాగా ఇంత వరకు 236 గ్రామాల్లో 80,617 ఎకరాల్లో రీ సర్వే పూర్తయ్యిందన్నారు. కలెక్టర్‌తో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.విజయ సునీత, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, సర్వే శాఖ ఏడీ ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ కంపెనీల్లో ఉద్యోగాలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: వివిధ కార్పొరేట్ కంపెనీల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 4వ తేదీన ఇచ్ఛాపురంలోని మున్సిపల్ గర్ల్స్ ఉన్నత పాఠశాలలో ఈ ఎంపికలు ఉదయం 9 గంటల నుంచి 4 గంటల వరకు ఉంటాయని తెలిపారు. పదోతరగతి, ఇంటర్, ఐటీఐ, బీఎస్సీ, బి ఫార్మా, ఎంఎస్సీ చదివిన అభ్యర్థులు, దివ్యాంగులు, స్త్రీలు కూడా హాజరు కావాలని సూచించారు. ఐదు కంపెనీలల్లో వివిధ రకాల ఉద్యోగాలకు ఎంపికలు జరుగుతాయని తెలిపారు. అర్హత గలవారు ఆ రోజున ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు.

'భవన నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: భవన నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కోన శశిధర్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలు, డిజిటల్ లైబ్రరీలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్, జగనన్న స్వచ్ఛ సంకల్పం, తదితర అంశాలపై ఆయన గురువారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రైతు ప్రాధాన్యత భవన నిర్మాణాలపై దృష్టి సారించాలన్నారు. కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ మాట్లాడుతూ భవనాలకు సంబంధించి కొన్ని కోర్టు కేసులు ఉన్నందు వల్ల ఆలస్యం జరుగుతోందన్నారు. వాటిని వేరే స్థలంలో నిర్మించాలని కమిషనర్ చెప్పగా.. ఇప్పటికే కొంత మేర నిర్మాణాలు చేపట్టినట్లు కలెక్టర్ వివరించారు. జిల్లా నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌తో పాటు జిల్లా పరిషత్ సీఈఓ వెంకటరామన్, డీపీఓ రవి కుమార్, పీఆర్ ఎస్ఈ సత్యనారాయణ మూర్తి, డ్వామా పీడీ చిట్టిరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

దివ్యమైన అవకాశం

- దివ్యాంగులకు ఎన్‌హెచ్ఎఫ్‌డీసీ రుణాలు మంజూరు
- జిల్లాకు 100 యూనిట్లు కేటాయింపు
- 40 శాతం వికలాంగత్వం ఉంటే అర్హులే
- దరఖాస్తులకు గడువు ఈ నెల 12

శ్రీకాకుళం పాతబస్టాండ్:

దివ్యాంగులకు జీవనోపాధి కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరంతరం కృషి చేస్తున్నాయి. వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు, సేవలు, వ్యాపారాలు చేసుకునేందుకు రుణ సదుపాయం కల్పిస్తున్నాయి. అందులో భాగంగా జాతీయ దివ్యాంగుల ఆర్థిక అభివృద్ధి సంస్థ (ఎన్‌హెచ్ఎఫ్‌డీసీ) రుణ సదుపాయం కల్పిస్తోంది. ఈ పథకం ద్వారా రుణం పొందిన వారు చిన్న చిన్న వ్యాపారాలు చేసుకోవచ్చు. ఈ పథకం కింద ఒక యూనిట్ అంటే ఒక దివ్యాంగునికి రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు రుణం అందుతుంది. రాష్ట్రంలో ఒక్కో జిల్లాకు దాదాపు వంద యూనిట్లు మంజూరు చేసే అవకాశం ఉంది.

ఇప్పటికే ఈ పథకం లబ్ధిదారులకు తొలి విడతగా జిల్లాకు రూ.కోటి మంజూరు చేశారు. ఈ పథకం ద్వారా జిల్లాలో వంద మంది దివ్యాంగులు ప్రయోజనం పొందే అవకాశం ఉంది. అయితే ఇప్పటి వరకు జిల్లాలో 20 మంది మాత్రమే ఈ పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. దీంతో దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 12 వరకు గడువు పెంచారు. ఈ దరఖాస్తులను విభిన్న ప్రతిభావంతులు వయోవృద్ధుల సంక్షేమ శాఖ, ఏడీ కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుంది.



ఎంపికకు స్క్రీనింగ్ కమిటీ..

దరఖాస్తుల పరిశీలన, ఎంపిక ప్రక్రియ మొత్తం జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో పనిచేసే స్క్రీనింగ్ కమిటీ (డీఎల్ఎస్‌సీ) నిర్వహిస్తుంది. ఈ పథకం 2019లో ప్రభుత్వం ప్రారంభించినా, కరోనా కారణంగా రెండేళ్లపాటు కొనసాగకుండా ఉండిపోయింది. ఈ ఏడాది ఎక్కువ మందికి దివ్యాంగులకు ప్రయోజనం చేకూర్చే విధంగా ఈ ప్రణాళికలు తయారు చేశారు. 40 శాతం వికలాంగత్వం ఉంటే దీనికి అర్హత ఉన్నట్టే. 18–60 ఏళ్ల మధ్య వయసు గల వారు ప్రయోజనం పొందవచ్చు.

దరఖాస్తు విధానం ఇలా..

- సదరం ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, విద్య లేదా ఏదైనా పనిలో శిక్షణ ధ్రువీకరణ పత్రం, బ్యాంకు ఖాతా పుస్తకం కాపీ, అంగవైకల్యం కనిపించేలా రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు ఉండాలి.
- లక్ష కంటే ఎక్కువ డబ్బు అవసరం ఉన్న వారు తమ వ్యాపారానికి సంబంధించిన ఎస్టిమేట్ పత్రం జత చేయాల్సి ఉంటుంది.
- రూ.లక్ష వరకు రుణం కావాల్సిన వారు ఒక ప్రభుత్వ ఉద్యోగి ష్యూరిటీ సంతకం తీసుకురావాల్సి ఉంటుంది.
- రూ.లక్ష కంటే ఎక్కువ రుణం తీసుకున్న వారు పదేళ్ల కంటే ఎక్కువ సర్వీసు ఉన్న ప్రభుత్వ ఉద్యోగి ష్యూరిటీ సంతకం తీసుకురావాలి.
- లేదంటే బ్యాంకు గ్యారెంటీ ఏదైనా ఆస్తికి సంబంధించిన దస్తావేజులను ష్యూరిటీగా పెట్టాలి.
- ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళా అభ్యర్థులకు ప్రాధాన్యత ఇస్తారు.
- దివ్యాంగ మహిళలకు రుణంలో ఒక శాతం రాయితీ ఉంటుంది.
- రూ. లక్ష తీసుకున్న వారు మూడేళ్లలో తిరిగి చెల్లించాలి. లక్ష కంటే ఎక్కువ తీసుకున్న వారు ఐదేళ్లలో చెల్లించాల్సి ఉంటుంది.
- రూ.50 వేలు రుణం వరకు వడ్డీ 5 శాతం, అంతకంటే ఎక్కు మొత్తం తీసుకున్న వారికి 6 శాతం వడ్డీ ఉంటుంది.

12 వరకు దరఖాస్తులు స్వీకరిస్తాం..

ఎన్‌హెచ్ఎఫ్‌డీసీ పథకం కోసం ఈ సారి తక్కువ దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలో ఈ పథకం కింద కోటి రూపాయలు ఇవ్వనున్నాం. అయితే ఇప్పటి వరకు 20 దరఖాస్తులు వచ్చినందున గడువును 12 వరకు పెంచాం. దివ్యాంగులకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుంది.

– ఎం.కిరణ్‌కుమార్, విభిన్న ప్రతిభావంతుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ, పీడీ

శివారు భూములకు సాగునీరు



ఆయకట్టు ప్రారంభంలో పొక్లెయినర్‌తో ఇసుక మేటలు తొలగిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: నారాయణపురం కుడికాలువ కింద ఎచ్చెర్ల మండలంలో శివారు భూములకు సాగునీరు అందించేందుకు చర్యలు చేపడుతున్నారు. ఆయకట్టు పరిధిలో సంతకవిటి మండలంలో 4221, పొందూరులో 6967, ఎచ్చెర్లమండలంలో 7175 ఎకరాలు ఉండగా, సుమారు మూ డు కిలోమీటర్ల మేర కాలువ విస్తరించి ఉంది. ఎచ్చెర్ల మండలంలోని తోటపాలెం, కొత్తపేట, ముద్దాడ, పొన్నాడ, బొంతలకోడూరు, ధర్మవరం, కొంగరాం, ఓలేటి అగ్రహారం, భగీరథపురం తదితర గ్రామాలకు సాగునీరు సమస్యగా మారింది. దీంతో ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ నిధులు సమకూర్చి శివారు భూములకు సాగునీరు అందించాలని అధికారులకు ఆదేశించారు. ఈ నేపథ్యంలో శివారు భూములకు నీరు అందించే చర్యలు ప్రారంభించారు. జిల్లా జలవనరుల శాఖ ఏఈ జి.వి.రమణ పర్యవేక్షిస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి



రోహిత్ మృతదేహం

టెక్కలి రూరల్: టెక్కలి మేజర్ పంచాయతీ పరిధి స్థానిక చిన్న చాకల వీధికి చెందిన కోటిపల్లి రోహిత్ కుమార్(రాజేష్) (18) గురువారం రాత్రి విద్యుత్ షాక్ కొట్టి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఢిల్లేశ్వరరావు అనే యువకుడు చిన్న బ్రాహ్మణవీధి సమీపంలో గల తన ఇంటి వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపానికి విద్యుత్ లైట్లు ఏర్పాటు చేసేందుకు రోహిత్‌ను పిలిచాడు. రోహిత్ వైర్లు సరిచేస్తుండగా షాక్ కొట్టడంతో అపస్మారక స్థితికి వెళ్లిపోయాడు. స్థానికులు అతడిని టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి దినసరి కూలీ. తన కుమారుడి మృతిపై దర్యాప్తు చేయాలని ఆయన పోలీసులను కోరారు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులు వివరాలు సేకరించారు.

ఎలుగు దాడి బాధిత కుటుంబాలకు ప్రభుత్వ సాయం



పలాస మంత్రి క్యాంప్ కార్యాలయంలో బాధితులకు రూ.5లక్షల చెక్ అందిస్తున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ,వజ్రపుకొత్తూరు రూరల్: వజ్రపుకొత్తూరు మండలం కిడిసింగి గ్రామంలో ఎలుగు బంటి దాడిలో మృతి చెందిన కడమటి కోదండ కుటుంబానికి రూ.5 లక్షల ప్రభుత్వ సాయం అందింది. పలాస మంత్రి క్యాంప్ కార్యాలయంలో గురువారం రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు చేతుల మీదుగా ఈ చెక్కు అందించారు. అదేవిధంగా దాడిలో గాయపడి వైద్యసేవలు అందుతూ మృతి చెందిన వజ్రపుకొత్తూరు గ్రామానికి చెందిన సిర్ల చలపతి, తామాడ షణ్ముఖరావు కుటుంబాలకు సైతం రూ.5లక్షల చొప్పున ఆర్థిక సాయం ప్రకటించారు. తక్షణ సాయం కింద కుటుంబానికి రూ.2.50 లక్షలు చొప్పున అందించారు. త్వరితగతిన మిగిలిన నగదు అందజేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి అప్పలరాజు మాట్లాడుతూ ప్రభుత్వ బాధిత కుటుంబాలకు అండగా నిలిచిందని అన్నారు. ఎలుగుబంటి దాడి అనంతరం బాధితులకు విశాఖపట్నంలో ప్రత్యేకమైన వైద్య సేవలు అందించామని, అందుకు ప్రభుత్వం రూ.33 లక్షల పైనే ఖర్చు చేసిందన్నారు. కార్యక్రమంలో ఫారెస్టు అధికారులు, వజ్రపుకొత్తూరు, కిడిసింగి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పెద్దలు నాయకులు, బాధిత కుటుంబ సభ్యులు తదితరలు పాల్గొన్నారు.

శ్రీకాకుళం డివిజన్ ఈఈగా బయ్యన్నాయుడు



ఈఈ బయ్యన్నాయుడు

అరసవల్లి: తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ శ్రీకాకుళం డివిజన్ ఈఈగా సత్తారు బయ్యన్నాయుడుని నియమిస్తూ విద్యుత్ శాఖ సీఎండీ సంతోషరావు ఉత్తర్వులను జారీ చేశారు. ఈ మేరకు బుధవారం వెలువడిన ఉత్తర్వుల ప్రకారం విశాఖ కార్పొరేట్ కార్యాలయంలో డిప్యూటీ ఈఈగా పనిచేస్తున్న బయ్యన్నాయుడికి పదోన్నతిపై స్థానిక డివిజనల్ ఈఈగా బదిలీ చేశారు. ఈ మేరకు ఆయన గురువారం సాయంత్రం విధుల్లోకి చేరారు. అయితే ఇంతవరకు డివిజనల్ ఈఈగా పనిచేసిన ఎల్‌సీహెచ్ పాత్రుడికి ఇదే సర్కిల్‌లో డీపీఈ ఈఈగా నియమించారు. అలాగే సోంపేటలో డిప్యూటీ ఈఈగా పనిచేస్తున్న బెండి రవికుమార్‌ను స్థానిక సర్కిల్ పరిధిలో ఎంఆర్‌టీ హెచ్‌టీ మీటర్స్ సబ్‌డివిజన్ డిప్యూటీ ఈఈగానూ, సోంపేటలో పనిచేసిన అప్పలరాజుకు విశాఖపట్నం డిప్యూటీ ఈఈగా బదిలీ చేశారు. గురువారం బాధ్యతలు స్వీకరించిన ఈఈ బయ్యన్నాయుడుకు డి–1, డి–2 ఏఈలు కమల్‌హాసన్, సురేష్‌కుమార్‌లతో పాటు పలు విభాగాల అధికారులు అభినందనలు తెలియజేశారు.

'ఐదు మాసాల్లోగా నాడు-నేడు పూర్తి కావాలి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో రెండో విడత కింద జూనియర్ కళాశాలలు, పాఠశాలల్లో చేపడుతున్న నాడు–నేడు పనులన్నీ రానున్న ఐదు మాసాల్లోగా పూర్తి చేసి, వచ్చే ఏడాదికి విద్యార్థులకు అందించాలని పాఠశాల విద్య ముఖ్యకార్యదర్శి బి.రాజశేఖర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం నాడు–నేడు, టీఎంఎఫ్, ఎస్ఎంఎఫ్, ఆర్ఓ ప్లాంట్స్, బ్యాంక్ ఖాతాల ప్రారంభం తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లు, జిల్లా విద్యా శాఖాధికారులు, సమగ్ర శిక్ష అదనపు పథక సమన్వయకర్తలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం ఈ అంశాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని చెప్పారు. నాడు–నేడులో చేపట్టిన పాఠశాలలన్నీ పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉండేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. పాఠశాలల్లో ఉండే అన్ని మౌలిక వసతులకు అవసరమైన అన్ని సరుకుల కొనుగోలుకు, వాచ్ మెన్ ఏర్పాటుకు ఎస్ఎంఎఫ్ నిధులను వినియోగించుకోవచ్చని సూచించారు. అలాగే మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచేందుకు టీఎంఎఫ్ నిధులను వినియోగించుకోవచ్చని చెప్పారు.

రెండో విడతలో నిర్మిస్తున్న పాఠశాలలకు, కళాశాలలకు అవసరమైన సిమెంట్, ఇసుక, ఐరన్ తదితర సామగ్రిని సిద్ధం చేసుకోవాలని, పనులు జాప్యం కాకుండా కలెక్టర్లు పర్యవేక్షించాలన్నారు. నిర్మాణం అనంతరం వాటికి అవసరమైన గ్రీన్ బోర్డులు, ఫ్యాన్లు, ఎలక్ట్రిఫికేషన్, తాగునీరు, తదితర అంశాలపై చర్యలు చేపట్టాలని అన్నారు.

సాక్షి ఫ్యామిలీ
శ్రీకాకుళం
శుక్రవారం ॥ 2-9-2022

ఫ్యాషన్

కేప్ స్టైల్






మనవైన సంప్రదాయ దుస్తులు ఎప్పుడూ అన్నింటా బెస్ట్‌గా ఉంటాయి. కానీ, వీటికే కొంత వెస్ట్రన్ టచ్ ఇవ్వడం అనేది ఎప్పుడూ కొత్తగా చూపుతూనే ఉంటుంది. వెస్ట్రన్ లుక్స్‌ని కూడా మన వైపు కదిలించేలా కేప్స్‌ను డిజైన్ చేస్తున్నారు డిజైనర్లు ఇవి అటు పాశ్చాత్య దుస్తులకు, ఇటు సంప్రదాయ దుస్తులకూ బాగా నప్పుతాయి. ఏ డ్రెస్‌లోనైనా స్టైల్‌గా కనిపించవచ్చు వేడుక ఏదైనా బెస్ట్‌గా వెలిగిపోవచ్చు.

వెస్ట్రన్ స్టైల్ మరింత అదనం

స్కర్ట్ మీదకే కాదు జీన్స్ మీదకూ కేప్ ధరించవచ్చు. ఒక విధంగా చెప్పాలంటే జాకెట్‌కు మరో రూపం కేప్. సేమ్ కలర్ లేదా కాంట్రాస్ట్ కలర్ కేప్స్‌తో డ్రెస్సింగ్‌ను మరింత ఆకర్షణీయంగా మార్చుకోవచ్చు.

ప్రింటెడ్

ప్రింట్ చేసిన కేప్ క్లాత్‌కి రంగు రంగుల టాజిల్స్ జత చేసి కొత్త కళ తీసుకువస్తే, వేడుకలో ఎక్కడున్నా స్పెషల్‌గా కనిపిస్తారు.



ఎంబ్రాయిడరీ హంగులు


నెటెడ్, క్రేప్, జార్జెట్ ఫ్యాబ్రిక్‌లతో డిజైన్ చేసే కేప్ కి జరీ జిలుగులు తోడైతే ఆ అందమే వేరు. అందుకే బ్లౌజ్ నుంచి ఎంబ్రాయిడరీ కేప్‌కు కూడా మారింది.



మిర్రర్ మెరుపులు

సంప్రదాయ దుస్తులకు అద్దాల మెరుపులు తెలిసిందే. కానీ, వెస్టన్ స్టైల్ కేప్‌కు అద్దాలను జతచేస్తే పెళ్లి కూతురి కళ్లలోని మెరుపులా మరింత అందంగా కనిపిస్తుంది.

న్యూస్‌మేకర్


గోపికా గోవింద్

బొగ్గు అమ్మే అమ్మాయి ఎయిర్‌హోస్టెస్

కేరళలో కేవలం పదిహేను వేల మంది ఉండే గిరిజనులు 'కరింపలనులు'. పోడు వ్యవసాయం, కట్టెబొగ్గు చేసి అమ్మడం వీరి వృత్తి. అలాంటి సమూహం నుంచి ఒకమ్మాయి 'ఎయిర్‌హోస్టెస్' కావాలనే కల కంది. కేరళలో అప్పటి వరకూ గిరిజనులు ఎవరూ ఇలాంటి కలను కనలేదు. 12 ఏళ్ల వయసులో కలకంటే 24 ఏళ్ల వయసులో నిజమైంది. పరిచయం చేసుకోండి కేరళ తొలి గిరిజన ఎయిర్‌హోస్టెస్‌ని.

కేరళలోని కన్నూరు, కోజికోడ్ జిల్లాల్లో కనిపించే అతి చిన్న గిరిజన తెగ 'కరింపలనులు'. వీళ్లు మలయాళంలో తుళు పదాలు కలిపి ఒక మిశ్రమ భాషను మాట్లాడతారు. అటవీ భూమిని లీజుకు తీసుకుని వ్యవసాయం చేస్తారు. లేదంటే అడవిలోని పుల్లల్ని కాల్చి బొగ్గు చేసి అమ్ముతారు. గోపికా గోవింద్ ఇలాంటి సమూహంలో పుట్టింది. అయితే ఈ గిరిజనులకు ఇప్పుడు వ్యవసాయం కోసం అటవీభూమి దొరకడం లేదు. కట్టెలు కాల్చడాన్ని ఫారెస్టు వాళ్లు అడ్డుకుంటూ ఉండటంతో బొగ్గు అమ్మకం కూడా పోయింది. చిన్నప్పుడు అమ్మా నాన్న చేసే ఈ పని చూస్తూ పెరిగిన గోపికా ఇక్కడతో ఆగడమా... అంబరాన్ని తాకడమా అంటే అంబరాన్ని తాకడమే తన లక్ష్యం అని అనుకుంది.

డిగ్రీ తర్వాత

బిఎస్సీ చదివిన గోపిక ఇప్పుడు ఎయిర్ హోస్టెస్ కావాలంటే అవసరమైన కోర్సు గురించి వాకబు చేసింది. ప్రయివేటు కాలేజీలలో దాని విలువ లక్షల్లో ఉంది. కూలి పని చేసే తల్లిదండ్రులు ఆ డబ్బు కట్టలేరు. అందుకని ఎం.ఎస్సీ కెమిస్ట్రీ చేరింది. చదువుతున్న దన్న మాటేకాని ఎయిర్ హోస్టెస్ కావడం ఎలా... అని ఆలోచిస్తూనే ఉంది. సరిగ్గా అప్పుడే ఐ.ఎ.టి.ఎ (ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్) వాళ్ల కస్టమర్ సర్వీస్ కోర్సును గవర్నమెంట్ స్కాలర్‌షిప్ ద్వారా చదవొచ్చని తెలుసుకుంది. ఎస్.టి విద్యార్థులకు ఆ స్కాలర్‌షిప్ రాష్ట్ర ప్రభుత్వం ఇస్తోంది. అప్లై చేసింది. స్కాలర్‌షిప్ మంజూరు అయ్యింది. గోపిక రెక్కలు ఇక ముడుచుకు ఉండిపోలేదు.

లక్ష రూపాయల కోర్సు

వాయనాడ్‌లోని డ్రీమ్ స్కై ఏవియేషన్ అనే సంస్థలో ఎయిర్ హోస్టెస్ కోర్సును స్కాలర్‌షిప్ ద్వారా చేరింది గోపిక. చదువు, బస, భోజనం మొత్తం కలిపి లక్ష రూపాయలను ప్రభుత్వమే కట్టింది. మలయాళ మీడియం లో చదువుకున్న గోపిక ఎయిర్ హోస్టెస్‌కు అవసరమైన హిందీ, ఇంగ్లిష్‌లలో కూడా తర్ఫీదు అయ్యింది. కోర్సు పూర్తి చేసింది. ఒకసారి ఇంటర్వ్యూకు వెళితే సెలెక్ట్ కాలేదు. రెండోసారి ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సంస్థలో ఎయిర్ హోస్టెస్‌గా ఎంపికయ్యింది.

8వ క్లాసు కల

గిరిజనులు విమానాన్ని గాల్లో ఎగురుతుంటే చూస్తారు తప్ప ఎక్కలేరు. గోపికా గోవింద్ కూడా చిన్నప్పుడు ఆకాశంలో ఎగిరే విమానాన్ని ఉత్సాహంగా, వింతగా చూసేది. అందులో ఎక్కడం గురించి ఆలోచించేది. 8వ క్లాసుకు వచ్చినప్పుడు ఒక పేపర్‌లో ఎర్రటి స్కర్టు, తెల్లటి షర్టు వేసుకున్న ఒక చక్కటి అమ్మాయి గోపికా కంట పడింది. ఎవరా అమ్మాయి అని చూస్తే 'ఎయిర్ హోస్టస్' అని తెలిసింది. విమానంలో ఎగురుతూ విధి నిర్వహణ. ఇదేకదా తనకు కావాల్సింది అనుకుంది. కాని ఎవరికైనా చెప్తే నవ్వుతారు. బొగ్గులమ్ముకునే వాళ్ల అమ్మాయికి ఎంత పెద్ద కల అనుకుంటారు. అందుకని సిగ్గుపడింది. తల్లిదండ్రులకు కూడా చెప్పలేదు. కాని కల నెరవేర్చుకోవాలన్న కలను మాత్రం రోజురోజుకు ఆశపోసి పెంచి పెద్ద చేసుకుంది.



విమానం ఎప్పుడూ ఎక్కని గోపిక విమానంలోనే ఇక పై రోజూ చేసే ఉద్యోగం కోసం తిరువనంతపురం నుంచి ముంబైకి ట్రైనింగ్ కోసం వెళ్లింది. అక్టోబర్‌లో ఆమె కూడా యూనిఫామ్ వేసుకుని విమానంలో మనకు తారసపడొచ్చు.

ఆమె కలను ఆమె నెరవేర్చుకుంది. ఇక మీ వంతు.

కిచెన్ టిప్స్



● రెండు షాంపూ ప్యాకెట్లను వేడినీటిలో వేసి చక్కగా కలపాలి. నీళ్లు చల్లారాక ఈ నీటిని స్ప్రే బాటిల్లో పోసుకోవాలి. రోజూ రాత్రి పడుకునే ముందు స్టవ్ మీద ఈ నీటిని చల్లి బట్టతో తుడిస్తే స్టవ్ మీద ఉన్న జిడ్డు, కూర మరకలు పోతాయి. ఇలా చేయడం వల్ల స్టవ్ కడగనక్కరలేకుండానే శుభ్రంగా ఉంటుంది.



● నూనె డబ్బా మూతపై పేరుకున్న జిడ్డును వదిలించేందుకు.. మూతపై కొద్దిగా బియ్యపిండి వేసి టూత్ బ్రష్‌తో రుద్దాలి. ఇలా చేస్తే నీళ్లు, డిష్ వాషర్ వాడకుండానే మూతపైన జిడ్డంతా పోతుంది.

వంటిల్లు

నువ్వుంటే చాలు

**వర్షం... పడిశం కలిసి వస్తాయి.
చలి... కీళ్ల నొప్పులు
ఒకదాని వెంట మరొకటి వస్తాయి.
వర్షాకాలం... చలికాలాల్లో...
ఆహారంలో 'నువ్వు' ఉంటే
ఆరోగ్యం హాయిగా ఉంటుంది.
అందుకే... మన 'వంటిల్లు'లో
'నువ్వుల వంటలు'**



తిల్ కీ బర్ఫీ

కావలసినవి: నువ్వులు– ఒక కప్పు; నెయ్యి – రెండు టేబుల్ స్పూన్ ; కోవా– అర కప్పు ; చక్కెర – కప్పు ; నీరు – కప్పు.

తయారీ: ● మందపాటి బాణలిలో నువ్వులను సన్నమంట మీద చిటపటలాడే వరకు వేయించి బాణలిని స్టవ్ మీద నుంచి దించాలి. ● స్టవ్ మీద మరొక బాణలి పెట్టి అందులో నెయ్యి, కోవా వేసి బాగా కలుపుతూ సన్న మంట మీద గోధుమరంగులోకి వచ్చే వరకు వేయించాలి. ఇప్పుడు స్టవ్ మీద నుంచి దించి వెంటనే వేయించిన నువ్వులను వేసి కలిపి వేడి తగ్గేవరకు పక్కన ఉంచాలి.
● మరొక పాత్రలో చక్కెర, నీరు కలిపి చక్కెర కరిగి తీగపాకం వచ్చే వరకు గరిటతో కలుపుతూ మరిగించాలి. తీగపాకం రాగానే ముందుగా సిద్ధం చేసిన నువ్వులు, కోవా మిశ్రమాన్ని వేసి కలపాలి. ● ఒక ప్లేటుకు నెయ్యి రాసి అందులో పై మిశ్రమాన్ని వేసి సమంగా సర్దాలి. కొద్దిగా వేడి తగ్గిన తర్వాత నచ్చిన ఆకారంలో కట్ చేసి చల్లారే వరకు పక్కన ఉంచాలి. చల్లారిన తర్వాత బర్ఫీలను గాలి దూరని డబ్బాలో నిల్వ చేసుకుంటే వారం–పది రోజుల వరకు తాజాగా ఉంటాయి. భోజనం తరవాత ఒక బర్ఫీ తింటే దేహానికి అవసరమైన క్యాల్షియం అందుతుంది.



నువ్వుల పులావ్

కావలసినవి: **బాసుమతి బియ్యం** – 2 కప్పులు ; **నువ్వులు** – 2 టేబుల్ స్పూన్‌లు ; **ఎండుమిర్చి** – 4 ; **వేరుశనగ పప్పు** – అర కప్పు ; **జీడిపప్పులు** – అర కప్పు ; **ఆవాలు** – 2 టీ స్పూన్‌లు ; **మినప్పప్పు** – అర కప్పు ; **కరివేపాకు** – నాలుగు రెమ్మలు ; **నెయ్యి** – 2 టేబుల్ స్పూన్‌లు ; **బటర్** – 2 టేబుల్ స్పూన్‌లు ; **క్రీమ్** – అర కప్పు ; **ఉప్పు** – రుచికి తగినంత.

తయారీ: ● ముందుగా బియ్యాన్ని కడిగి పక్కన పెట్టుకోవాలి. ● బాణలిలో టేబుల్ స్పూన్ నెయ్యి వేసి జీడిపప్పు, వేరుశనగపప్పు వేయించి మరొక గిన్నెలోకి తీసి పక్కన పెట్టుకోవాలి. ● అదే బాణలిలో మిగిలిన నేతిలో ఎండుమిర్చి, నువ్వులను దోరగా వేయించాలి. వేడి తగ్గిన తర్వాత పొడి చేసుకోవాలి. ● ఇప్పుడు బాణలిలో బటర్ వేడి చేసి అందులో క్రీమ్ వేసి బాగా కలపాలి. నేతిలో వేయించి పక్కన ఉంచిన జీడిపప్పు, వేరుశనగపప్పులను వేసి కలిపి స్టవ్ ఆపేయాలి. ● మందపాటి పెనంలో ఒక టేబుల్ స్పూన్ నెయ్యి వేడి చేసి అందులో ఆవాలు వేసి, చిటపట వేగిన తర్వాత మినప్పప్పు వేసి సన్న మంట మీద దోరగా వేయించి చివరగా కరివేపాకు వేసి కలపాలి. ● అందులో ముందుగా వేయించి పొడి చేసిన నువ్వులు – మిరపకాయల పొడి కలిపి అందులో మూడు లేదా నాలుగు కప్పుల నీటిని (బియ్యం ఉడకడానికి తగినన్ని) పోయాలి. ● నీరు మరగడం మొదలైన తర్వాత నానిన బియ్యం, ఉప్పు వేసి కలిపి మీడియం మంట మీద ఉడికించాలి. ● నీరు తగ్గిన తర్వాత సిమ్‌లో ఉంచి అన్నం మీద జీడిపప్పు, వేరుశనగపప్పు, వేయించగా మిగిలిన క్రీమ్ వేసి జాగ్రత్తగా కలిపి ఆవిరి బయటకు పోకుండా మూత గట్టిగా పెట్టాలి.



ఏషియన్ సెసెమీ వెజ్ సలాడ్

కావలసినవి: **నువ్వులు** – ఒక టేబుల్ స్పూన్ (దోరగా వేయించాలి); **లెట్యూస్ లేదా క్యాబేజీ ఆకులు** – ఒక కప్పు ; **సన్నగా నిలువుగా తరిగిన బాదం పప్పు** – ఒక టీస్పూన్ ; **తోటకూర లేదా చుక్కకూర** – అరకప్పు.

డ్రెసింగ్ కోసం: **ఆలివ్ ఆయిల్** – ఒక టీ స్పూన్; **సోయాసాస్** – ఒక టీ స్పూన్ ; **నువ్వు పప్పు నూనె** – పావు టీ స్పూన్ ; **ఉప్పు, మిరియాల పొడి**– రుచికి తగినంత.

తయారీ:
● ఒక పాత్రలో నువ్వులు, లెట్యూస్, బాదం పప్పు, ఆకుకూరలను వేసి కలపాలి.
● మరొక పాత్రలో డ్రెసింగ్ కోసం తీసుకున్నవన్నీ వేసి చిలికి పైమిశ్రమంలో వేసి సర్వ్ చేయాలి.



సెసెమీ క్రష్డ్ చికెన్

కావలసినవి: **బోన్‌లెస్ చికెన్** – ఒక కేజీ (ముక్కలు పొడవుగా కట్ చేసుకోవాలి)

మారినేషన్ కోసం: **పెరుగు** – కప్పు ; **నిమ్మరసం** – 2 టేబుల్ స్పూన్‌లు ; **పచ్చి బొప్పాయి పేస్ట్** – ఒక టేబుల్ స్పూన్ ; **గరం మసాలా పొడి**– ఒక టీస్పూన్ ; **యాలకుల పొడి**– అర టీ స్పూన్ ; **నూనె** – 3 టేబుల్ స్పూన్‌లు ; **ఉప్పు** – రెండు టీ స్పూన్‌లు లేదా రుచికి తగినంత)

కోటింగ్ కోసం: **కోడిగుడ్లు** – 3 ; **మొక్కజొన్న పిండి** – 2 టేబుల్ స్పూన్‌లు ; **ఉప్పు** – అర టీ స్పూన్ ; **నువ్వులు** – 3 టేబుల్ స్పూన్‌లు ; **పచ్చిమిర్చి** – 6 (సన్నగా తరగాలి) ; **వెల్లుల్లి పేస్ట్**– టీస్పూన్ ; **మిరప్పొడి** – టీ స్పూన్ ; **వెనిగర్** – టేబుల్ స్పూన్ ; **బెల్లం తురుము** – ఒకటిన్నర టేబుల్ స్పూన్‌లు ; **కొత్తిమీర తరుగు** – ఒక టేబుల్ స్పూన్..

తయారీ: ● చికెన్‌ను శుభ్రం చేసి, మారినేషన్ కోసం సిద్ధం చేసుకున్న పదార్థాలన్నీ వేసి బాగా కలిపి పక్కన ఉంచాలి. ● కోటింగ్ కోసం తీసుకున్న పదార్థాలను ఒక పాత్రలో వేసి కలపాలి. ● మారినేట్ చేసిన చికెన్ ముక్కలను కోటింగ్ మిశ్రమంలో వేసి తీసి నువ్వులలో వేసి (చికెన్ ముక్కల మసాలాలకు నువ్వులు అంటుకునేటట్లు) కలపాలి. ● అవెన్‌ను 220 డిగ్రీల ఉష్ణోగ్రతలో పది నిమిషాల పాటు బేక్ చేయాలి.

● సక్సెస్ స్టోరీ

యువర్స్



ఇండియా గేమింగ్ మార్కెట్‌లో
వెస్టన్ డెవలపర్స్ టాప్‌లో ఉన్నారు.
అయితే అఫ్సర్ అహ్మద్, గోవింద్ అగర్వాల్‌లు
వెస్టన్ గేమింగ్ కంపెనీలకు సవాలు విసురుతూ,
సత్తా చాటుతున్నారు.
అవును. మన ఆట మొదలైంది...



● గోవింద్ అగర్వాల్
● అఫ్సర్ అహ్మద్

మన ఆట మొదలైంది

లాక్‌డౌన్ సమయంలో యూట్యూబ్‌లో వీడియోలు చూసీచూసీ విసుగెత్తి పోయాడు ముంబైకి చెందిన ప్రభుత్వ ఉద్యోగి సంజీవ్ మెహతా. తన మొబైల్ ఫోన్‌లో 'లూడోస్టార్' గేమ్ ఆడడం మొదలుపెట్టడంతో విసుగు మాయమై హుషారు ప్రత్యక్షమైంది. తమ ఫోనే లోకంగా ఎవరికి వారు విడిపోయిన ఆ ఇంట్లో కుటుంబసభ్యులందరినీ ఒకచోట చేర్చింది లూడో స్టార్.

బాల్యం నాటి తన ఫేవరెట్ ఆటకు ఆన్‌లైన్ రూపమైన 'లుడో స్టార్' 57 సంవత్సరాల మెహతాకు స్ట్రెస్‌బస్టర్‌గా పనిచేసింది.

మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో ఒక హౌజింగ్ సొసైటీలో వాచ్‌మన్‌గా పనిచేసే రాజా సాహు ఇష్టమైన ఆట లుడో స్టార్.

'లాక్‌డౌన్ టైమ్‌లో నేను ఇక్కడ ఉంటే, మా ఆవిడ ఊళ్లో ఉండేది. నేను ఊరికి వెళ్లలేని పరిస్థితి. ఆ సమయంలో లూడో స్టార్ మమ్మల్ని ఒకటి చేసింది. ఒకరిని ఒకరు ఓడించుకుంటూ, ఆటపట్టించుకుంటూ ఉండేవాళ్లం' ఆ రోజులను గుర్తు చేసుకున్నాడు రాజా సాహు.

'గేమ్ బెర్రీ ల్యాబ్స్' ఈ లుడో స్టార్ సృష్టికర్త. ఐఐటీ–ఖరగ్‌పూర్ గ్రాడ్యుయెట్స్ అఫ్సర్ అహ్మద్, గోవింద్ అగర్వాల్‌లు బెంగళూరు కేంద్రంగా ఈ కంపెనీ ప్రారంభించారు.

ఐఐటీ రోజుల్లోనే రకరకాల గేమ్స్ రూపకల్పన గురించి ఆలోచన చేస్తుండేవారు ఈ ఇద్దరు మిత్రులు. చదువు పూర్తయిన తరువాత 'మూన్‌ఫ్రాగ్ ల్యాబ్స్' కంపెనీలో ఉద్యోగం చేశారు. ఉద్యోగం చేస్తున్న మాటేగానీ వారి మనసంతా ఆన్‌లైన్ ఆటలతోనే నిండిపోయింది.

ఇక ఇలా అయితే కుదరదనుకొని ఒక ఫైన్‌మార్నింగ్ చేస్తున్న ఉద్యోగానికి రాజీనామా చేశారు. మొబైల్‌లో క్లాసిక్ బోర్డ్ గేమ్స్‌ను ఫ్రెండ్స్, కుటుంబసభ్యులు కనెక్ట్ అయ్యేలా తీర్చిదిద్దడానికి కసరత్తులు ప్రారంభించారు.

తమ సేవింగ్స్‌తో బెంగళూరులో 'గేమ్ బెర్రీ ల్యాబ్స్' మొదలుపెట్టారు.

కంపెనీకి సంబంధించిన ప్రాడక్ట్, యుఎక్స్ వెర్టికల్స్‌కు సంబంధించిన వ్యవహారాలను అహ్మద్ పర్యవేక్షించేవాడు. ఇక ఇంజనీరింగ్, టెక్నాలజీ విభాగాలను అగర్వాల్ చూసుకునేవాడు. మొదటి సంవత్సరంలోనే కంపెనీ లాభాల బాట పట్టడం విశేషం.

గేమ్ బెర్రీ ల్యాబ్స్‌కు చెందిన రెండు పాపులర్ సోషల్ మల్టీప్లేయర్ గేమ్స్ లుడో స్టార్, పర్చిసి స్టార్ 200 మిలియన్ డౌన్‌లోడ్స్‌తో టాప్‌లో ఉన్నాయి.

ఫ్రీ–టు–ప్లే– బిజినెస్ మోడల్‌లో మొదలైన 'గేమ్ బెర్రీ ల్యాబ్స్'కు ఇన్ యాప్ పర్చెజెస్(ఐఎపి), యాడ్స్ ప్రధాన ఆదాయ వనరు.

'గేమ్ అంటే గేమే' కాన్సెప్ట్‌నే నమ్ముకుంటే 'లుడో గేమ్' అంత పెద్దహిట్టై ఉండేది కాదు. అహ్మద్, అగర్వాల్ మాటల్లో చెప్పాలంటే ఆటకు అనుబంధాలను జోడించారు.

'సంప్రదాయంగా లూడోను ప్లేయర్స్ చూసే పద్ధతిని గేమ్‌బెర్రీ ల్యాబ్స్ మార్చేసింది' అంటారు సగౌరవంగా ఇద్దరు.

'ఇండియన్ గేమింగ్ మార్కెట్‌లో వెస్టన్ డెవలపర్స్ అగ్రస్థానంలో ఉండేవారు. ఇప్పుడు ఆ పరిస్థితిని గేమ్ బెర్రీ ల్యాబ్స్, గేమ్షన్ లాంటి కంపెనీలు మార్చి మన సత్తా చాటే ప్రయత్నంలో ఉన్నాయి' అంటున్నారు ఆల్ ఇండియన్ గేమింగ్ ఫెడరేషన్ సీయివో రోలాండ్.

రాబోయే పన్నెండు నెలల సమయంలో టీమ్ సభ్యులను రెట్టింపు చేసే ప్రయత్నంలో ఉంది కంపెని. అంతేకాదు టెక్నాలజీ క్రియేషన్‌లో పెట్టుబడులను పెంచాలనుకుంటుంది.

సాహో!

● వరల్డ్ రికార్డ్



పంజాబ్‌లోని గురుదాస్‌పూర్ జిల్లాకు చెందిన కువర్ అమృత్‌బీర్‌సింగ్ ఒకే నిమిషంలో ఎక్కువ పుషప్స్ (చప్పట్లు కొడుతూ) చేసి 'గిన్నిస్ వరల్డ్ రికార్డ్'లో చోటు సంపాదించాడు. రెండు సంవత్సరాల క్రితం కేవలం 30 సెకండ్లలో ఎక్కువ సూపర్‌మ్యాన్ పుషప్స్ చేసి రికార్డ్ సృష్టించాడు. స్వగ్రామంలో సంప్రదాయ పద్ధతుల్లో జిమ్ ఏర్పాటు చేసుకున్నాడు. 2019లో సింగ్ ఫిట్‌నెస్ జర్నీ మొదలైంది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఇతడి ఫాలోవర్స్ సంఖ్య లక్ష దాటింది. తన యూట్యూబ్ ఛానల్‌కు మంచి ఆదరణ ఉంది.

● టెక్..టాక్

వయా గూగుల్ మ్యాప్స్



మీ లైవ్ లొకేషన్‌ను గూగుల్ మ్యాప్స్ ద్వారా షేర్ చేయడానికి...

1. గూగుల్ మ్యాప్స్ ఓపెన్ చేయండి 2. టాప్ రైట్‌లోని మీ ప్రొఫైల్ పిక్చర్ క్లిక్ చేయండి 3. లొకేషన్–షేరింగ్‌ను సెలెక్ట్ చేయండి 4. బ్లూ 'న్యూ షేర్' బటన్ స్క్రీన్‌పై కనిపిస్తుంది 5. లైవ్ లొకేషన్‌ను పదిహేను నిమిషాల నుంచి ఒకరోజు వరకు టైమర్ సెట్ చేసుకోవచ్చు 6. షేర్ విండో నుంచి లైవ్ లొకేషన్ సెండ్ చేయాలి.

అడల్ట్ కంటెంట్ బ్లాక్ చేయడానికి



యూట్యూబ్‌లో అడల్ట్ కంటెంట్ బ్లాక్ చేయడానికి...

1. యూట్యూబ్ ఓపెన్ చేయండి 2. టాప్‌రైట్ కార్నర్‌లోని మీ ప్రొఫైల్‌ను ట్యాప్ చేయండి 3. సెట్టింగ్స్ ట్యాప్ చేయండి 4. జనరల్ ట్యాప్ చేయండి 5. 'రిస్ట్రిక్టెడ్ మోడ్' ఆప్షన్‌ను క్లిక్ చేయండి.





కొత్త మ్యాథ్స్ యాప్

చాలామందిలో మ్యాథ్స్ అంటే ఉండే చిన్నప్పటి భయం ఇప్పటికీ కంటిన్యూ అవుతూనే ఉంటుంది. నిజానికి మ్యాథ్స్‌తో ఫ్రెండ్షిప్ చేస్తే అతుక్కుపోతాం. మెదడు చురుగ్గా తయారవుతుంది. పోటీ పరీక్షలకు కూడా ఉపయోగపడుతుంది. 'మరి ఇప్పుడు క్లాసికి వెళ్లలేము కదా' అనే డౌట్ అక్కర్లేదు. అమెరికన్ ఎడ్యుకేషనల్ టెక్నాలజీ కంపెనీ 'డ్యుయోలింగో' సరికొత్త మ్యాథ్స్ యాప్ తీసుకువస్తోంది. దీని ద్వారా సరదాగానే మ్యాథ్స్‌లో ప్రావీణ్యం సంపాదించవచ్చు. లెసన్స్, ఎక్సర్‌సైజ్‌లు, మినీగేమ్స్... మొదలైనవి ఉంటాయి.

● గేమింగ్: నేడే విడుదల

సాహసి



జానర్: యాక్షన్–ఎడ్వెంచర్
ప్లాట్‌ఫామ్స్: ప్లేస్టేషన్ 3, ప్లేస్టేషన్ 4, ప్లేస్టేషన్ 5, విండోస్

యాక్షన్–ఎడ్వెంచర్‌గేమ్ ది లాస్ట్ ఆఫ్ అజ్ పార్ట్–1 నేడు విడుదల అవుతుంది. 2013లో వచ్చిన 'ది లాస్ట్ ఆఫ్ అజ్' పీఎస్3 గేమ్‌కు ఇది రిమేక్. అమెరికన్ గేమింగ్ కంపెనీ 'నాటీ డాగ్' కిరీటంలో ఈ గేమ్‌ను కలికితురాయిగా చెబుతారు. ఇంప్రూవ్‌డ్ టెక్చర్ క్వాలిటీ, హైయర్ ఫ్రేమ్‌రేట్, రిజల్యూషన్‌లతో 2014లో రీమాస్టర్డ్ వెర్షన్ వచ్చింది. తాజా వెర్షన్ మోర్ రియలిస్టిక్ ఫాగ్ ఎఫెక్ట్, మోర్ డిటేయిల్డ్ టెక్చర్స్ హైయర్ ఇమేజ్ క్వాలిటీతో వస్తున్నట్లు ప్రకటించారు. ఈ థర్డ్–పర్సన్ యాక్షన్ గేమ్‌లో మధ్య వయస్కుడైన స్మగ్లర్ జోయెల్, 14 సంవత్సరాల ఎల్లీ అనే అమ్మాయి ప్రధాన పాత్రలు.

టాక్ నైన్‌టీన్ టు ది డజన్

ENGLISH ఇడియమ్స్

కొందరు మాట్లాడితే ఎక్స్‌ప్రెస్ పరుగులు తీస్తున్నట్లుగానే ఉంటుంది. అంతరిక్షం నుంచి ఆవకాయజాడి వరకు అన్ని విషయాలు మాట్లాడేస్తుంటారు. ఇలాంటి వారి గురించి ఉపయోగించే ఇడియమ్ టాక్ నైన్‌టీన్ టు ది డజన్.

ఉదా: 1. స్వర్ణ వాజ్ ఆన్ ది ఫోన్... టాకింగ్ నైన్‌టీన్ టు ది డజన్.

ఇది మైనింగ్ వరల్డ్ నేపథ్యం నుంచి వచ్చిన ఇడియమ్ అనేది ఒక వెర్షన్. 18వ శతాబ్దంలో కాపర్ మైన్స్ వరదల్లో చిక్కుకుపోయినప్పుడు, నీటిని బయటికి తోడేసేందుకు స్టీమ్ పంపులను వాడేవారు. 12 బుషెల్స్ బొగ్గును కాల్చితే 19 వేల గ్యాలన్ల నీటిని తోడేసేందుకు వీలయ్యేదట. బహుశా 'తక్కువ టైమ్‌లో ఎక్కువ' అనే అర్థంలో ఈ ఇడియమ్ వచ్చి ఉంటుంది.

● బ్రెయిన్ జిమ్

ఫటాఫట్ ధనాధన్



చివరి వరుసలో ఉన్న ఒంటె విలువ ఎంత?ఎలా?


జవాబు

3x11= 33
11-4=7
7-3 =4
7+7-ఒంటె=11
14-ఒంటె=11 ఒంటె=14-11=3

సినిమా

ఓ బందిపోటు గాథ

పవన్ కల్యాణ్ హీరోగా క్రిష్ (జాగర్లమూడి రాధాకృష్ణ) దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'హరిహర వీరమల్లు'. ఈ చిత్రంలో నిధీ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఏ.ఎమ్. రత్నం సమర్పణలో దయాకర్ రావు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. శుక్రవారం (సెప్టెంబరు 2) పవన్ కల్యాణ్ బర్త్ డే. ఈ సందర్భంగా 'హరిహర వీరమల్లు' చిత్రం నుంచి కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేసింది చిత్రబృందం. ఎ. దయాకర్ రావు మాట్లాడుతూ – ''17వ శతాబ్దం నాటి మొఘలాయిలు, కుతుబ్ షాహీల శకం నేపథ్యంలో జరిగే కథ ఇది. ఓ లెజెండరీ బందిపోటు వీరోచిత గాథ. ఇప్పటికే యాభై శాతం షూటింగ్ పూర్తయింది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఏకకాలంలో ఈ సినిమాను రిలీజ్ చేస్తాం'' అని అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: యం.యం. కీరవాణి, కెమెరా: వీఎస్ జ్ఞానశేఖర్.



● పవన్ కల్యాణ్

కథలపై దర్శకులు మరింత ఫోకస్ పెట్టాలి – చిరంజీవి



● శ్రీజ, సంచిత, శ్రీకాంత్, చిరంజీవి

''కోవిడ్ తర్వాత ఆడియన్స్ థియేటర్స్‌కు రావడం కాస్త తగ్గింది. ఓటీటీ, టీవీ, స్మార్ట్ ఫోన్స్‌తో ఆడియన్స్ ఎక్స్‌ట్రా ఎంటర్‌టైన్మెంట్ పొందుతున్నారు. కానీ సినిమాలు చూసేందుకు థియేటర్స్‌కు రాకూడదని వారు అనుకోవడం లేదు. కంటెంట్ బాగుంటే థియేటర్స్‌కు వస్తారు. 'బింబిసార', 'సీతారామం' రీసెంట్‌గా 'కార్తికేయ 2' సినిమాలు సక్సెస్ అయ్యాయి. యంగ్ డైరెక్టర్స్ కథలపై మరింత ఫోకస్ పెట్టాలి. ఆర్టిస్టుల డేట్స్ వచ్చేస్తున్నాయి కదా ఏదో ఒక కథను సినిమాగా చేసేద్దాం అనే హడావిడి వద్దు. మంచి కథ లేకపోతే సినిమా రెండో రోజే పోతుంది. ఈ మధ్యకాలంలో ఆ బాధితుల్లో నేను ఒకణ్ణి (సరదాగా)'' అని అన్నారు హీరో చిరంజీవి. శ్రీకాంత్ రెడ్డి, సంచిత బషు జంటగా ఏడిద నాగేశ్వరరావు మనవరాలు ఏడిద శ్రీజ నిర్మించిన చిత్రం 'ఫస్ట్ డే ఫస్ట్ షో'. 'జాతిరత్నాలు' ఫేమ్ కేవీ అనుదీప్ కథ, స్క్రీన్‌ప్లేతో దర్శక ద్వయం వంశీధర్ గౌడ్, పుట్టంశెట్టి లక్ష్మీ నారాయణ తెరకెక్కించిన ఈ చిత్రం నేడు రిలీజ్ అవుతోంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్న చిరంజీవి మాట్లాడుతూ – ''ఏడిద నాగేశ్వరరావుగారి బేనర్‌లో 'స్వాతి ముత్యం, సాగర సంగమం' వంటి మంచి చిత్రాలు వచ్చాయి. అలాగే నాకు మంచి పేరు తెచ్చిన 'స్వయంకృషి, ఆపద్బాంధవుడు' సినిమాలు ఈ బ్యానర్‌లో వచ్చాయి. ఏడిద నాగేశ్వరరావుగారి మనవరాలు శ్రీజ నిర్మించిన సినిమా ఈవెంట్‌కు రావడం సంతోషంగా ఉంది. అనుదీప్ 'జాతిరత్నాలు' చూసి ఎంజాయ్ చేశాను. 'జాతిరత్నాలు'లో చిట్టి పాట ఇష్టం. సురేఖ (చిరంజీవి సతీమణి)ను నేను చిట్టి అనే పిలుస్తాను (నవ్వుతూ..). శ్రీజ నిర్మాతగా నిలదొక్కుకోవాలని కోరుకుంటున్నాను. పరిశ్రమకు ఆడవారు వస్తున్నారంటే ప్రోత్సహిస్తాను. మా ఫ్యామిలీలో సుష్మిత, నిహారిక ఇండస్ట్రీకి వస్తామన్నప్పుడు సరే అన్నాను'' అని అన్నారు. ''చిరంజీవిగారు పూర్ణోదయ క్రియేషన్స్‌లో 'స్వయంకృషి', 'ఆపద్బాంధవుడు', 'తాయరమ్మా బంగారయ్య (గెస్ట్ రోల్) చేశారు. 'స్వయంకృషి, ఆపద్బాంధవుడు'లకు నంది అవార్డులు వచ్చాయి. జాతీయ అవార్డు వస్తుందనుకున్నాం. కానీ నార్త్ వారి ఆధిపత్యంతో రాలేదు. అయితే ఆయనకు అవార్డులనేది పెద్ద విషయం కాదు. మెగాస్టార్ అన్నదే పెద్ద అవార్డు'' అని అన్నారు ఏడిద శ్రీరామ్.

ఆ సినిమా రీమేక్‌లో నటించాలని ఉంది – వైష్ణవ్ తేజ్



"రంగ రంగ వైభవంగా'లో ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు అందమైన ప్రేమకథ, భావోద్వేగాలు, ఫ్యామిలీ డ్రామా.. ఇలా అన్నీ ఉన్నాయి. ఈ చిత్రాన్ని ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తారు" అన్నారు వైష్ణవ్ తేజ్. గిరీశాయ దర్శకత్వంలో వైష్ణవ్ తేజ్, కేతికా శర్మ జంటగా నటించిన చిత్రం 'రంగ రంగ వైభవంగా'. బాపినీడు .బి సమర్పణలో బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా వైష్ణవ్ తేజ్ పంచుకున్న విశేషాలు.

● నా సినిమా కథల ఎంపికలో ఓ ప్రేక్షకునిగా ఆలోచిస్తాను. ఈ విషయంలో సాయిధరమ్ తేజ్ (వైష్ణవ్ అన్న) తో పాటు ఎవరి సపోర్ట్ తీసుకోను. నేనే ఎంచుకుంటున్నాను. గిరీశాయ కథ చెప్పిన విధానం, కథపై ఆయనకు ఉన్న నమ్మకం నచ్చింది. పైగా ఆయన మంచి అనుభవం ఉన్న దర్శకుడు. అందుకే 'రంగ రంగ వైభవంగా' చేశా. ● ఈ సినిమాలో చాలామంది సీనియర్ నటీనటులున్నారు. సీనియర్స్‌తో నటించడం వల్ల వారి అనుభవం, అంకితభావం వంటి విషయాలు తెలుసుకున్నాను. నటన విషయంలో మెగా ఫ్యామిలీలోని అందరి నుంచి స్ఫూర్తి పొందుతుంటాను. ● బీవీఎస్ఎన్ ప్రసాద్‌గారి లాంటి సీనియర్ నిర్మాత బేనర్‌లో సినిమా చేయడం సంతోషంగా ఉంది. ఆయనే మంచి టీమ్‌ని సెట్ చేశారు. దేవిశ్రీ ప్రసాద్‌గారు అద్భుతమైన సంగీతం ఇచ్చారు. శ్యామ్‌దత్‌గారు మంచి విజువల్స్ ఇచ్చారు. ● 'ఉప్పెన'తో నాకు పెద్ద హిట్ వచ్చింది. ఆ తర్వాత చేసిన 'కొండ పొలం' మేము అనుకున్నంతగా ఆడలేదు.. అందుకు ఎలాంటి బాధ లేదు. నా ప్రతి సినిమా రొటీన్‌గా కాకుండా వైవిధ్యంగా ఉండాలనుకుంటాను. పెదనాన్న (చిరంజీవి), బాబాయ్ (పవన్ కల్యాణ్) సినిమాలను నేను రీమేక్ చేయడమంటే సాహసమే. మంచి కథ కుదిరి, డైరెక్టర్ నన్ను కన్విన్స్ చేయగలిగితే 'బద్రి' సినిమా రీమేక్‌లో నటించాలనుంది. ప్రస్తుతం సితార బ్యానర్‌లో కొత్త డైరెక్టర్ శ్రీకాంత్ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నాను.

ఓ కామన్ మేన్ కథ



● గౌతమ్, పూజిత

గౌతమ్ కృష్ణ, పూజితా పొన్నడ జంటగా నటించిన చిత్రం 'ఆకాశ వీధుల్లో..'. గౌతమ్ కృష్ణ దర్శకత్వంలో మనోజ్ డీజే, డా. మణికంఠ నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో గౌతమ్ కృష్ణ మాట్లాడుతూ – ''ఓ కామన్‌మేన్ రాక్‌స్టార్ ఎలా అయ్యాడు? అన్నదే ఈ సినిమా కథ. 'ఆకాశవీధుల్లో...' పక్కా యూత్‌ఫుల్ చిత్రం. ఈ సినిమా ఓ స్లో పాయిజన్. యూత్ బాగా కనెక్ట్ అవుతారు. నాకు ఎలాంటి బ్యాగ్రౌండ్ లేదు. ఈ సినిమా కోసం చాలా హార్డ్‌వర్క్ చేశాం'' అన్నారు. ''గౌతమ్ ఎమ్‌బీబీఎస్ చదువుతున్నప్పుడే ఈ సినిమా చేస్తానని అన్నాడు. మెడిసిన్ పూర్తి చేయమన్నాను. పీజీ కూడా పూర్తయ్యేది. కానీ సినిమాలపై ఇష్టంతో ఈ రంగంలోకి వచ్చాడు. గౌతమ్ కృష్ణ చాలా తెలివైనవాడు. సినిమా అద్భుతంగా వచ్చింది'' అన్నారు నిర్మాత మనోజ్. ''నేను ఇండస్ట్రీకి వచ్చి నాలుగేళ్లవుతోంది. దాదాపు ఇరవై సినిమాలు చేశాను. కానీ ఓ మంచి సినిమా చేశాననే తృప్తి ఈ సినిమాతో కలిగింది'' అన్నారు పూజిత.

అది డేరింగ్ స్టెప్ – దర్శకుడు మారుతి



● సునీల్, అంజి, ధన్‌రాజ్, మారుతి

''హాస్యం పండించే హాస్యనటులు ఒక థ్రిల్లర్ సబ్జెక్ట్‌ను ఎంచుకోవడం ఓ డేరింగ్ స్టెప్. ఇక్కడే మొదటి విజయం సాధించింది ఈ చిత్రం. సునీల్, ధన్‌రాజ్ లాంటి మంచి నటులతో జి. నాగేశ్వరరెడ్డిగారు ఇలాంటి థ్రిల్లర్‌తో రావడం ఆసక్తికరంగా ఉంది'' అన్నారు దర్శకుడు మారుతి. సునీల్, ధన్‌రాజ్ ప్రధాన పాత్రల్లో కెమెరామేన్ 'గరుడ వేగ' అంజి దర్శకత్వంలో రూపొందిన సైకలాజికల్ థ్రిల్లర్ 'బుజ్జి.. ఇలారా'. రూపా జగదీష్ సమర్పణలో ఎస్ఎన్ఎస్ క్రియేషన్స్ ఎల్ఎల్‌పి, జి. నాగేశ్వరరెడ్డి టీమ్ వర్క్ పతాకాలపై అగ్రహారం నాగిరెడ్డి, సంజీవరెడ్డి నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా దర్శకుడు మారుతి హాజరయ్యారు. ధన్‌రాజ్ మాట్లాడుతూ – ''ఈ సినిమాకు అసలైన స్టార్స్ నిర్మాతలే. నాపై నమ్మకంతో నాలుగు కోట్లు ఖర్చుపెట్టారు. ఈ కథకు నేనే కరెక్ట్ అని నమ్మి, నాతో సినిమా చేసి అండగా నిలబడ్డారు నాగేశ్వరరెడ్డిగారు'' అన్నారు.''ఈ సినిమా కథ విని షాకయ్యాను. మంచి సందేశం ఉంది'' అన్నారు సునీల్. ''ఈ సినిమాతో దర్శకత్వం ఎంత కష్టమో తెలిసింది'' అన్నారు అంజి. ''ప్రేక్షకులు ఈ సినిమాను ఆదరించి మంచి విజయాన్ని అందించాలి'' అన్నారు నిర్మాతలు.

సైబర్ క్రైమ్ నేపథ్యంలో..



● నందిత, శ్రీరామ్

నందితా శ్వేత, రామ్ జంటగా కల్యాణ్ కుమార్ దర్శకత్వంలో 'ఓటీపీ' సినిమా ఆరంభమైంది. ఈ చిత్రాన్ని యస్. గురుప్రసాద్ రెడ్డి నిర్మిస్తున్నారు. తొలి సీన్‌కి చిత్రనిర్మాత కుమార్తె బేబీ జీవాన్సీ రెడ్డి కెమెరా స్విచ్చాన్ చేయగా, ఇండియన్ ఐడల్ విన్నర్ శ్రీ రామచంద్ర క్లాప్ ఇచ్చారు. నటుడు అలీ స్క్రిప్ట్‌ని చిత్రయూనిట్‌కి అందించారు. ''సైబర్ క్రైమ్ థ్రిల్లర్ నేపథ్యంలో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం'' అన్నారు కల్యాణ్ కుమార్. ''తెలుగు, హిందీ, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో శివరాత్రికి మా సినిమాను రిలీజ్ చేస్తాం'' అన్నారు గురు ప్రసాద్ రెడ్డి. ''ఈ సినిమాలోని ఎమోషన్స్ గ్రిప్పింగ్‌గా ఉంటాయి'' అన్నారు రామ్ మిట్టకంటి.

అల్లూరిని ఇష్టంగా చేశా! – బెక్కెం వేణుగోపాల్



''అల్లూరి'లో శ్రీ విష్ణు విశ్వరూపం చూస్తారు. తన కెరీర్‌లో ఇది బెస్ట్ మూవీ అవుతుంది'' అని నిర్మాత బెక్కెం వేణుగోపాల్ అన్నారు. శ్రీ విష్ణు పోలీసాఫీసర్‌గా నటించిన చిత్రం 'అల్లూరి'. ప్రదీప్ వర్మ దర్శకత్వం వహించారు. బెక్కెం బబిత సమర్పణలో బెక్కెం వేణుగోపాల్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 23న విడుదలకానుంది. బెక్కెం వేణుగోపాల్ మాట్లాడుతూ– ''నేను చిన్నప్పుడు పోలీస్ అవ్వాలనుకున్నాను.. కానీ కాలేకపోయాను. అందుకే 'అల్లూరి' సినిమాలో పోలీస్ పాత్రను చాలా ఇష్టంగా చేశాను. ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు చివరి దశలో ఉన్నాయి. 'దిల్' రాజుగారి సపోర్ట్ నాకు ఎప్పుడూ ఉంటుంది. ఈ మధ్య షూటింగ్స్ నిలిపివేసి చర్చించడం వల్ల చాలా సమస్యలు పరిష్కారమయ్యాయి.. వాటిని త్వరలోనే వెల్లడిస్తాం. వైజాగ్‌లోని అల్లూరి సీతారామరాజుగారి సమాధి దగ్గర నుంచి ఈ నెల 3 నుండి 'అల్లూరి' యూనిట్ యాత్రని ప్రారంభిస్తున్నాం. వైజాగ్‌లో మొదలైన టూర్ వరంగల్, నిజామాబాద్ వరకూ కొనసాగుతుంది. ప్రస్తుతం 'బూట్ కట్ బాలరాజు' అనే ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ నిర్మిస్తున్నాను'' అన్నారు.

పల్లెటూరి బుట్టబొమ్మ



● అనిఖా

అనిఖా సురేంద్రన్, అర్జున్ దాస్, సూర్య వశిష్ఠ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'బుట్టబొమ్మ'. ఎస్. నాగవంశీ, సాయి సౌజన్య ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రంతో శౌరి చంద్రశేఖర్ రమేష్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. ''గ్రామీణ నేపథ్యంలో సాగే ప్రేమకథగా ఈ చిత్రం రూపొందుతోంది. నవంబరులో చిత్రాన్ని రిలీజ్ చేయాలనుకుంటున్నాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: గోపీసుందర్, మాటలు: గణేష్‌కుమార్ రావూరి.

ఇదొక గొప్ప అవకాశం



● సోను

''లెజండరీ డైరెక్టర్ కోడి రామకృష్ణగారి బ్యానర్‌లో, ఆయన కూతురు కోడి దివ్య దీప్తి నిర్మించిన సినిమాలో నటించే చాన్స్ రావడం గొప్పగా భావిస్తున్నా'' అని సోను ఠాగూర్ అన్నారు. కిరణ్ అబ్బవరం, సంజనా ఆనంద్ జంటగా శ్రీధర్ గాదె దర్శకత్వం వహించిన చిత్రం 'నేను మీకు బాగా కావాల్సినవాడిని'. కోడి దివ్య దీప్తి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 9న విడుదల కానుంది. ఈ చిత్రంలో సెకండ్ లీడ్ చేసిన సోను ఠాగూర్ మాట్లాడుతూ– ''చదువు పూర్తయ్యాక మోడల్‌గా కెరీర్ ప్రారంభించాను. ఆ టైమ్‌లో 'జోరుగా హుషారుగా' సినిమాలో ఒక పాట చేసే అవకాశం వచ్చింది. ఆ పాటకు మంచి స్పందన రావడంతో 'నేను మీకు బాగా కావాల్సినవాడిని' చిత్రానికి అవకాశం వచ్చింది. ఇందులో నా పాత్ర బాగుంటుంది. ఇక ఈ సినిమాలో నేను చేసిన 'లాయర్ పాప..' పాటకి మంచి స్పందన వస్తోంది. దివ్య దీప్తిగారు మమ్మల్ని బాగా చూసుకున్నారు'' అన్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	770	58,767
నిఫ్టీ ▽	217	17,543

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)

నాస్‌డాక్	11,608	▽	206
డోజోన్స్	31,438	▽	72
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,423	△	78
డాక్స్	13,484	△	202
షాంఘై	3,185	▽	17
నికాయ్	27,661	▽	430

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

రిలయన్స్ చేతికి కేంపా కోలా

డీల్ విలువ రూ. 22 కోట్లు!



న్యూఢిల్లీ: ఎఫ్‌ఎంసీజీ విభాగంలోకి ప్రవేశిస్తున్న డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్(ఆర్‌ఐఎల్) తాజాగా దేశీ సాఫ్ట్ డ్రింక్ బ్రాండ్ కేంపా కోలాను కొనుగోలు చేసింది. ఢిల్లీకి చెందిన ఈ ప్యూర్ డ్రింకుల సంస్థను సుమారు రూ. 22 కోట్లకు ఆర్‌ఐఎల్ సొంతం చేసుకున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అనుబంధ సంస్థ రిలయన్స్ రిటైల్ వెంచర్స్ ద్వారా జనరల్ ట్రేడ్, స్థానిక మార్కెట్లలో దీపావళికల్లా కేంపాను ప్రవేశపెట్టనున్నట్లు తెలియజేశాయి. ఎంపిక చేసిన కొన్ని స్టోర్లలో ఇప్పటికే సంస్థ కోలా, ఆరెంజ్, లెమన్ ఫ్లేవర్లను ప్రవేశ పెట్టింది. ప్రస్తుతం కేంపా బాట్లింగ్‌ను జలాన్ ఫుడ్ ప్రొడక్ట్స్ అందిస్తోంది. దేశీయంగా సాఫ్ట్ డ్రింక్ మార్కెట్‌లో యూఎస్ దిగ్గజాలు కోకకోలా, పెప్సికో పాగా వేసిన సంగతి తెలిసిందే. కేంపా కోలాను 1970లో ప్యూర్ డ్రింక్స్ సంస్థ రూపొందించింది. 1977వరకూ కోకకోలాను పంపిణీ చేసిన సంస్థ తదుపరి 15ఏళ్ల కాలంలో కేంపా కోలా అమ్మకాలను భారీగా పెంచుకుంది.

మార్కెట్లోకి తపారియా కార్పెంటర్ టూల్స్ జాక్ ప్లేన్స్



ముంబై: ప్రముఖ టూల్స్ తయారీ సంస్థ తపారియా కార్పెంటర్ల కోసం 'జాక్ ప్లేన్స్'ను మార్కెట్లోకి విడుదల చేసింది. కలపను మృదువుగా చెక్కేందుకు ఈ టూల్ వినియోగిస్తారని కంపెనీ తెలిపింది. తక్కువ బరువుతో ఉపయోగించుకునేందుకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని పేర్కొంది.

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	50,409
బంగారం (99.5 స్వచ్ఛత)	50,207
వెండి (కిలో)	52,022

ఆగస్టులో జీఎస్‌టీ వసూళ్లు 28% అప్



న్యూఢిల్లీ: వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్లు ఆగస్టులో 28% ఎగసి రూ.1,43,612 కోట్లుగా నమోదయ్యాయి. వ్యవస్థలో డిమాండ్ పెరుగుదల, రేట్ల పెంపు, సరళతర పన్ను విధానాలు, ఎగవేతల నిరోధానికి చర్యలు దీనికి కారణం. జీఎస్‌టీ వసూళ్లు రూ.1.4 లక్షల కోట్ల స్థాయిని దాటడం ఇది వరుసగా ఆరవ నెల. పండుగల సీజన్ నేపథ్యంలో ఈ ధోరణి కొనసాగుతుందని భావిస్తున్నారు. మొత్తం వసూళ్లలో సెంట్రల్ జీఎస్‌టీ వాటా రూ.24,710 కోట్లు. స్టేట్ జీఎస్‌టీ రూ.30,951 కోట్లు. ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ రూ.77,782 కోట్లు. సెస్ రూ.10,168 కోట్లు. కాగా, ఆగస్టు వసూళ్లు జూలై విలువ (రూ.1.49 లక్షల కోట్లు) కన్నా తక్కువ. ఏప్రిల్‌లో రికార్డు స్థాయిలో రూ.1.67 లక్షల కోట్ల వసూళ్లు జరిగాయి.

2022 జనవరి నుంచి ఇలా...

నెల	జీఎస్‌టీ ఆదాయం (రూ.కోట్లలో)
జనవరి	1,40,986
ఫిబ్రవరి	1,33,026
మార్చి	1,42,095
ఏప్రిల్	1,67,650
మే	1,40,885
జూన్	1,44,616
జూలై	1,48,995
ఆగస్టు	1,43,612

మార్కెట్‌కు మళ్లీ నష్టాలు

సెన్సెక్స్‌కు 770 పాయింట్లు నష్టం • 17,600 దిగువకు నిఫ్టీ

ముంబై: అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు అందడంతో గురువారం దేశీయ స్టాక్ సూచీలు ఒకశాతానికి పైగా నష్టపోయాయి. ద్రవ్యోల్బణ కట్టడికి ఆయా దేశాల కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్లను పెంచవచ్చనే ఆందోళనలు తెరపైకి వచ్చాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2022–23) క్యూ1 జీడీపీ గణాంకాలు అంచనాలను అందుకోలేకపోయాయి. ఇండెక్సుల్లో అధిక వెయిటేజీ రిలయన్స్ షేరు మూడు శాతం పతనాన్ని చవిచూసింది. ఈ పరిణామాల నేపథ్యంలో సెన్సెక్స్ 770 పాయింట్లు నష్టపోయి 58,767 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 217 పాయింట్లు క్షీణించి 17,543 వద్ద నిలిచింది. ఆటో, రియల్టీ రంగాల షేర్లు మాత్రం స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. ఐటీ, ఇంధన షేర్లలో పెద్ద ఎత్తున అమ్మకాలు చోటుచేసుకున్నాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.2,290 కోట్ల షేర్లను అమ్మారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.951 కోట్ల షేర్లను కొన్నారు. సెన్సెక్స్ ఒకశాతానికి పైగా పతనంతో స్టాక్ మార్కెట్లో రూ.1.42 లక్షల కోట్ల సంపద మాయమైంది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈ నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.278.50 లక్షల కోట్లకు దిగివచ్చింది. ఆసియాలో ఒక్క సింగపూర్ మినహా అన్ని దేశాల స్టాక్ సూచీలు రెండుశాతం నష్టపోయాయి. యూరప్ మార్కెట్లు 2% పతనమయ్యాయి. అమెరికా సూచీలు ఒకశాతం నష్టాల్లో ట్రేడవుతున్నాయి.



చెక్కుచెదరని భారత్ వృద్ధి వేగం

- ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో జీడీపీ వృద్ధి రేటు 13.5 శాతం
- దేశీయ డిమాండ్ పటిష్టం



న్యూఢిల్లీ: ప్రపంచంలోనే వేగవంతమైన ఆర్థిక వ్యవస్థగా భారత్ కొనసాగుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో (ఏప్రిల్–జూన్) భారత్ స్థూల దేశీయోత్పత్తి 13.5 శాతంగా నమోదయ్యింది. గడచిన ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో (2021 ఏప్రిల్–జూన్) ఎకానమీ వృద్ధి రేటు 20.1 శాతంకాగా, మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో (జనవరి–మార్చి)లో ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటు కేవలం 4.09 శాతంగా నమోదయ్యింది. వినియోగం, సేవలుసహా పలు రంగాల్లో దేశీయ డిమాండ్ పటిష్టంగా ఉందని అధికారిక గణాంకాలు వెల్లడించాయి. ఇక ఉత్పత్తి స్థాయి వరకూ విలువను పరిశీలనలోకి తీసుకునే గ్రాస్ వ్యాల్యూ యాడెడ్ (జీవీఏ)ను తీసుకుంటే మొదటి త్రైమాసికంలో 12.7 శాతంగా నమోదయ్యింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో వృద్ధి రేటు 17.6%.

13.5 శాతం వృద్ధి అంటే..

జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్‌ఎస్‌ఓ) సమాచారం ప్రకారం, 2021–22లో ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో జీడీపీ (2011–12 స్థిర ధరల ప్రాతిపదికన) విలువ రూ.32.46 లక్షల కోట్లు. తాజా సమీక్షా త్రైమాసికంలో ఈ విలువ రూ.36.85 లక్షల కోట్లు. వెరసి వృద్ధి రేటు 13.5 శాతంగా ఉంది. ఇక జీవీఏను విలువను తీసుకుంటే, ఇది 12.7 శాతం వృద్ధితో రూ.34.41 లక్షల కోట్లుగా ఉంది. కాగా ద్రవ్యోల్బణం పెరుగుదలతో సర్దుబాటు చేయని నామినల్ జీడీపీ (కరంట్ ప్రైసెస్ వద్ద) విలువ మొదటి త్రైమాసికంలో 26.7 శాతం ఎగసి రూ.51.27 లక్షల కోట్ల నుంచి రూ.64.95 లక్షల కోట్లకు ఎగసిందని ఎన్‌ఎస్‌ఓ పేర్కొంది.

సవాళ్లు ఉన్నాయ్...

రానున్న త్రైమాసికాల్లో వృద్ధి తీరుపై ఆందోళనలు నెలకొన్నాయి. వ్యవస్థపై ద్రవ్యోల్బణం సవాళ్లు, వడ్డీరేట్ల భారం, ప్రపంచ ప్రధాన ఆర్థిక వ్యవస్థలకు మాంద్యం భయాలు వంటివి ఇక్కడ ప్రధానమైనవి. మొదటి త్రైమాసికంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) అంచనాలకన్నా తక్కువగా వృద్ధి రేటు నమోదవడం గమనార్హం. 2022–23లో జీడీపీ 7.2 శాతంగా అంచనా. వరుసగా నాలుగు త్రైమాసికాల్లో 16.2 శాతం, 6.2 శాతం, 4.1 శాతం , 4 శాతం వృద్ధి రేట్లు నమోదవుతాయని ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధాన కమిటీ భావిస్తోంది. సమీక్షా కాలంలో తయారీ రంగం 4.8 శాతంగా నమోదుకావడం ఆందోళన కలిగించే విషయం. ఇక ఎగుమతులకన్నా, దిగుమతుల పరిమాణం ఎక్కువగా ఉండడమూ సమస్యాత్మకమే. దీనికితోడు వర్షపాతం దేశ వ్యాప్తంగా విస్తృత ప్రాతిపదికన తగిన విధంగా లేనందున వ్యవసాయ వృద్ధి, గ్రామీణ డిమాండ్, ద్రవ్యోల్బణంపై ఈ ప్రభావం పడే అవకాశం ఉంది. గడచిన ఆరు నెలలుగా ద్రవ్యోల్బణం ఆర్‌బీఐకి కేంద్రం నిర్దేశిస్తున్న ఆరు శాతానికి పైబడి నమోదవుతుండడంతో మే నుంచి ఆర్‌బీఐ బ్యాంకులకు తానిచ్చే రుణాలపై వసూలు చేసే వడ్డీరేటు రెపోను 1.40 శాతం పెంచింది. దీనితో ఈ రేటు 5.4 శాతానికి చేరింది. బ్యాంకులు కూడా వడ్డీరేట్ల పెంపు బాటన నడవడం ప్రారంభించాయి.

7–7.5 శాతం శ్రేణిలో ఉండవచ్చు: కేంద్రం

భారత్ ఎకానమీ వృద్ధి రేటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 7 నుంచి 7.5 శాతం శ్రేణిలో నమోదుకావచ్చని కేంద్రం భావిస్తోంది. 2021–22లో భారత్ 8.7 శాతం వృద్ధి నమోదుచేసుకుంది. ''మొదటి త్రైమాసిక గణాంకాలు మేము ఆశించిన తీరులోనే ఉన్నాయి. వివిధ రంగాల పనితీరు పూర్తిస్థాయి ఆశాజనకంగా ఉంది. వృద్ధి రేటు 7–7.5 శాతం శ్రేణిలో ఉంటుందని భావిస్తున్నాం. అంతర్జాతీయ ఆర్థిక సంస్థలుసైతం ఇదే అంచనాలను వెలిబుచ్చుతున్నాయి'' అని ఫైనాన్స్ కార్యదర్శి టీవీ సోమనాథన్ పేర్కొన్నారు.

వాహన అమ్మకాలు రయ్

- కలిసొచ్చిన పండుగ సీజన్
- సెమీకండక్టర్ల సరఫరా

ముంబై: దేశీయ ఆటో అమ్మకాలు ఆగస్టులో పెరిగాయి. పండగ సీజన్ సందర్భంగా వాహనాలకు డిమాండ్ ఊపందుకోవడంతో పాటు సెమీ కండక్టర్ల సరఫరా మెరుగవడం ఇందుకు కారణమని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. మారుతీ సుజుకీ, టాటా మోటార్స్, మహీంద్రాఅండ్‌మహీంద్రా, కియా మోటార్స్ విక్రయాల్లో వృద్ధి కన్పించింది. హ్యుందాయ్, టయోటా, స్కోడా కంపెనీలూ చెప్పుకోదగిన స్థాయిలో అమ్మకాలు జరిపాయి. అయితే హోండా కార్స్, ఎంజీ మోటార్స్ వాహన సంస్థల విక్రయాల్లో స్వల్ప క్షీణత కన్పించింది. ''గడిచిన మూడు నెలల్లో మునుపెన్నడూ లేని విధంగా 9.92 లక్షల యూనిట్లు అమ్ముడయ్యాయి. బలమైన డిమాండ్‌కు తగ్గట్టు సప్లై మెరుగుపడటంతో ఇది సాధ్యమైంది. ఈ పండుగ సీజన్‌లో 3.77 లక్షల వాహనాలను ఆర్డర్ చేసేందుకు కంపెనీ సన్నద్ధమైంది. పరిశ్రమ వ్యాప్తంగా పెండింగ్ ఆర్డర్లు 7–7.5 లక్షల వాహనాలు ఉండొచ్చు'' అని మారుతీ సుజుకీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీవాస్తవ తెలిపారు. మారుతీ సుజుకీ ఇండియా విక్రయాలు ఆగస్టులో 1,34,166కు చేరాయి. 30 శాతం పెరిగాయి. హ్యుందాయ్ మోటార్ ఇండియా విక్రయాలు 59,068 నుంచి 5% వృద్ధితో 62,210 యూనిట్లకు చేరాయి.



ఆగస్టులో విక్రయాలు ఇలా...

కంపెనీ	2022	2021	క్షీణత/వృద్ధి(%)
మారుతీ సుజుకీ	1,34,166	1,03,187	(+)30
హ్యుందాయ్	62,210	59,068	(+)5
టాటా మోటార్స్	78,843	57,995	(+)41
ఎండ్‌అండ్‌ఎం	29,852	15,973	(+)87
హోండా కార్స్	7,769	11,177	(–)30
ఎంజీ మోటార్స్	4,013	3,823	(–)11
స్కోడా ఆటో	4,222	3,829	(+)10
టయోటా	14,959	12,772	(+)17
కియా	22,322	16,759	(+)33
నిస్సాన్	8,915	4,098	(+)117
ద్విచక్ర వాహనాలు			
బజాజ్ ఆటో	4,01,595	3,73,270	(+)8
హీరో మోటో	4,62,608	4,53,879	(+)2
సుజుకీ	79,559	73,463	(+)8
టీవీఎస్	3,33,787	2,90,694	(+)15
రాయల్ ఎన్‌ఫీల్డ్	70,112	45,860	(+)53
వాణిజ్య వాహనాలు			
వోల్వో ఐషర్	5,003	4,793	(+)4.4
అశోక్ లేలాండ్	14,121	9,360	(+)51
ట్రాక్టర్లు			
ఎస్కార్ట్స్	6,111	5,693	(+)7
మహీంద్రా	21,520	21,360	(+)1

'డైనమో జాగ్రెబ్' జట్టులో సౌమ్య

భారత ఫుట్‌బాల్ జట్టు సభ్యురాలు, తెలంగాణకు చెందిన గుగులోత్ సౌమ్యకు అరుదైన అవకాశం దక్కింది. క్రొయేషియాకు చెందిన ప్రతిష్టాత్మక క్లబ్ 'డైనమో జాగ్రెబ్' తరఫున ఆమె ఆడనుంది. దీనికి సంబంధించి ఏడాది పాటు ఒప్పందం కుదుర్చుకుంది. సౌమ్యతో పాటు మరో భారత ప్లేయర్ జ్యోతి చౌహాన్‌ను కూడా జాగ్రెబ్ క్లబ్ ఎంచుకుంది. ఈ టీమ్‌తో జత కట్టిన తొలి విదేశీ ఆటగాళ్లుగా వీరిద్దరు గుర్తింపు పొందారు. క్రొయేషియాలోనే జరిగిన ట్రయల్స్‌లో సత్తా చాటి వీరిద్దరు ఆ అవకాశం దక్కించుకున్నారు. ఇద్దరూ కూడా భారత దేశవాళీ మహిళల లీగ్‌లో గోకులమ్ ఎఫ్‌సీకే ప్రాతినిధ్యం వహించారు. క్రొయేషియాలో అత్యంత విజయవంతమైన జట్టుగా గుర్తింపు పొందిన డైనమో జాగ్రెబ్ 46 ట్రోఫీలు గెలుచుకుంది.



డిఫెండింగ్ చాంప్‌కు షాక్



స్వియటెక్

మహిళల సింగిల్స్‌లో టాప్‌స్టార్లను ఈ సీజన్ చివరి గ్రాండ్‌స్లామ్‌లో దురదృష్టం వెంటాడుతోంది. యూఎస్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో డిఫెండింగ్ చాంపియన్ రాడుకానుకు తొలి రౌండ్లోనే షాక్ ఎదురైంది. రన్నరప్ లేలా ఫెర్నాండెజ్, రెండు సార్లు చాంపియన్ అయిన నవోమి ఒసాకా, రెండో సీడ్ అనెట్ కొంటావిట్ రెండో రౌండ్ దాటలేకపోయారు. అయితే మరో వైపు ప్రపంచ నంబర్‌వన్ ఇగా స్వియటెక్ మూడో రౌండ్లోకి ప్రవేశించింది.

- తొలి రౌండ్‌లోనే ఓడిన రాడుకాను
- రన్నరప్ లేలా కూడా
- రెండ్ సీడ్‌కు చెక్‌పెట్టిన సెరెనా
- యూఎస్ ఓపెన్

న్యూయార్క్: యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నమెంట్‌లో మహిళల సింగిల్స్‌లో సంచలనాల పర్వం కొనసాగుతోంది. గతేడాది విజేత ఎమ్మా రాడుకాను, రన్నరప్ లేలా ఫెర్నాండెజ్ కనీసం రెండో రౌండ్ కూడా అధిగమించ లేకపోయారు. అయితే కెరీర్ చరమాంకంలో ఉన్న సెరెనా సొంతగడ్డపై వరుస విజయాలతో అభిమానుల్ని అలరిస్తోంది. ఈ టోర్నీలో ఆమె రెండో సీడ్ కొంటావిట్‌ను ఓడించి మూడో రౌండ్ చేరింది. టాప్‌సీడ్ స్వియటెక్ (పోలండ్) 6–3, 6–2తో స్లోన్ స్టీఫెన్స్ (అమెరికా)పై సునాయస విజయంతో మూడో రౌండ్‌లోకి అడుగుపెట్టింది. పురుషుల ఈవెంట్‌లో టాప్‌సీడ్ మెద్వెదెవ్ (రష్యా), బ్రిటన్ స్టార్ ఆండీ ముర్రే,, ఐదో సీడ్ రూడ్ మూడో రౌండ్ చేరగా... స్పెయిన్ దిగ్గజం, రెండో సీడ్ రాఫెల్ నాదల్ తొలిరౌండ్ దాటేందుకు మూడు గంటలపైగా శ్రమించాడు.

రెండో సీడ్‌ను ఓడించి మూడోరౌండ్‌కు...

అమెరికా దిగ్గజం సెరెనా పోరాటం విజయవంతంగా సాగుతోంది. మహిళల సింగిల్స్ రెండో రౌండ్లో ఆమె 7–6 (7/4), 2–6, 6–2తో ప్రపంచ రెండో ర్యాంకర్ కొంటావీట్ (ఈస్తోనియా)ను ఇంటిదారి పట్టించింది. డిఫెండింగ్ చాంపియన్, 11వ సీడ్ రాడుకాను (బ్రిటన్) తొలి రౌండ్లో అది కూడా వరుస సెట్లలో 3–6, 3–6తో అలైజ్ కార్నెట్ (ఫ్రాన్స్) చేతిలో చేతులెత్తేసింది. 2018, 2020 చాంపియన్ నవోమి ఒసాకా ఆట తొలి రౌండ్లోనే ముగిసింది. ఈ జపాన్ స్టార్ 6–7 (5/7), 3–6తో 19వ సీడ్ డానియెల్ కొలిన్స్ (అమెరికా) చేతిలో కంగుతింది. గత రన్నరప్ 14వ సీడ్ లేలా (కెనడా) 3–6, 6–7 (3/7)తో సమ్సొనొవా (రష్యా) చేతిలో, మూడో సీడ్ మరియా సాకరి (గ్రీస్) 6–3, 5–7, 5–7తో ప్రపంచ 75వ ర్యాంకర్ జియు వాంగ్ (చైనా) చేతిలో కంగు తిన్నారు. 12వ సీడ్ కొకొ గాఫ్ (అమెరికా) 6–2, 7–6 (7/4)తో ఎలీనా గాబ్రియెలా రూజ్ (రొమేనియా)పై, 20వ సీడ్ మాడిసన్ కీస్ (అమెరికా) 6–4, 5–7, 7–6 (10–6)తో కెమిల్లా జియోర్గి (ఇటలీ)పై విజయం సాధించారు.



రాడుకాను

మెద్వెదెవ్ అలవోక విజయం

పురుషుల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్, టాప్‌సీడ్ మెద్వెదెవ్ (రష్యా) వరుస సెట్లలో అలవోక విజయంతో మూడో రౌండ్లోకి అడుగుపెట్టాడు. రెండో రౌండ్లో రష్యన్ టాప్‌స్టార్ 6–2, 7–5, 6–3తో ఆర్థర్ రిండెర్క్‌నెచ్ (ఫ్రాన్స్)పై గెలుపొందాడు. కానీ బ్రిటన్ స్టార్ ఆండీ ముర్రే రెండో రౌండ్ దాటేందుకు చెమటోడ్చాడు. ఎమిలివో నవ (అమెరికా)తో జరిగిన పోరులో అతను 5–7, 6–3, 6–1, 6–0తో నెగ్గాడు. ఐదో సీడ్ కాస్పర్ రూడ్ (నార్వే) 6–7 (4/7), 6–4, 6–4, 6–4తో వాన్ రిజ్తొవెన్ (నెదర్లాండ్స్)పై, 12వ సీడ్ కారెనొ బుస్టా (స్పెయిన్) 4–6, 6–4, 6–3, 7–6 (7/5)తో అలెగ్జాండర్ బబ్లిక్ (కజకిస్తాన్)పై, 13వ సీడ్ బెరెటిని (ఇటలీ) 2–6, 6–1, 7–6 (7/4), 7–6 (9/7)తో హ్యూగో గ్రెనియెర్ (ఫ్రాన్స్)పై, 18వ సీడ్ డి మినార్ (ఆస్ట్రేలియా) 6–3, 6–0, 4–6, 6–2తో గారిన్ (చిలీ)పై, 23వ సీడ్ కిరియోస్ (ఆస్ట్రేలియా) 7–6 (7/3), 6–4, 4–6, 6–4తో బెంజమిన్ బొంజి (ఫ్రాన్స్)పై విజయం సాధించారు. ఆరో సీడ్ ఫెలిక్స్ అగర్ (కెనడా) 4–6, 4–6, 4–6తో ప్రపంచ 53వ ర్యాంకర్ జాక్ డ్రాపర్ (బ్రిటన్) చేతిలో పరాజయం చవిచూశాడు. ఈ ఏడాది ఆస్ట్రేలియన్, ఫ్రెంచ్ ఓపెన్ చాంపియన్ నాదల్ తొలి రౌండ్లో 4–6, 6–2, 6–3, 6–3తో రింకీ హిజికట (ఆస్ట్రేలియా)పై కష్టపడి గెలిచాడు.



మెద్వెదెవ్

క్వార్టర్ ఫైనల్లో ప్రణయ్

- కిడాంబి శ్రీకాంత్ పరాజయం
- జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్

టోక్యో: జపాన్ ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో గురువారం భారత అగ్రశ్రేణి ఆటగాళ్లకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో విజయంతో హెచ్‌ఎస్ ప్రణయ్ ముందంజ వేయగా, ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ కిడాంబి శ్రీకాంత్ ఓటమితో వెనుదిరిగాడు. గురువారం జరిగిన మ్యాచ్‌లో ప్రణయ్ 22–20, 21–19 స్కోరుతో ఎనిమిదో సీడ్ లో కీన్ యూ (సింగపూర్)పై విజయం సాధించాడు. 44 నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన పోరులో చివరకు భారత షట్లర్‌దే పైచేయి అయింది. మరో మ్యాచ్‌లో శ్రీకాంత్ 10–21, 16–21 తేడాతో కంటా సునెయామా (జపాన్) చేతిలో ఓటమిపాలయ్యాడు. మహిళల సింగిల్స్‌లో భారత ప్లేయర్ సైనా నెహ్వాల్ తొలి రౌండ్‌లోనే ఓడింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో సైనా 9–21, 17–21తో టాప్ సీడ్ అకానే యమగూచి (జపాన్) చేతిలో పరాజయం పాలు కాగా, పురుషుల సింగిల్స్‌లో లక్ష్య సేన్ కూడా 21–18, 14–21, 13–21తో కెంటా నిషిమొటొ (జపాన్) ముందు తలవంచాడు.



సూర్య సంచలన ఇన్నింగ్స్

- హాంకాంగ్‌పై 40 పరుగులతో భారత్ విజయం
- ఆసియా కప్ 'సూపర్ 4'లోకి

దుబాయ్: సూర్యకుమార్ యాదవ్ (26 బంతుల్లో 68 నాటౌట్; 6 ఫోర్లు, 6 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్‌కు తోడు విరాట్ కోహ్లి (44 బంతుల్లో 59 నాటౌట్; 1 ఫోర్, 3 సిక్స్‌లు) అర్ధసెంచరీ కలిసి భారత్‌ను ఆసియా కప్‌లో 'సూపర్ 4' దశకు చేర్చాయి. టీమిండియా జోరును నిలువరించలేక పసికూన హాంకాంగ్ చేతులెత్తేసింది. బుధవారం జరిగిన గ్రూప్ 'ఎ' మ్యాచ్‌లో భారత్ 40 పరుగుల తేడాతో హాంకాంగ్‌పై ఘన విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 192 పరుగులు చేసింది. రోహిత్ శర్మ (13 బంతుల్లో 21; 2 ఫోర్లు, 1 సిక్స్) ఎక్కువ సేపు నిలవలేకపోగా, కేఎల్ రాహుల్ (39 బంతుల్లో 36; 2 సిక్స్‌లు) బాగా నెమ్మదిగా ఆడాడు. అయితే 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సూర్యకుమార్, కోహ్లి మూడో వికెట్‌కు 42 బంతుల్లోనే అభేద్యంగా 98 పరుగులు జోడించి జట్టుకు భారీ స్కోరు అందించారు. 40 బంతుల్లో కోహ్లి కెరీర్‌లో 31వ అర్ధ సెంచరీ నమోదు చేశాడు. మరో వైపు సూర్య విధ్వంసక బ్యాటింగ్‌తో చెలరేగాడు. ముఖ్యంగా హారూన్ అర్షద్ వేసిన చివరి ఓవర్లో అతను 4 సిక్సర్లతో (వరుసగా 6, 6, 6, 0, 6, 2)తో చెలరేగి 26 పరుగులు రాబట్టాడు. ఈ క్రమంలో 22 బంతుల్లోనే అతని హాఫ్ సెంచరీ పూర్తయింది. అనంతరం హాంకాంగ్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 152 పరుగులకే పరిమితమైంది. బాబర్ హయత్ (35 బంతుల్లో 41; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), కించిత్ షా (28 బంతుల్లో 30; 2 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్లుగా నిలిచారు. జడేజా, భువనేశ్వర్, అర్ష్‌దీప్, అవేశ్ తలా ఒక వికెట్ తీయగా, అవేశ్, అర్ష్‌దీప్ కలిసి భారీగా (8 ఓవర్లలో 98) పరుగులు సమర్పించుకున్నారు. రెండు విజయాలతో ఈ గ్రూప్ టాపర్‌గా భారత్ ముందంజ వేయగా... నేడు పాకిస్తాన్, హాంకాంగ్ మధ్య జరిగే మ్యాచ్ విజేత 'సూపర్ 4'లోకి అడుగు పెడుతుంది.



న్యూజిలాండ్ 'ఎ' 156/5

బెంగళూరు: భారత్ 'ఎ'తో గురువారం ప్రారంభమైన తొలి అనధికారిక టెస్టులో న్యూజిలాండ్ 'ఎ' తొలి రోజు ఆట ముగిసే సమయానికి మొదటి ఇన్నింగ్స్‌లో 5 వికెట్ల నష్టానికి 156 పరుగులు చేసింది. జో కార్టర్ (73 బ్యాటింగ్) అర్ధ సెంచరీ సాధించాడు. భారత్ 'ఎ' బౌలర్లలో పేసర్ ముకేశ్ కుమార్ 34 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టగా...యశ్ దయాళ్, అర్జాన్ చెరో వికెట్ తీశారు. ప్రతికూల వాతావరణం కారణంగా మొదటి రోజు 61 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది.


శ్రీలంక సంచలన విజయం

ఆసియా కప్‌లో 'సూపర్ 4'కు అర్హత



దుబాయ్: ఓటమికి చేరువైన మ్యాచ్‌లో అనూహ్యంగా పుంజుకున్న శ్రీలంక ఆసియా కప్‌లో 'సూపర్ 4'లోకి అడుగు పెట్టింది. బంగ్లాదేశ్‌తో జరిగిన గ్రూప్ 'బి' మ్యాచ్‌లో లంక 2 వికెట్ల తేడాతో విజయం సాధించింది. చివరి 2 ఓవర్లలో గెలుపు కోసం 25 పరుగులు చేయాల్సి ఉండగా, బంగ్లా విజయం ఖాయమనిపించింది. అయితే 19వ ఓవర్ వేసిన ఇబాదత్ 17 పరుగులు సమర్పించుకోవడంతో లంక పని సులువైంది. 8 వైడ్‌లు, 2 నోబాల్‌లు వేసిన బంగ్లా ఫలితం అనుభవించింది. ముందుగా బంగ్లాదేశ్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 183 పరుగులు చేసింది. అఫీఫ్ హొస్సేన్ (22 బంతుల్లో 39; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), మెహదీ హసన్ (26 బంతుల్లో 38; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. అనంతరం శ్రీలంక 19.3 ఓవర్లలో 8 వికెట్లకు 184 పరుగులు సాధించింది. కుశాల్ మెండిస్ (37 బంతుల్లో 60; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), దసున్ షనక (33 బంతుల్లో 45; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు.

ఆస్ట్రేలియా ప్రపంచకప్ జట్టులో టిమ్ డేవిడ్



సిడ్నీ: సొంతగడ్డపై జరిగే టి20 ప్రపంచ కప్ కోసం డిఫెండింగ్ చాంపియన్, ఆతిథ్య ఆస్ట్రేలియా అందరి కంటే ముందుగా జట్టును ప్రకటించింది. సింగపూర్‌లో పుట్టి ఆస్ట్రేలియాకు వలస వచ్చిన విధ్వంసక బ్యాటర్ టిమ్ డేవిడ్ తొలిసారి ఆసీస్ టీమ్‌లోకి ఎంపికయ్యాడు. 2021 ప్రపంచ కప్ గెలిచిన జట్టులో ఒకే ఒక మార్పు జరిగింది. లెగ్‌స్పిన్నర్ మైకేల్ స్వెప్సన్ స్థానంలో టిమ్ డేవిడ్‌కు స్థానం లభించింది. మరో వైపు 3 టి20 మ్యాచ్‌ల కోసం ఈ నెలలో భారత్‌లో పర్యటించే ఆసీస్ టీమ్‌ను కూడా ప్రకటించారు. స్టార్ ఓపెనర్ డేవిడ్ వార్నర్‌కు ఈ సిరీస్‌కు విశ్రాంతినిచ్చి అతనికి బదులుగా కామెరాన్ గ్రీన్‌కు చోటు కల్పించారు. ఇది మినహా భారత్‌లో పర్యటించే జట్టే వరల్డ్ కప్ బరిలోకి దిగుతుంది.


ఆస్ట్రేలియా టి20 ప్రపంచ కప్ జట్టు: ఆరోన్ ఫించ్ (కెప్టెన్), వార్నర్, మిచెల్ మార్ష్, ఇన్‌గ్లిస్, స్టీవ్ స్మిత్, మ్యాక్స్‌వెల్, స్టొయినిస్, వేడ్, డేవిడ్, అగర్, జంపా, స్టార్క్, కమిన్స్, హాజల్‌వుడ్, కేన్ రిచర్డ్సన్.



విశాఖ టు ఫిజీ!

భారత యుద్ధ నౌక ఐఎన్ఎస్ సాత్పురా.. తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రం విశాఖపట్నం నుంచి ఫిజీ దేశానికి గురువారం చేరుకుంది. ద్వైపాక్షిక విన్యాసాల్లో పాల్గొనేందుకు దక్షిణ పసిఫిక్ మహా సముద్రంలోని సువా తీరానికి చేరుకున్న నౌకాదళ బృందానికి ఫిజీ దేశ రక్షణ బృందం స్వాగతం పలికింది. నాలుగేళ్ల తర్వాత ఫిజీ వెళ్లిన భారత యుద్ధ నౌక ఇదే కావడం విశేషం. - సాక్షి, విశాఖపట్నం

చిత్రంలో వైఎస్సార్ చరిత్ర



దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని ఆయన జీవిత చరిత్రను నంద్యాలకు చెందిన ప్రముఖ చిత్రకారుడు కోటేష్ చిత్ర రూపంలో డ్రాయింగ్‌చార్ట్‌పై మైక్రో పెన్నుతో చిత్రీకరించారు. 13 అంగుళాల పొడవు, 10 అంగుళాల వెడల్పు గల డ్రాయింగ్ చార్ట్‌పై వైఎస్సార్ పుట్టుక నుంచి మరణం వరకు అన్ని విశేషాలను పొందుపరిచారు. - నంద్యాల (అర్బన్)



రెండు తలల దూడ

వైఎస్సార్ జిల్లా బద్వేలు మండలంలోని బాలాయపల్లి గ్రామానికి చెందిన మన్నెం శంకర్‌రెడ్డి అనే రైతుకు చెందిన గేదె బుధవారం రెండు తలల దూడ(మగ)కు జన్మనిచ్చింది. గేదె, దూడ ఆరోగ్యంగా ఉన్నాయని రైతు తెలిపారు. వినాయక చవితి రోజు రెండుతలల దూడ పుట్టిందని తెలియడంతో స్థానికులు, సమీప గ్రామాల ప్రజలు కూడా వచ్చి చూసి వెళుతున్నారు. - అట్లూరు

క్లుప్తంగా

గ్రహ శకలం కనుగొన్న విద్యార్థిని

అరుదైన రికార్డు కైవల్యరెడ్డి సొంతం



నిడదవోలు: తూర్పు గోదావరి జిల్లా నిడదవోలుకి చెందిన పదో తరగతి విద్యార్థి కుంచాల కైవల్యరెడ్డి మరో అరుదైన రికార్డును సొంతం చేసుకుంది. అంగారక, బృహస్పతి గ్రహాల మధ్య ఉన్న ముఖ్యమైన ఆస్టాయిడ్ బెల్ట్‌లో గ్రహ శకలం 2021 సీఎం37ను కనుగొన్నది. నాసా భాగస్వామ్య సంస్థ అయిన అంతర్జాతీయ ఆస్ట్రనామికల్ సెర్చ్ కొలాబిరేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించిన క్యాంపెయిన్‌లో ఈ గ్రహశకలాన్ని కనిపెట్టింది. ఈ మేరకు అంతర్జాతీయ ఆస్ట్రనామికల్ సెర్చ్ కొలాబిరేషన్ సంబంధిత ధ్రువీకరణపత్రాన్ని కైవల్యకు అందజేసింది. పాన్‌స్టార్స్ టెలిస్కోప్ సాయంతో తీసిన అంతరిక్ష ఛాయా చిత్రాలను ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి విశ్లేషించడం ద్వారా ఈ గ్రహశకలాన్ని గుర్తించినట్లు కైవల్య తెలిపింది. ఢిల్లీకి చెందిన స్వచ్ఛంద సంస్థ స్పేస్‌పోర్ట్ ఇండియా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, అధ్యక్షుడు సమీర్ సత్యదేవ్ వద్ద కైవల్యరెడ్డి శిక్షణ తీసుకుని 'గామా' టీం పేరు తో శకలాన్ని గుర్తించింది. గతంలో కైవల్య 2020 పీఎస్ 24 అనే మెయిన్ బెల్ట్‌లో ఉన్న గ్రహశకలాన్ని కనుగొనడంతో సీఎం వైఎస్ జగన్ ఆమెను అభినందిస్తూ రూ.లక్ష నగదు బహుమతి అందజేసి ప్రోత్సహించారు. రెండో గ్రహశకలం కనుగొన్న కైవల్యని తల్లిదండ్రులు శ్రీనివాసరెడ్డి, విజయలక్ష్మి అభినందించారు.

శ్రీశైలంలో రూ.43 కోట్లతో అభివృద్ధి


కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



శ్రీశైలం టెంపుల్ : ప్రధాని నరేంద్రమోదీ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి శ్రీశైల క్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం రూ.43 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. శ్రీశైలంలోని శ్రీ భ్రమరాంబ అతిథి గృహంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 'ప్రసాద్' పథకం ద్వారా శ్రీశైలంలో యాంఫీ థియేటర్, శిఖరేశ్వరం, హఠకేశ్వరం వద్ద భక్తుల సౌకర్యార్థం భవనాలు నిర్మించామని చెప్పారు. శ్రీశైలాన్ని దృష్టిలో పెట్టుకుని గుంటూరు–తిరుపతి రైలును మార్కాపురం మీదుగా నడుపుతున్నట్లు చెప్పారు. హైదరాబాద్ నుంచి శ్రీశైలానికి రైలు మార్గం ప్రతిపాదనలు ఏ దశలో ఉన్నాయో వివరాలను తనవద్దకు పంపిస్తే రైల్వేశాఖ మంత్రి, ఉన్నతాధికారులతో చర్చిస్తామని తెలిపారు. శ్రీశైలంలోని ఆలయానికి దూరంగా యాంఫీ థియేటర్ నిర్మించడంపై కిషన్ రెడ్డి అసంతృప్తి వ్యక్తంచేశారు. దేవస్థాన ధర్మకర్తల మండలి అధ్యక్షుడు రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఈవో ఎస్.లవన్న, ఈఈ వి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌పై అక్రమ కేసులు పెట్టి డిస్మిస్ చేశారు

- ప్రకాష్ ఫిర్యాదుపై సీబీఐ విచారణ జరిపించాలి
- సీఎం జగన్‌కు రాసిన లేఖలో చంద్రబాబు డిమాండ్



సాక్షి, అమరావతి: అనంతపురం జిల్లాలో ఏఆర్ కానిస్టేబుల్ కె.ప్రకాష్‌పై అక్రమ కేసులు పెట్టి సర్వీస్ నుంచి డిస్మిస్ చేశారని టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఆరోపించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి గురువారం చంద్రబాబు ఓ లేఖ రాశారు. బాధిత మహిళ శ్రీలక్ష్మి మీడియా ముందుకు వచ్చి ప్రకాష్‌పై నమోదు చేసినది తప్పుడు కేసు అని చంద్రబాబు ఆ లేఖలో పేర్కొన్నారు. కానిస్టేబుల్ ప్రకాష్ ఫిర్యాదు మేరకు అనంతపురం టూటౌన్ పోలీసు స్టేషన్లో కేసు నమోదైందని, దానిపై పారదర్శకంగా విచారణ జరగాలన్నారు. ఆ ఫిర్యాదులో నిందితులుగా ఉన్న ముగ్గురు పోలీసు అధికారులు ప్రస్తుతం అదే జిల్లాలో కీలకమైన స్థానాల్లో ఉన్నందున విచారణ పూర్తయ్యే వరకు వారిని వీఆర్‌లో ఉంచాలని కోరారు.

ఏపీలో దేదీప్యమానం


సౌర విద్యుదుత్పత్తిలో దేశంలోనే కీలకంగా రాష్ట్రం

- ఇతర రాష్ట్రాలకు మనల్నే ఆదర్శంగా చూపుతున్న కేంద్రం
- రాష్ట్రంలో 4,390.48 మెగావాట్ల సౌర విద్యుదుత్పత్తి సామర్థ్యం

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో సౌర విద్యుదుత్పత్తి సామర్థ్యం అంతకంతకూ పెరిగిపోతోంది. 2015లో రాష్ట్రంలో సౌర విద్యుదుత్పత్తి సామర్థ్యం కేవలం 279 మెగావాట్లు కాగా, ఇప్పుడది 4,390.48 మెగావాట్లకు చేరింది. 2020లో రాష్ట్రంలో స్థాపిత సౌర విద్యుత్ సామర్థ్యం 3,744 మెగా వాట్లుగా ఉంది. 2021లో దేశంలో 10 గిగావాట్ల సౌర విద్యుత్ సామర్థ్యాన్ని స్థాపిస్తే.. అందులో 50 శాతం ఏపీ, రాజస్థాన్, కర్ణాటక రాష్ట్రాల్లోనే నెలకొల్పినట్టు అధ్యయనంలో వెల్లడైంది. సోలార్ రూఫ్‌టాప్ ఇన్‌స్టలేషన్‌లు 2021లో 138 శాతం పెరగడంతో 2021–22 చివరి నాటికి 4,148.91 మెగావాట్లుగా నమోదైంది. ప్రస్తుత 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే సౌర విద్యుదుత్పత్తి సామర్థ్యం 241.57 మెగా వాట్లు అదనంగా పెరిగింది. ఒక్కో మెగావాట్ నుంచి ఏటా సగటున దాదాపు 15 లక్షల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతోంది.

ఇతర రాష్ట్రాలకు ఆదర్శం

దేశ వ్యాప్తంగా ఈ ఏడాది మొదటి అర్ధ భాగంలో



విశాఖలోని సింహాద్రి పవర్ ప్లాంట్ వద్ద నీటిలో తేలియాడే సౌర విద్యుత్ ఉత్పత్తి కేంద్రం

(జనవరి–జూన్) 47.64 బిలియన్ యూనిట్ల సౌర విద్యుదుత్పత్తి జరిగింది. గతేడాది ఇదే కాలంతో పోలిస్తే 34 శాతం పెరిగింది. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో (మొదటి త్రైమాసికం) 22.22 బిలియన్ యూనిట్లుండగా, రెండో త్రైమాసికం(ఏప్రిల్, మే, జూన్)లో 25.41 బిలియన్ యూనిట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి అయ్యింది. అంటే తొలి త్రైమాసికం కంటే 14 శాతం పెరుగుదల రెండో త్రైమాసికంలో వచ్చింది. అదే 2021లో ఇదే సమయానికి జరిగిన ఉత్పత్తితో పోల్చితే 40 శాతం పెరిగినట్టు స్పష్టంగా కనిపిస్తోంది. అయితే 2030 నాటికి థర్మల్ విద్యుత్‌ను 32 శాతానికి తగ్గించాలని, కర్బన ఉద్గారాలను 2070 నాటికి సున్నాకు తేవాలని కేంద్రం లక్ష్యాన్ని నిర్దేశించింది. దీనికి అనుగుణంగా పునరుత్పాదక విద్యుదుత్పత్తికి ప్రాధాన్యం ఇస్తున్న ఏపీని కేంద్రం ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా చూపుతోంది. 2024 నాటికి అందరూ ఏపీనే అనుసరించాలని, వ్యవసాయానికి సౌర విద్యుత్‌నే వాడాలని అన్ని రాష్ట్రాలూ, కేంద్ర పాలిత ప్రాంతాలకు కేంద్రం తాజాగా సూచించింది.

రైతులకు ఉచిత విద్యుత్‌ను హక్కుగా అందించాలన్నదే లక్ష్యం



రాష్ట్రంలో పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగానికి ప్రభుత్వం పెద్దపీట వేసింది. పర్యావరణ హితంగా విద్యుదుత్పత్తి సాధించగల సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడి 33,240 మెగావాట్ల సామర్థ్యంతో 29 రివర్స్ పంప్డ్ స్టోరేజ్ హైడ్రోపవర్ ప్రాజెక్టులను స్థాపిస్తోంది. రానున్న 30 ఏళ్ల పాటు వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌ను రైతన్నకు హక్కుగా అందించాలని నిర్ణయించింది. దాని కోసం ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సెకీ)తో 7 వేల మెగావాట్ల సౌర విద్యుత్ కోసం ఒప్పందం చేసుకుంది.

– విజయానంద్, ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి.

నీతిఆయోగ్ వర్కింగ్ గ్రూప్‌లో ఏపీకి చోటు

- వచ్చే 30 ఏళ్లలో వ్యవసాయ విధానాల రూపకల్పనలో భాగస్వామ్యం
- ఏపీ వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్‌కు ప్రాతినిధ్యం కల్పించిన కేంద్రం

సాక్షి, అమరావతి : రానున్న ముప్పై ఏళ్లలో వ్యవసాయ విధానాల రూపకల్పన కోసం నీతి ఆయోగ్ పర్యవేక్షణలో ఏర్పాటుచేసిన జాతీయస్థాయి వర్కింగ్ గ్రూప్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం కల్పిస్తూ కేంద్రం ఆదేశాలు జారీచేసింది. విదేశాల నుంచి దిగుమతులపై ఆధారపడకుండా దేశీయంగా పెరుగుతున్న జనాభా అవసరాలకు తగినట్లుగా నాణ్యమైన ఆహార ఉత్పత్తుల దిగుబడులను పెంచుకునేందుకు అనుసరించాల్సిన కార్యాచరణపై పాలసీల రూపకల్పనలో ఈ కమిటీ క్రియాశీలకంగా వ్యవహరిస్తుంది. వ్యవసాయం, ఉద్యానం, పట్టు, పశుసంవర్ధక, మత్స్య తదితర వ్యవసాయ అనుబంధ రంగాలను బలోపేతం చేసేందుకు ఈ కమిటీ రూపొందించే విధానాలను కేంద్రం అమలు చేస్తుంది. ముఖ్యంగా రానున్న కాలంలో ఉత్పత్తులు ఎలా ఉండబోతున్నాయి.. దేశంలో ఏ పంటలు వేస్తే బాగుంటుంది.. మారుతున్న ఆహారపు అలవాట్లకు అనుగుణంగా ఏ పంటలను ప్రోత్సహించాలి.. ఏ విధంగా లింకేజ్ చేయాలి.. ఆ దిశగా ఎలాంటి పరిశోధనలు జరగాలి.. విద్య, పరిశోధనా సంస్థలను ఏ విధంగా బలోపేతం చేయాలి అనే అంశాలపై ఈ కమిటీ దిశానిర్దేశం చేస్తుంది. ముఖ్యంగా.. వరి, గోధుమలు, మొక్కజొన్న, అపరాలు, ఆహార ధాన్యాలు, నూనె గింజలు, చెరకు, పండ్లు, కూరగాయలు, పాడి ఉత్పత్తులు, పాలు, మాంసం, గుడ్లు, మత్స్య ఉత్పత్తుల దిగుబడులు తదితర అవసరాలను అంచనా వేస్తారు. అలాగే, వాటి దిగుబడులు, ఎగుమతులను కూడా అంచనా వేస్తారు. వ్యవసాయ, అనుబంధ విభాగాలకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, రుణాలు, యాంత్రీకరణ ఏ మేరకు అవసరమవుతాయో ఈ పాలసీలకనుగుణంగా నిర్ణయిస్తారు. దేశ భవిష్యత్ కోసం ప్రధాని మోదీ ప్రకటించిన అమృత్‌కాల్‌లో భాగంగా ఈ కమిటీని ఏర్పాటు చేస్తున్నారు. పదేళ్ల పాటు కొనసాగనున్న ఈ కమిటీకి ఐసీఏఆర్ డైరెక్టర్ ప్రొ. పీఎస్ బిర్తాల్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఇందులో సభ్యులుగా ఐఈజీ ప్రొ. డాక్టర్ సీఎస్ఎస్ శేఖర్, ఐసీఏఆర్ (హైదరాబాద్) ప్రిన్సిపల్ సైంటిస్ట్ ఎస్.శివరామ్నే, డాక్టర్ శివేంద్ర కేఆర్ శ్రీవాస్తవ, వ్యవసాయ, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖలోని పంటలు, ఎంఐడీహెచ్ విభాగాల జాయింట్ సెక్రటరీలు, ఐసీఏఆర్ (సీడ్స్) ఏడీజీ, పశుసంవర్థక, మత్స్య మంత్రిత్వ శాఖ కమిషనర్, ఎరువుల విభాగం జాయింట్ సెక్రటరీ, ఫెర్టిలైజర్స్ అసోసియేషన్ డీజీ తదితర జాతీయస్థాయి సభ్యులతో పాటు ఏపీ, హరియాణా, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల వ్యవసాయ శాఖ అడిషనల్, స్పెషల్ సీఎస్‌లకు చోటు కల్పించారు. అత్యంత ప్రాధాన్యత కల్గిన ఈ కమిటీ అగ్రి ఇన్‌పుట్స్, డిమాండ్ అండ్ సప్లైపై అధ్యయనం చేసి తొమ్మిది నెలల్లో నీతి ఆయోగ్‌కు నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది.

నేరాలకు కేరాఫ్ ప్రకాష్

- ఏఆర్ కానిస్టేబుల్ ప్రకాష్ తీరు ఆది నుంచీ వివాదాస్పదమే
- నిబంధనల ప్రకారమే ప్రకాష్ డిస్మిస్
- అనంతపురం జిల్లా అదనపుఎస్పీ

అనంతపురం శ్రీకంఠం సర్కిల్ : ఏఆర్ కానిస్టేబుల్ ప్రకాష్ ఆది నుంచీ నేర చరిత్ర కలిగిన వాడని అనంతపురం జిల్లా అదనపు ఎస్పీ నాగేంద్రుడు తెలిపారు. ఆయన గురువారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ ప్రకాష్‌పై ఉన్న కేసులు, అభియోగాలను వివరించారు. ఉన్నతాధికారులు అతన్ని ఉద్దేశపూర్వకంగా ఇబ్బందులు పెడుతున్నారన్న దానిలో వాస్తవం లేదన్నారు. ప్రకాష్‌పై అభియోగాలు రుజువైనందున అండర్ రూల్ ఆఫ్ – 20 'ఏపీసీఎస్ రూల్స్ 1991' ప్రకారం ఆగస్టు 24న ప్రకాష్‌ను సర్వీస్ నుంచి డిస్మిస్ చేస్తూ ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప ఉత్తర్వులు జారీ చేశారని చెప్పారు. విచారణ రిపోర్టులు అన్నీ సక్రమంగా ఉన్నాయన్నారు.

ఇదీ లక్ష్మి కేసు..

'అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం గుడ్డాలపల్లికి చెందిన బి.లక్ష్మి 'స్పందన'లో జిల్లా ఎస్పీకి లిఖితపూర్వక పిటిషన్ ఇచ్చింది. కానిస్టేబుల్ ప్రకాష్ తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా అనుభవించడమే కాకుండా 30 తులాల బంగారం, రూ.10 లక్షల నగదు తీసుకొన్నాడని, ఆ తర్వాత పెళ్లికి నిరాకరించి, బెదిరించినట్లు ఎస్పీకి ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదును ఎస్పీ తక్షణమే గార్లదిన్నె పోలీసు స్టేషన్‌కు బదిలీ చేశారు. గార్లదిన్నె ఎస్‌ఐ 2019 జూన్ 22న కేసు నమోదు చేశారు. ప్రకాష్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్‌ఐ ఎస్పీకి నివేదిక పంపారు. దాని ఆధారంగా 2019 డిసెంబరు 19న ప్రకాష్‌ను సస్పెండ్ చేశారు. అదే రోజు ప్రిలిమినరీ ఎంక్వైరీ ఆఫీసర్‌గా ధర్మవరం ఎస్‌డీపీవో రమాకాంత్‌ని నియమించారు. ఓరల్ ఎంక్వైరీ ఆఫీసర్‌గా అనంతపురం సీసీఎస్ డీఎస్పీ ఎస్.



ఏఎస్పీ నాగేంద్రుడు

మహబూబ్ బాషాను నియమించారు. విచారణాధికారులు 8 మంది సాక్షుల వాంగ్మూలం నమోదు చేశారు. మార్చి 1న లక్ష్మి కూడా డీఎస్పీ మహబూబ్ బాషా ముందు సాక్ష్యం ఇచ్చింది. ప్రకాష్ పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పాడని తెలిపింది. ఈ ఏడాది జూన్ 23న ప్రకాష్ ఓరల్ ఎంక్వైరీ ఆఫీసరు ముందు సంజాయిషీ ఇచ్చారు. లక్ష్మి చెప్పిన విషయాలను అతను ఖండించలేదు. దీంతో ఓరల్ ఎంక్వైరీ ఫైనల్ రిపోర్టును జూన్ 23న డీఎస్పీ మహబూబ్‌బాషా జిల్లా ఎస్పీకి అందజేశారు. అనంతరం ప్రకాష్‌కు మూడు నోటీసులిచ్చాం. చివరి నోటీసుకు అతను ఆగస్టు 17న సంజాయిషీ ఇచ్చారు' అని ఏఎస్పీ వివరించారు.

ప్రకాష్ నేరాల చిట్టా ఇది

- 2000 ఫిబ్రవరి 11న ఆర్ఎస్ఐ శేఖర్‌పై హత్యాయత్నం కేసులో ప్రకాష్ నిందితుడు. ఈ కేసులో 2001 జనవరి 1న అతన్ని అరెస్టు చేశాం.
- 2006లో హైవే పెట్రోలింగ్ వాహనం డ్రైవర్‌గా ఉన్న ప్రకాష్.. ఇందిరా ప్రియదర్శిని హోటల్ సప్లయర్ బి.ధనుంజయబాబును ఇనుప రాడ్‌తో కొట్టాడు. ఈ కేసులో అతన్ని కోర్టు దోషిగా నిర్ధారించి 2 ఏళ్ల శిక్ష, రూ.2 వేలు జరిమానా విధించింది. అప్పీల్ సమయంలో నిందితుడు, ఫిర్యాదుదారు రాజీ పడ్డారు.
- 2008 అక్టోబరు 18న కదిరిలో బజాజ్ క్యాలిబర్ (ఏపీ02హెచ్ 5780) చోరీ చేశాడు.
- 2009లో అనంతపురం సాయినగర్‌కు చెందిన కురుగోడు గంగాధర్‌కు స్ప్లెండర్ బైక్(ఏపీ04 ఎఫ్ 0874) చోరీ చేశాడు. ఈ కేసులో ప్రకాష్‌ను పోలీసులు 2009 జూన్ 13న అరెస్టు చేశారు.
- 2009 జూన్ 12న జిల్లా పోలీసు కార్యాలయం వద్ద బైక్ (ఏపీ02 కే 9283) చోరీ చేశాడు. ఈ కేసులోనూ ప్రకాష్‌ను అరెస్టు చేశారు.
- కదిరిలో 2014 ఫిబ్రవరి 11న ప్రకాష్, మరో నలుగురు ఏపీ 02 ఆర్ 1456 స్కార్పియో వాహనంలో అబ్రహాంను కిడ్నాప్ చేసి కేరళలో నిర్బంధించి, ఖాళీ పత్రాలపై సంతకాలు చేయించుకున్నారు. దీనిపైనా కేసు నమోదు చేశారు.
- 2019లో అనంతపురంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం జరుగుతుండగా కలెక్టర్ ముందు ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేయబోయాడు. దీనిపై టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.
- ఈ ఏడాది అనంతపురం 3 టౌన్ పోలీస్ స్టేషన్‌లో ప్రకాష్‌పై ఫోర్జరీ కేసు నమోదయ్యింది. ఈ తరహా 10 కేసులతో పాటు శాఖాపరమైన చర్యలు ప్రకాష్‌పై చాలా ఉన్నాయి.
- 2008 జూన్ 25న ప్రకాష్‌ను ఓసారి సర్వీస్ నుంచి డిస్మిస్ చేశారు.

ఎస్పీ, మరో ఇద్దరు అధికారులపై కేసు నమోదు

డిస్మిస్ అయిన ఏఆర్ కానిస్టేబుల్ కె.ప్రకాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనంతపురం టూటౌన్ పోలీసులు అనంతపురం జిల్లా ఎస్పీ ఫక్కీరప్ప కాగినెల్లి, ఏఆర్ అదనపు ఎస్పీ ఎ.హనుమంతు, అనంతపురం సీసీఎస్ డీఎస్పీ ఎస్.మహబూబ్ బాషాలపై (క్రైం నంబర్ 209/2022 అండర్ సెక్షన్ 167, 177, 182 రెడ్‌విత్ 34 ఐపీసీ 3 (1)(క్లాజ్), సెక్షన్ 3 (2) సెవెన్ ఆఫ్ ఎస్సీ, ఎస్టీ యాక్ట్) కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణాధికారిగా పలమనేరు ఎస్‌డీపీవో సి.ఎం. గంగన్నను నియమిస్తూ డీజీపీ ఎం.రవి ప్రకాష్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రకాష్ అందుబాటులోకి రాలేదు : గంగన్న

ఎస్పీపై నమోదైన కేసులో విచారణాధికారి గంగన్న గురువారం అనంతపురం వచ్చారు. విచారణకు హాజరుకావాలని కానిస్టేబుల్ ప్రకాష్‌ను ఫోన్‌లో సంప్రదించామన్నారు. ఆయన అందుబాటులోకి రాకపోవడంతో నోటీసు ఇంటికి, ప్రకాష్ ఫోన్‌కు మెసేజ్, వాట్సాప్ ద్వారా పంపినట్లు చెప్పారు.

నీట్ ప్రిలిమినరీ 'కీ'పై విద్యార్థుల ఆందోళన

సాక్షి, హైదరాబాద్: ఎన్‌టీఏ బుధవారం విడుదల చేసిన నీట్–2022 ప్రిలిమినరీ 'కీ'పై విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరీక్షలో వచ్చిన ప్రశ్నలు కొన్ని అస్పష్టంగా, కాన్సెప్ట్‌కు విరుద్ధంగా ఉన్నాయని నీట్‌కు హాజరైన శ్రీచైతన్య విద్యార్థులు తెలిపారు. ప్రత్యేకించి భౌతిక శాస్త్రంలో ఫొటో ఎలక్ట్రిక్ ఎఫెక్ట్‌కు సంబంధించిన ప్రశ్న పూర్తిగా భావనకు విరుద్ధంగా ఉందని వదిలేశామని, ప్రిలిమినరీ 'కీ'లో ఎన్‌టీఏ ఆ లోపాన్ని గుర్తించలేదన్నారు. వృక్షశాస్త్రంలో, కెమిస్ట్రీలోనూ ఇలాంటి తప్పులు దొర్లాయన్నారు. ఇలాంటి తప్పుల వల్ల తాము కొన్ని మార్కులు కోల్పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆందోళనను పరిగణనలోకి తీసుకున్న శ్రీచైతన్య నిపుణుల కమిటీ సైతం ప్రిలిమనరీ 'కీ'ని పరిశీలించింది. విద్యార్థుల అభిప్రాయాలతో ఏకీభవించిన ఆ కమిటీ.. ఫైనల్ 'కీ'లోనైనా లోపాలను సవరించి, విద్యార్థులకు న్యాయం చేయాలని ఎన్‌టీఏను కోరింది.

శ్రీశైలంలోకి 1,27,973 క్యూసెక్కుల వరద

శ్రీశైలంప్రాజెక్ట్/విజయపురిసౌత్ : శ్రీశైలం జలాశయానికి జూరాల, సుంకేసుల నుంచి 1,27,973 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. జలాశయంలో గురువారం సాయంత్రానికి 884.80 అడుగుల మట్టంలో 214.8450 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాం నాలుగు గేట్లను పదడుగులు ఎత్తి 1,11,932 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు వదులుతున్నారు. కుడి, ఎడమగట్టు కేంద్రాల్లో విద్యుదుత్పత్తి కొనసాగిస్తూ నీరు విడుదల చేస్తున్నారు. బ్యాక్ వాటర్ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా 10 వేల క్యూసెక్కులు, హంద్రీ–నీవా సుజల స్రవంతికి 1,688 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 800 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. నాగార్జున



సాగర్ జలాశయానికి 1,80,197 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. జలాశయం 16 గేట్లను ఐదడుగులు, రెండుగేట్లను పదడుగులు ఎత్తి 1,59,012 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. గేట్ల ద్వారా, విద్యుదుత్పాదనతో కలిపి సాగర్ వద్ద నదిలోకి 1,91,492 క్యూసెక్కులు విడుదలవుతోంది. సాగర్‌లో 589.70 అడుగుల మట్టంలో 311.1486 టీఎంసీల నీరు ఉంది.

టీడీపీతో పొత్తు ఊహాజనిత ప్రచారమే

బీజేపీ ఎన్నికల కమిటీ సభ్యుడు ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్

సాక్షి, హైదరాబాద్: టీడీపీతో బీజేపీ పొత్తు అనేది కేవలం ఊహాజనిత ప్రచారమేనని బీజేపీ పార్లమెంటరీ బోర్డ్, ఎన్నికల కమిటీ సభ్యుడు ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ ఒంటరిగా పోటీ చేస్తుందని తెలిపారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్‌తో కలిసి ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో జనసేనతో కలిసి బీజేపీ ఎన్నికలకు వెళ్తుందని చెప్పారు. దక్షిణాదిలో కర్ణాటక తర్వాత తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తంచేశారు. బిహార్, తెలంగాణ సీఎంలు కేసీఆర్, నితీశ్‌కుమార్ భేటీ పచ్చి అవకాశవాదానికి సంకేతమని డాక్టర్ లక్ష్మణ్ అభివర్ణించారు.

వచ్చేనెల నుంచి ఆర్టీసీ సిబ్బందికి పీఆర్సీ వేతనాలు

ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు వెల్లడి

సాక్షి, అమరావతి : సాంకేతిక కారణాలతో ఆర్టీసీ ఉద్యోగులకు పీఆర్సీ వేతనాలు ఆలస్యమయ్యాయని వచ్చేనెల నుంచి వాటిని అమలుచేస్తామని ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు తెలిపారు. 2022–23లో ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు 72 శాతం ఓఆర్ (ఆక్యుపెన్సీ రేషియో) నమోదైందన్నారు. విజయవాడలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ కార్గోకు తక్కువ కాలంలోనే ఆదాయం గణనీయంగా పెరిగిందన్నారు.

998 అద్దె బస్సులకు టెండర్లు

కొత్తగా 998 అద్దె బస్సులకు టెండర్లను పిలిచామని, డిసెంబర్‌లోపు అవి అందుబాటులోకి వస్తాయని ద్వారకా తిరుమలరావు తెలిపారు. కొత్తగా 62 నాన్‌ఏసీ స్లీపర్ బస్సులు ప్రవేశపెట్టేందుకు చర్యలు తీసుకున్నామని, ఈ బస్సుల బ్రాండ్‌కు 'స్టార్ లైనర్' పేరు ఎంపికైందన్నారు. ఆయన ఇంకా ఏమన్నారంటే...



దసరాకు 4వేల బస్సులు

- దసరా పండుగ పురస్కరించుకుని 4 వేల ప్రత్యేక బస్సులను నడిపేందుకు ప్రణాళికలు సిద్ధంచేశాం. ఇవన్నీ సాధారణ చార్జీలతోనే నడుస్తాయి.
- బీవోటీ పథకం కింద ఆటోనగర్ (విజయవాడ), కర్నూలు రాజ్‌విహార్ బస్‌స్టేషన్ల అభివృద్ధికి సంస్థ టెండర్లు ఆహ్వానిస్తున్నాం.
- పులివెందుల, రాయచోటి, ప్రొద్దుటూరు, కడప, గుడివాడ, హనుమాన్ జంక్షన్, నర్సాపురం, ఆత్మకూరు (కె), డోన్, బేతంచెర్ల, ప్యాపిలి, సింగరాయకొండ బస్‌స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నాం. రాజాం బస్‌స్టేషన్, తగరపువలస బస్ డిపో నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నాం.
- అన్ని గ్రామాల్లో లాజిస్టిక్స్ కార్యకలాపాలను విస్తరించాలనే యోచన ఉంది.

బస్సుల్లో డిజిటల్ చెల్లింపులు

దేశంలోనే ప్రప్రథమంగా ఏపీఎస్ ఆర్టీసీ యూనిఫైడ్ టికెటింగ్ సొల్యూషన్ (యూటీఎస్) విధానాన్ని ప్రవేశపెడుతోంది. ప్రస్తుతమున్న ఓపీఆర్ఎస్, కార్గో బుకింగ్, వెహికల్ ట్రాకింగ్, బస్‌పాస్ జారీ వంటివి ఒకే గొడుగు కిందకు వస్తాయి. ప్రస్తుతమున్న టిమ్ మెషీన్లకు బదులు ఈ–పోస్ మిషన్ల ద్వారా టికెట్లు జారీచేయడంతో పాటు క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు, ఫోన్ పే, గూగుల్ పే వంటి వాటి ద్వారా డిజిటల్ చెల్లింపులు జరిపే అవకాశం కల్పిస్తాం. విజయవాడ, గుంటూరు–1 డిపోలలో ఈ పైలెట్ ప్రాజెక్టు విజయవంతమైంది. ఈ ఏడాది చివరి నాటికి మొత్తం 129 డిపోలలో దీనిని విస్తరిస్తాం. వంద ఆధునిక ఏసీ విద్యుత్ బస్సులు తిరుమల–తిరుపతి ఘాట్ రోడ్డు, తిరుపతి–నెల్లూరు, మదనపల్లి–కడప ఇంటర్ సిటీ రూట్లలో తిరుగుతాయి. జనతా గ్యారేజ్ పథకాన్ని అమలుచేస్తున్నాం. ప్రైవేటు బస్సులు, ట్రక్కుల టైర్లను రీ క్యాపింగ్ చేయడం, ఇంజన్లు, గేర్ బాక్సులు, ఇతర ప్రధాన యూనిట్ల మరమ్మతులు, బస్‌బాడీ, ట్రక్ బాడీ మరమ్మతులు చేస్తాం.. అని ఆయన చెప్పారు.



అనంతపురం జిల్లా గుంతకల్లులో మహిళకు ప్రభుత్వ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

ఊరూరా పండుగలా..

సాక్షి, నెట్‌వర్క్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా సాగుతోంది. గ్రామాల్లో పర్యటిస్తోన్న ప్రజాప్రతినిధులు, అధికారులకు ప్రజలు ఘన స్వాగతం చెబుతున్నారు. అన్ని జిల్లాల్లోనూ గురువారం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందజేస్తోన్న సంక్షేమ పథకాలను వివరించారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. తమ సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న సీఎం వైఎస్ జగన్ వెంటే తామంతా నడుస్తామని ప్రజాప్రతినిధులతో ప్రజలు చెప్పారు. మేనిఫెస్టోలో పేర్కొన్న అన్ని హామీలను తప్పకుండా నెరువేరుస్తున్నామని ప్రజాప్రతినిధులు ప్రజలకు వివరించారు.



అనకాపల్లి జిల్లా లక్ష్మీపురంలో సమస్య వింటున్న ఎమ్మెల్యే పి.ఉమాశంకర్ గణేష్



కృష్ణా జిల్లా గూడపాడులో పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Survey no 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402. and Pulished at Survey No. 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08942-281444, 499, 466 Fax No. 08942-281666 RNI Regn No. APTEL/2008/23798.